
సాహితీ
గతి నిరంతర జ్వలితా
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 67 పేజీలు: 12 వెల: 6.50

యుఎస్‌లో వేగంగా కారు నడిపినా వీసా రద్దు

తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం సీరియస్

9లో




## ప్రభుత్వ భాగస్వామ్యంతోనే లక్ష్యాల సాధన

- పి4 పటిష్టతకోసం రాష్ట్ర స్థాయిలో కమిటీ
- మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన
- సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమం లక్ష్యాలను అధిగమిస్తుందని సిఎం చంద్రబాబు తెలిపారు.పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన జీరో పావర్టీ, పి4 కార్యక్రమాన్ని విస్తృత పరిచేలా పటిష్ట వ్యవస్థను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఇందుకు సంబంధించి స్టేట్ లెవెల్ సొసైటీని ఏర్పాటు చేస్తోందన్నారు. దీనికి ముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా, డిప్యూటీ సిఎం వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని వివరించారు. సిఇఒ, డైరెక్టర్, వారికి అనుసంధానంగా కాల్ సెంటర్, టెక్ టీమ్, ప్రోగ్రాం టీమ్, వింగ్ టీమ్ ఉంటాయని తెలిపారు. జిల్లా చాప్టర్‌కు జిల్లా మంత్రి ఛైర్‌పర్సన్‌గా, నియోజకవర్గ చాప్టర్‌కు ఎమ్మెల్యే ఛైర్‌పర్సన్‌గా, గ్రామ, వార్డు స్థాయిలో సెక్రటేరియట్ చాప్టర్లకు ఛైర్‌పర్సన్‌గా పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మిని స్ట్రేటివ్ సెక్రటరీలు ఉంటారు. రాష్ట్ర స్థాయి సొసైటీ ఏర్పాటు, పి4పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శిలను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని చెప్పారు. దాతలు ఎవరెవరు ఎంత మొత్తం ఇచ్చారు... ఇంకెంత సాయం 'బంగారు కుటుంబాలు'కు అవసరం అవుతుంది వంటి విషయాలు అన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పారదర్శకంగా ఉంటుందని, పి4పై విశ్వాసం మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

పేదరికం నిర్మూలనే కీలకంగా తీసుకుని వచ్చిన జీరోపావర్టీ, పి4 కార్యక్రమాలను మనం ప్రారంభించగా మంచి స్పందన లభించిందన్నారు. సమాజంలో ధనవంతులు మరింత ధనవంతులుగా పేదలు మరింత పేదలుగా తయారవడం ప్రమాదకరం. సమాజం మనకు ఎంతో ఇచ్చింది. మనం తిరిగి సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలి. అందుకే సమాజంలో అవకాశాలు అంది పుచ్చుకుని ఆర్థికంగా ఎదిగిన వారు అట్టడుగున ఉన్న పేదలను ఆదుకునే బాధ్యత తీసుకోవాలి. చేతనైనంత సాయం చేసి వారిని అన్ని విధాలా పైకి తేవాలి. సి4 విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది... అట్టడుగున ఉన్న 20 శాతం

>>2



మంగళవారం న్యూఢిల్లీలో దుబాయ్ యువరాజు షేక్ హమ్దన్ ప్రధాని మోడీతో భేటీ అయిన దృశ్యం

## రక్షణ, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం

### దుబాయ్ యువరాజుతో భేటీలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** భారత్‌లో మొట్టమొదటిసారి పర్యటనకు వచ్చిన దుబాయ్ యువరాజు రాకతో రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక సహకారం మరింత పటిష్టం అవుతుందని ప్రధానిమోడీ ఆకాంక్షించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అత్యంతశక్తివంతమైన యువరాజు తొలిసారి భారత్‌కు రావడం రెండుదేశాలమధ్య పరస్పర మైత్రీ బంధానికి నిదర్శనమాన్నరు. దుబాయ్ యువరాజు షేక్ హమ్దన్ బిన్ మహ్మద్ అల్‌మక్తూమ్ భారత్‌లో రెండురోజుల పర్యటన నిమిత్తం

>>2

## రూ.80 వేల కోట్లతో రిఫైనరీ

### కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్

**విజయవాడ, ఏప్రిల్8, ప్రభాతవార్తప్రతినిధి:** పెట్రోలియం రంగంలో అనేక రాష్ట్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయనీ కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఆ అవకాశాలను వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించారు. ఎపిలో రూ.80 వేల కోట్లతో రిఫైనరీ రాబోతోందని తెలిపారు. ఒడిశా పారాదీప్ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీ ఏర్పాటు చేస్తోంది. ఈ సందర్భంగా ఒడిశా ప్రభుత్వం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో హర్దీప్ సింగ్ పురి పాల్గొన్నారు. ఈ సందర్భంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ మాట్లాడుతూ ఎపిలో భారీ ఆయిల్ రిఫైనరీ అంశాన్ని ప్రస్తావించారు.గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకునే వాళ్లం. ఇప్పుడు 40 దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ముడి చమురు ధరలు తగ్గినప్పుడు కొనుగోలు చేసి ఎక్కువ నిల్వ చేస్తాం. ప్రస్తుతం ఒక్కో బ్యారల్ ముడి చమురు 60 డాలర్ల వరకుఉంది అని కేంద్రమంత్రి తెలిపారు.

## విద్యాశాఖలో సంస్కరణలు వేగవంతం

### మెగా డిఎస్సీపై నారా లోకేష్ సమీక్ష

**మంగళగిరి,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణలను జూన్ నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖలో సంస్కరణలు, మెగా డిఎస్సీ, ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాలు, డ్యాష్ బోర్డు రూపకల్పన తదితర అంశాలపై అధికారులతో లోకేష్ సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పూర్తిస్థాయి సంస్కరణల తర్వాత రాబోయే నాలుగేళ్ల విద్యాప్రమాణాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని అన్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా సాధ్యమైనంత త్వరగా మెగా డిఎస్సీ ప్రకటనకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాల ప్రకటన విడుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంప్రదాయ ప్రసార మాధ్యమాలతో పాటు ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన మనమిత్ర యాప్‌లో కూడా ఫలితాలు అందుబాటులోఉంచేలా చర్యలుచేపట్టాలన్నారు. ఆగస్టులో వివిధ రాష్ట్రాల విద్యామంత్రుల కాంక్లేవ్‌ను రాష్ట్రంలో నిర్వహించేందుకు కేంద్రమంత్రి ఇప్పటికే అంగీకారం తెలిపినందున, అందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లెర్నింగ్ అవుట్ కమ్స్, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అటెండెన్స్ వివరాలు, పెండింగ్ ఫైల్స్ తదితర వివరాలతో పూర్తిస్థాయి డ్యాష్ బోర్డును మే నెలకల్లా సిద్ధం చేయాలని ఆదేశించారు.

విద్యార్థులు లీప్ యాప్‌ను అపార్ ఐడితో లాగిన్ అయి వీక్షి ంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు అపార్ ఐడి నమోదు 85శాతం పూర్తయిందని, సాంకేతిక సమస్యలను అధిగమించి పూర్తిస్థాయి అపార్ ఐడి పూర్తిచే యాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ స్కూళ్లలో ఎట్టి పరిస్థితుల్లో డ్రాపవుట్స్ ఉండకూడ దని, అందుకు తగ్గట్లుగా చర్యలు చేపట్టాలని అన్నారు. సర్వశిక్ష నిర్వహణలో కొనసాగుతున్న పాఠశాలల్లో ఆన్ లైన్ విధానంలో పారదర్శకంగా అడ్మిషన్లు చేపడతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత సెలవుల్లో కెజిబివిల్లో టీచర్ల బదిలీలు పూర్తిచేసేందుకు మంత్రి అంగీకారం తెలిపారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ, ట్రైనింగ్ అకాడమీ, ఆర్కివ్స్ మ్యూజియం నిర్మాణాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని



మంగళవారం అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి నారా లోకేష్

అన్నారు. విద్యార్థుల మేధ స్సుకు పదును పెట్టే అధునాతన సాంకేతికతతో కూడిన క్లిక్కర్స్‌ను తొలుత 9వతరగతి విద్యా ర్థులకు అందుబాటులోకి తేవాలని, పనితీరును బట్టి రాబోయే రోజుల్లో 6నుంచి 10తరగతులకు అమలు చేయాలని సూచించారు. జిఓ నెం.117కు ప్రత్యామ్నాయ జిఓను సాధ్యమైనంత త్వరగా సిద్ధం చేయాలని అన్నారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాలలు తెరిచే రోజుకే పాఠ్యపుస్తకాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 48శాతం పుస్తకాల ముద్రణ పూర్తయినట్లు అధి కారులు తెలిపారు. రాష్ట్రంలో స్పెషల్ ఎడ్యు కేషన్‌కు సంబంధించిన పోస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. టీచర్ల బదిలీలు, పదో న్నతులకు సంబంధించి ఎటువంటి పైరవీలకు తావులేకుండా నిబంధనలకు లోబడి పూర్తి పారద ర్శక చర్యలు చేపట్టాలనిఅన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ నారాయణ్ భరత్ గుప్త, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాస రావు, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎండి దీవెన్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

## జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

### ఛైర్మన్‌గా సిఎం, వైస్ ఛైర్మన్‌గా నీటిపారుదల మంత్రి

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** జలహారతి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఎపి ప్రభుత్వం ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పేరిట కీలక ఉత్తర్వులు జారీ చేసింది.పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు ఈకార్పోరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కార్పోరేషన్ ఛైర్మన్ సిఎం చంద్రబాబు నాయుడు, వైస్ ఛైర్మన్‌గా నిమ్మల రామానాయుడు నియమిస్తున్నట్లు ఉత్తర్వులు స్పష్టం చేసాయి.సంస్థ సిఇఒ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,సభ్యులుగా ఇతర అధికారులను నియమించింది.పోలవరం ప్రాజెక్టు నుంచి వరద జలాలను తరలించేలా పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సర్కార్ భావిస్తున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 80 లక్షల మందికి తాగునీరు అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని వెల్లడించారు. 9.14లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమికి సాగునీరు అందించొచ్చని, కొత్తగా మరో

>>2

## వల్లభనేని వంశీకి మరో ఎదురుదెబ్బ

### కిడ్నాప్ కేసులో రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి దెబ్బ మీద దెబ్బ తగులుతుంది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఆయనకు న్యాయస్థానం మరోసారి రిమాండ్ పొడిగించింది. వంశీ కస్టడీ ఇవాళ్టితో ముగియడంతో పోలీసులు విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన కోర్టు ఈనెల 22 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుతో పాటు టిడిపి కార్యాలయంపై దాడి కేసుల్లో వల్లభనేని వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు ఈకేసులో అరెస్టయిన మరో నలుగురు నిందితులకు కూడా కోర్టు రిమాండ్ గడువును పెంచింది. మరోవైపు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నిందితుడు రంగాపై పటమట పోలీసులు పిటి వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కోర్టు పిటి వారెంట్ పిటిషన్‌ను అనుమతించింది.

## బాధ్యతా రాహిత్యం సహించబోను

### అధికారులకు మంత్రి సవిత హెచ్చరిక



**పులివెందుల,ఏప్రిల్ 8, ప్రభాత వార్త:** ప్రభుత్వ అధికారులే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిసి సంక్షేమశాఖ మరియు జౌళి మంత్రి మరియు వైయస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితమ్మ అన్నారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లేకపోతే సెలవు మీద వెళ్లచ్చు అని బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం శాఖాపరంగా ప్రస్తుతం అమలు అవుతున్న ప్రభుత్వ పథకాల గురించి ఏ మేరకు ప్రజలకు అందాయి ప్రభుత్వంనుంచి ఇంకా ఏమన్నా అందించాల్సిన అవసరాలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు.

వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖలలో రైతులకు అందుతున్న పథకాలను తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, డిఆర్‌డిఎ, సాంఘిక సంక్షేమ శాఖ, రోడ్డు భవనాల శాఖ, విద్యాశాఖ తదితర శాఖల నందు అమలవుతున్న పథకాల గురించి కావలసిన నిధులు గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లతో వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. సూర్యఘర్ పథకం గురించి కలిగే లాభాలను ప్రజలకి అన్ని శాఖల అధికారులు తీసుకెళ్లాలని సూచించారు. గుంతలనింపు

>>2

## చంద్రబాబుకు వాచ్‌మెన్లుగా పనిచేస్తున్న పోలీసులు

### రాష్ట్రం అంతటా బీహార్ పరిస్థితులే: మాజీ సిఎం జగన్

**అనంతపురం, ఏప్రిల్ 8, (ప్రభాతవార్త బ్యూరో) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఏకపక్షంగా వ్యవహరించడం పై వైఎస్సార్సీ అధినేత జగన్మోహన్ రెడ్డి మరోసారి తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ ప్రభుత్వంలో కూటమి నాయకులు చెప్పినట్టుగా పోలీసులు నడుచుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. తమ తల మీద టోపీలో ఉన్న మూడు సింహాలకు సెల్యూట్ చేయాల్సిన పోలీసులు... చంద్రబాబుకు వాచ్మెన్‌గా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరికీ ఇదే నా హెచ్చరిక అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎవరైతే టిడిపికి అనుకూలంగా వ్యవహరిస్తూ వైఎస్సార్సీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారో వారందరూ ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని... కచ్చితంగా వారి యూనిఫామ్ తీయించి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. చట్టపరంగా వారిని దోషులుగా నిలబెడతామని జగన్ అన్నారు. సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డి పల్లెలో వైఎస్సార్సీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని వైఎస్సార్సీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఉదయం 11:30 గంటల ప్రాంతంలో రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి ప్రత్యేక హెలికాప్టర్లో చేరుకొని అక్కడినుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపిరెడ్డి పల్లెకు



మంగళవారం విలేకరులతో మాట్లాడుతున్న జగన్

>>2

## పగలు తారెత్తిస్తున్న ఎండలు.. రాత్రులు ఈదురుగాలులతో వానలు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో ఒక పక్క ఎండలు మండుతున్నాయి.మరో వైపు సాయంత్రం అవుతుంటే ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తున్నాయి. దక్షిణ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో వచ్చే 3 రోజులు వానలు పడనున్నాయి. అలాగే వచ్చే నాలుగు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని.. ఆ తర్వాత స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరో వైపు రాష్ట్రంలో మరో నాలుగు రోజులు కొన్నిచోట్ల వర్షాలు, కొన్నిచోట్ల ఎండలతో విభిన్నమైన వాతావరణంఉంటుంది.. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

రాష్ట్రంలో గత కొన్ని రోజుల నుంచి భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఎండలు దంచికొడుతున్నాయి.. సాయంత్రం వేళ ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురుస్తోంది.. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది.. బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణ

>>2

## యేడాదిలోగా భోగాపురం విమానాశ్రయం

### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**భోగాపురం (విజయనగరం జిల్లా) , ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** భోగాపురంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం 2026 జూన్ నాటికి పూర్తి అవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు వెల్లడించారు. విమానాశ్రయ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కాంట్రాక్టు ప్రతినిధులతోనూ, ఇంజినీరింగ్ అధికారులతోనూ పనులపై మాట్లాడి సమీక్ష చేశారు. అలాగే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గత పాలకకుల నిర్లక్ష్యం కారణంగా 26శాతంగా ఉన్న విమానాశ్రయం నిర్మాణం పనులు నేడు 71 శాతానికిచేరుకున్నాయని అన్నారు. ఇంత వరకు ఎర్త్ వర్క్ పూర్తి అయిందని వివరించారు. రన్ వే పనులు 97శాతం, టాక్సీవే పనులు 92 శాతం, టెర్మినల్ బిల్డింగ్ 60 శాతం, ఎటిసి టవర్ 72 శాతం, యాన్సిలర్ బిల్డింగ్ 40 శాతం పనులు పూర్తిఅయినట్లు వివరించారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణంతో దేశం రూపు రేఖలు మారనున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఉన్న అధునాతన ఎయిర్‌పోర్టుల్లో భోగాపురంలో ఒకటని అన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం జరుగుతున్నదని అన్నారు. స్థానికంగానే స్కిల్ డెవెలప్ మెంటు సెంటర్ ఏర్పాటుచేస్తామని మంత్రి రామ్మోహన్‌నాయుడు

>>2



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రామ్మోహన్ నాయుడు



పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశ అధ్యక్షుడు జోన్ ఫెడ్రో అక్వెర్ బ్రాన్‌కోను కలిసిన దృశ్యం

# అమలులోకి వచ్చిన వక్ఫ్ సవరణ చట్టం

## నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర న్యాయశాఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** దేశంలో వక్ఫ్‌సవరణ చట్టం నేటినుంచి అమలులోకి వచ్చింది. ఈమేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. గత వారంపార్లమెంటు ఉభయ సభలు సవరణ చట్టాన్ని ఆమోదించి రాష్ట్రపతికి పంపిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదించగా ఎప్పటినుంచి అమలుకు వస్తుందనేది స్పష్టత రాలేదు. అయితే మంగళవారం నుంచి వక్ఫ్‌చట్టం అమలులోకి వచ్చిందని నోటిఫికేషన్‌లోపేర్కొంది. కేంద్రం పంపిన వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును ఏప్రిల్ 8న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. రెండు బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారని న్యాయమంత్రిత్వశాఖ తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఏప్రిల్ 4న రాజ్యసభ బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లురాగా లోక్‌సభ సుదీర్ఘ చర్చ తర్వాత ఏప్రిల్ 3న బిల్లుకు ఆమోదం తెలిపింది. లోక్‌సభలో 288 మంది ఎంపిలుఅనుకూలంగాను 232 మంది వ్యతిరేకంగాను ఓటువేసారు. అయితే 1995 చట్టంప్రకారం వక్ఫ్ అనేది ముస్లిం చట్టంకింద ఒక వ్యక్తి తన ఆస్తిని మతపరమైన దాతృత్వ ఉద్దేశాలకోసం శాశ్వతంగా అంకితంచేయడం. ఒకటి ప్రకటనద్వారా దీర్ఘకాల వినియోగం ఆధారంగా (వక్ఫ్‌బై యూజర్) వారసత్వం అంతరించినపుడు (వక్ఫ్ అలల్ ఔలాద్) ఏర్పడుతుంది. ఈ చట్టంకింద వక్ఫ్ బోర్డులకు ఆస్తులను నిర్వహించేవాటిని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉంటుంది. సర్వే కమిషనర్ ఆస్తుల సర్వేచేస్తారు. వివాదాలను వక్ఫ్‌ట్రిబ్యునల్స్ పరిష్కరిస్తాయి. వాటినిర్ణయాలు అంతిమంగా పరిగణిస్తారు. చట్టం ప్రకారం వక్ఫ్‌బోర్డు సభ్యులు ముస్లింలు మాత్రమే కావాల్సి ఉంటుంది. ఆస్తులపై బోర్డుకు పూర్తి నియంత్రణ ఉంటుంది. ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం ఆస్తులు దుర్వినియోగం తదితర సమస్యలున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వక్ఫ్‌బోర్డులు ప్రభుత్వ ఆస్తులనుసైతం వక్ఫ్‌గా ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. కొత్తగా తెచ్చిన చట్టంప్రకారంఎవరైనావక్ఫ్ ఆస్తిగాప్రకటించాలంటే ఆ వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాం ఆచరించి ఉండాలి. ఆస్తి ఆతనికి మాత్రమే సొంతమై ఉండాలి. సవరణ చట్టంలో వక్ఫ్‌బై యూజర్ నిబంధన తొలగించారు. వక్ఫ్ అలల్ ఔలాద్‌లో స్త్రీలతో సహా వారసుల హక్కులు కాపాడబడతాయి. సర్వే బాధ్యత సర్వే కమిషనర్‌నుంచి కలెక్టర్‌కు ఇచ్చారు. వక్ఫ్ ఆస్తుల వివరాలు ఆరునెలల్లో కేంద్రీయ పోర్టల్‌లోనమోదుచేయాల్సి ఉంటుంది. వక్ఫ్‌బోర్డుల్లో ఇద్దరు స్త్రీలతోపాటు ఇద్దరు ముస్లిం కాని సభ్యులను సైతం చేర్చాల్సిఉంటుంది. ట్రిబ్యునల్‌నిర్ణం మాత్రమే అంతిమం కాదు. 90 రోజుల్లో హైకోర్టులో అప్పీలుకు అవకాశం ఉంది. ఇకపై వక్ఫ్‌బోర్డులకు ఏకపక్షంగా ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించే అధికారాలు ఉండవు.

# కళారంగంలో కందుకూరి పురస్కారాలు

## మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ:ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** 16వ తేదీన ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు గారి 177వ జయంతిని పురస్కరించుకొని విజయవాడ లోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో కందుకూరి పురస్కారాల ఎంపికకు నాటక, సినీ రచయిత, పరిషత్ నిర్వాహకులు డా.బుర్రా సాయిమాధవ్ అధ్యక్షతన 11 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తూ ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో 3 కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు, ఒక్కో జిల్లాకు 5 చొప్పున మొత్తం 26 జిల్లాల్లో 130 జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు అందించనున్నామన్నారు. ఈ క్రమంలో ప్రతిభ గల నాటక రంగ కళాకారులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసేందుకు కమిటీ పనిచేస్తుందన్నారు. కమిటీలో సభ్యులుగా నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు, రచయిత, దర్శకులు,కళాకారులు డా. పాటిబండ్ల ఆనందరావు,సాంఘిక, నాటక కళాకారులు చిక్కాల బాలాజీ, దర్శకులు, రచయిత, కళాకారులు కెకెఎల్ స్వామి,దర్శకులు, కళాకారులు పి బాలాజీ నాయక్, దర్శకులు, రచయిత, కళాకారులు దాసరి చలపతి రావు(గంగోత్రి సాయి), లలిత కళా సమితి అధ్యక్షురాలు,అడ్వకేట్ జి. పద్మజ, నాటక పరిషత్ నిర్వాహకులు, పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, మెంబర్ కన్వీనర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్ ఉన్నారని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కళా, నాటక రంగాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# పరస్పర సహకారం

>> ఢిల్లీకి చేరారు. దుబాయ్ యువరారాజు భారత్‌లో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన కావడంతో ఆయన వెంట యుఎఇకి చెందిన పలువురు మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు, వ్యాపార వేత్తల బృందం కూడా ఉంది. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, రక్షణ సాంస్కృతిక సహకారంపై ఇరుదేశాధినేతలు చర్చించనున్నారు. బుధవారం షేక్ హమ్దన్ ముంబయికి వెళతారు. ఆయన భారత్ యుఎఇలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతంచేసేందుకు దోహదంచేస్తుందని విదేశాంగశాఖ ప్రకటించింది. వాణిజ్యసంబంధాల విస్తరణ కీలక అజెండాగా ఉంది. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్య 85 బిలియన్ డాలర్లు దాటింది. అలాగే భారత్‌లో మౌలికసదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్‌సిటీలు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో యుఎఇనుంచి భారత్ పెట్టుబడులను ఆశిస్తోంది. ఇక దుబాయ్ యువరాజు షేక్ హమ్దన్ యుఎఇ రక్షణమంత్రిగా కూడా వ్యవహరిస్తుండటంతో రెండుదేశాలమధ్య పరస్పర రక్షణ సహకారం బలోపేతంచేయడంపై రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చలుజరుపుతారు. భారతీయ స్టార్టప్‌లు దుబాయిలోని పెట్టుబడిదారులమధ్య భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై చర్చలుజరపనున్నారు. సాంస్కృతిక సంబంధాలను కూడా రెండుదేశాలమధ్య పెంపొందించుకునేదిశగా చర్చలు జరుగుతున్నాయి. అలాగే రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోకూడా చర్చలుజరిపన యువరాజు రక్షణరంగంలో పరస్పరం కలిసి పనిచేసేందుకు ఒపనపందం జరిగింది.

## హ్యాట్రిక్ ఓటమి రికార్డుతో

# చెన్నై సూపర్‌కింగ్స్



## 18 పరుగుల తేడాతో పంజాబ్‌కింగ్స్ గెలుపు

**ముల్లన్‌పూర్(పంజాబ్), ఏప్రిల్ 8:** ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్ మళ్లీ విజయాలతో దూసుకుపోతోంది. ముల్లన్ పూర్ మైదానంలో ప్రియాన్ష్ ఆర్య 103 పరుగులుచేసి మెరుపు సెంచరీతో భారీ స్కోర్ చేసింది పంజాబ్‌జట్టు. మాజీ ఛాంపియన్ సిఎస్కేను 201కే కట్టడి చేసింది. ఈ మ్యాచ్‌తో సిఎస్కే హ్యాట్రిక్ ఓటమి చెత్తరికార్డు మూటగట్టుకుంది. ఈ సీజన్‌లో 190 ప్లస్ లక్ష్యం ఛేదించని సిఎస్కే మళ్లీ విఫలం అయింది ఓపెనర్ డెవాన్‌కాన్వే 69పరుగులతో రిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఇంపాక్ట్‌ప్లేయర్ శివందూబే 42 పరుగులుచేసాడు.చివరిలో ఎంఎస్‌ధోనీ 22 పరుగులుచేసినా ఓటమినుంచి తప్పించలేకపోయాడు. బౌలింగ్‌లో భారీగా పరుగులిచ్చిన చెన్నై బ్యాటింగ్‌లో రాణించలేక మూడో ఓటమి మూటగట్టుకుంది. రాజస్థాన్ చేతిలో ఓటమినుంచి తేరుకున్న పంజాబ్‌ప్రత్యర్థికి భారీ లక్ష్యం నిర్దేశించి మ్యాచ్‌ను సొంతంచేసుకుంది. ప్రియాన్ష్ ఆర్య విధ్వంసక శతకం, శశాంక్‌సింగ్ 54 నాటౌట్‌లతో చెన్నై సూపర్‌కింగ్స్‌కు 220 పరుగుల టార్గెట్ ఇచ్చింది. ఛేదనలో ఓపెనర్ రచీన్ రవీంద్ర36 పరుగులు చేసాడు. గ్లెన్ మాక్‌నసవెల్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒకే ఒక్కపరుగుతో ఫెర్గుసన్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. 62 పరుగులవద్ద రెండో వికెట్ పడటంతో ఇంపాక్ట్ ప్లేయర్ శివందూబే 42 పరుగులుచేసినాఓపనర్ డేవాన్ కాన్వే 69 పరుగులుచేసిరిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగినా మూడో వికెట్‌కు 90 పరుగులు కీలకభాగస్వామ్యం తెచ్చారు. దూబేను బౌల్డ్‌చేసిన ఫెర్గుసన్‌చెన్నైకి షాకిచ్చాడు. ఎంఎస్‌ధోనీ 22, 19వ ఓవర్‌లో బౌండరీ, సిక్స్ ఒకట్టడంతోసిఎస్కే స్కోరు 190 దాటింది. యశ్‌ఠాకూర్‌వేసిన 20వ ఓవర్ తొలిబంతికే ధోనీ ఔట్ అయ్యాడు. చివరి ఓవర్‌లోతొమ్మిది పరుగులు మాత్రమేరావడంతోచెన్నై జట్టు విజయానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది.

## నేడు అమరావతిలో సిఎం చంద్రబాబు

# ఇంటికి శంకుస్థాపన

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో తన సొంతింటి నిర్మాణానికి సిఎం చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 8.51 గంటలకు సిఎం కుటుంబ సభ్యులు భూమి పూజ చేస్తారు. వెలగపూడి సచివాలయం వెనుక ఇ9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు కుటుంబానికి వెలగపూడి గ్రామస్థులు పట్టువస్త్రాలు అందించనున్నారు. రాజధానిలో సొంతింటి నిర్మాణం కోసం చంద్రబాబు కుటుంబం రైతుల నుంచి ఐదెకరాల భూమి కొనుగోలు చేసింది.

## వారం - వర్జ్యం

తేది : 09-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల ద్వాదశి రా.10.57
మఖ ఉ.9.58
వర్జ్యం సా.6.47 – రా.8.33
దు.ఉ.11.45- మ.12.35
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్తులాభం.

**వృషభం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తివ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం :** ప్రయాణాలలో తొందర పాటు వద్దు. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

**కన్య :** అనుకోని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి. కుటుంబ సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు వుంటాయి.

**వృశ్చికం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**ధనుస్సు:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తులాభం.

**మకరం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు తీరుతాయి.

**కుంభం:** ధనవ్యయం. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వివాదాలకు, తగాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భాగస్వామ్యంతోనే లక్ష్యాల సాధన

>> మందికి చేయూతను ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల కుటుంబాలను ఎంపిక చేశాం. ఒకప్పుడు నేనిచ్చిన జన్మభూమి పిలుపుకు స్పందించి ప్రపంచంలోని తెలుగువారు కదిలివచ్చారు. సొంతూర్లలో రోడ్లు వేశారు. స్మశానాలు కట్టించారు. ఆ స్ఫూర్తి కొనసాగించాలని మార్గదర్శిలను కోరుతున్నాను. దాతలు ముందుకొచ్చి బంగారు కుటుంబాలను తయారుచేస్తే వారు ఆర్థికంగా ఎదిగి మార్గదర్శిలుగా తయారవుతారు.

**5 లక్షల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం**

ఆగస్ట్ 15 కల్లా 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శి, బంగారు కుటుంబాల నమోదు చేపడుతున్నట్టు సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం మిలాప్, డొనేట్‌కార్ట్, రంగ్‌దే సంస్థలు ప్లేయర్లుగా పి4లో భాగస్వాములు అవుతున్నాయని తెలిపారు. దాతలు కుటుంబాలను, మండలాలను, గ్రామాలను కూడా దత్తత తీసుకోవడంతో పాటు, నిధులు సమకూర్చేలా పి4 రూపకల్పన చేశామన్నారు. దాతలు తాము ఎవరికి ఆర్థికంగా సాయం చేయాలి అనుకుంటున్నారో... ఆన్ లైన్ ద్వారా కూడా వారికి సాయం అందించే అవకాశాన్ని కల్పించామన్నారు. దాతలు ముందుగా పి4 ప్లాట్ ఫామ్ ద్వారా లాగిన్ అవ్వడంతో ప్రక్రియ ప్రారంభమవుందని చెప్పారు. ఆగస్ట్ నాటికి ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను నిర్దేశించారు. వచ్చే ఏడాది ఉగాది నాటికల్లా పి4 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ఏం సాధించామనే దానిపై వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేయాలని స్పష్టం చేశారు. జీవన ప్రమాణాలు పెంచుకోవాలనే మార్గదర్శులను తెచ్చామని చంద్రబాబు వివరించారు. బంగారు కుటుంబాలను గుర్తించి ఆదుకుంటున్నామని చెప్పారు. తెలివితేటలతో పని చేస్తే కష్టపడాల్సిన అవసరం లేదన్నారు. సమాజంలో గుర్తింపు, గౌరవం కావాలని ప్రతిఒక్కరూ ఆశిస్తారని తెలిపారు. సమాజానికి మనం ఉపయోగపడితే గుర్తింపు, గౌరవం దానంతట అదే వస్తుందని అన్నారు. పేదరికంలో ఉన్నవారు బంగారు కుటుంబంలో చేరవచ్చని వారిని మార్గదర్శులు ఆదుకుంటారని పేర్కొన్నారు. బాగా పనిచేసిన మార్గదర్శులను గుర్తించి సన్మానిస్తానని తెలియజేశారు. సమాజానికి ఎంతో కొంత ఇవ్వాల్సిన బాధ్యత సంపన్నులదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

పి4 కార్యక్రమం ఒక చరిత్ర. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటిది జరగలేదు. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి వాటిని తగ్గించాలి. అందరూ పేదరికంలోనే పుట్టాం అవకాశాలను అందుకోవడమే ముఖ్యం. డబ్బు వల్ల సమాజంలో గుర్తింపురాదు, మంచిపని చేస్తేనే వస్తుంది. ఎస్సీ వర్గీకరణ జరగాలని 30 ఏళ్ల క్రితమే నిర్ణయించాం. అన్ని గ్రామాల్లో రోడ్లు బాగు చేశాం. ఇది మంచి మార్పు అని చంద్రబాబు తెలిపారు. ఈ నెల 15 నుంచి ఇంటింటికీ మన మిత్రవాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమంఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బందిప్రతి పౌరుడి ఫోనులో 9552300009 నంబరు మన మిత్రపేరిట సేవ్ చేయనున్న సచివాలయ సిబ్బంది తెలిపారు. ఫోనులో మనమిత్ర పేరిట 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలన్నారు. ప్రజల చేతిలో ప్రభుత్వం అనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం మన మిత్రపేరుతో తీసుకొచ్చిన వాట్సాప్ గవరెన్స్ నంబరు 9552300009 రాష్ట్రంలోని పౌరులందరూ తమ మొబైల్ ఫోన్లలో మనమిత్ర పేరుతో తప్పనిసరిగా సేవ్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విజప్తి చేసింది.సిఎం చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా ఐటీ మరియు ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల నుంచి వాట్సాప్ గవర్నెన్స్ అనే వినూత్న సౌలభ్యాన్ని ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మన మిత్ర పేరుతో మెటా వారి సహకారంతో తీసుకొచ్చిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పటికే ప్రజామన్ననలు చూరగొంటోంది. దీన్ని ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ మన మిత్ర పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లల్లోని సచివాలయ సిబ్బంది తమ సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లీ ఆ ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి మొబైల్ ఫోనులో మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 సేవ్ చేయిస్తారు. అలాగే ఈ వాట్సాప్ గవర్నెన్స్‌ను ఎలా ఉపయోగించాలి, దాని ద్వారా ప్రభుత్వ సేవలు ఎలా పొందాలి అనే దానిపైన ఆ కుటుంబంలో ఉన్నవారందరికీ అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం 250 రకాల సేవలను అందిస్తోంది. జూన్ 12వ తేదీకల్లా 500లకుపైగా సేవలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. తరువాత దశల్లో మొత్తం 1000కి పైగా సేవలు ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించాలన్నదే ప్రభుత్వ అంతిమ లక్ష్యం. ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వం నుంచి పొందవలచిన సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా జనన, మరణ ధృవీకరణ పత్రాల మొదలు, ప్రభుత్వం జారీ చేసే అన్ని రకాల ధృవీకరణ పత్రాలను తమ వాట్సాప్ ద్వారా ఇట్టే డౌన్‌లోడు చేసుకునే సదుపాయం కల్పిస్తోంది. తమ ఆధార్ అనుసంధాన మొబైల్ నంబరు సాయంతో ఈ సేవలు క్షణాల్లో పొందవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం లోని అన్ని శాఖలను ప్రభుత్వ యంత్రాగాన్ని సమాయాత్తం చేస్తున్నారు. కేవలం ఇవే కాకుండా బస్ టికెట్లు రిజర్వు చేసుకోవడం, విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్ను, నీటి పన్ను లాంటి చెల్లింపులు కూడా సులభంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చేసే సదుపాయం ఇందులో కల్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ఆలయ సేవలతో పాటు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల సేవలన్నీ కూడా ఇందులో పొందే సుదపాయం కల్పించారు.



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి ముద్ర యోజన లబ్దిదారులతో ముఖాముఖీ నిర్వహిస్తున్న ప్రధాని మోడీ

# గత ఎన్నికల్లో ప్రజల ఇచ్చిన తీర్పుతో జగన్ మానసిక పరిస్థితి దెబ్బతింది: మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** గత ఎన్నికల్లో ప్రజల ఇచ్చిన తీర్పుతో జగన్ మానసిక పరిస్థితి దెబ్బతిందని, ఇంగ్లాండ్‌వెళ్లి అక్కడి మందులువాడినా నయం కాలేదని మంత్రి సవిత అన్నారు. మంగళవారం ఆ మేరకు ఆమె తన వ్యక్తిగత కార్యాలయంనుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆరోపించారు. పోలీసుల గుడ్డలు ఊడదీస్తానంటూ మాట్లాడడం ఆయన ఆహంకారానికి నిదర్శనమన్నారు. పాలించమని ప్రజలు అధికారమిస్తే...అయిదేళ్ల పాటు తాడేపల్లి ప్యాలెస్‌లో పబ్జీలు గేమ్‌లు ఆడుకుంటూ కాలం వెళ్లదీశాడన్నారు. అందుకే ప్రజలు 2024 ఎన్నికల్లో జగన్‌ను 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. అనంతపురంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగితే, దానికి జగనే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టబద్ధంగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ప్రకారం రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. చట్టబద్ధమైన ప్రభుత్వంపైనా, పోలీసులపైనా ఇష్టారాజ్యంగా, అహంకారపూరితంగా మాట్లాడితే ఊరుకునేది లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి సవిత హెచ్చరించారు. జగన్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా తన ఇంటి నుంచే నిరూపించుకోవాలని మంత్రి సవిత సూచించారు. ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు లాగిన దౌర్భాగ్యుడు జగన్ అని మండిపడ్డారు.

# జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

>> 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు సాకులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే 20 టీఎంసీల మేర నీటిని పరిశ్రమలకు ఇవ్వొచ్చని వెల్లడించారు.

ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిపారు. గోదావరి బేసిన్‌లో వృథాగా పోతున్న వరదనీటిని సద్వినియోగం చేసుకునేలా ఈ లింకు ప్రాజెక్టు నిర్మించనున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకూ నీటిని తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సాయిప్రసాద్ తెలిపారు. దీని ద్వారా దాదాపు 150 టీఎంసీల వరకూ నీటిని తరలించేందుకు ఆస్కారం ఉందని, నీటి లోటు ఉన్న జిల్లాలకు ఈ వరద జలాలను తరలించవచ్చని ఆయన చెప్పారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే రాయలసీమ జిల్లాలకు నీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలవరం బనకచర్ల రెగ్యులేటర్‌కు కాలువలు, ఎత్తిపోతల పథకాలు, భూగర్భ పైప్ లైన్లు, సొరంగాల ద్వారా నల్లమల నుంచి నీటిని తరలించాల్సి ఉంటుందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. దీని కోసం ఓ ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా దీన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. ఎస్పీవీగా బహిరంగ మార్కెట్ల నుంచి నిధులు సేకరించేందుకు అవకాశం ఉందని జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తెలిపారు.

# భోగాపురం విమానాశ్రయం

>> వివరించారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు తెలియజేసేలా విమానాశ్రయం లోపల ఇంటీరియల్ డిజేన్ ఉంటుందని అన్నారు. బీచ్ క్యారిడార్‌పై కొత్త డిపిఆర్‌ని తయారు చేసు_్తన్నట్లు వెల్లడించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన వివరించారు. అ ప్రోచ్ రహదారి సమస్యను సిఎం చంద్రబాబునాయుడుతో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు భూనిర్వాసితుల సమస్యలను ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు,మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు,జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా ఎస్పి వకుల్ జిందల్,ఆర్‌డిఓ దాట్ల కీర్తి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాత్రులు ఈదురుగాలులతో వానలు

>>శాఖ అధికారులు తెలిపారు ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.. ఈ క్రమంలో వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.. తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది.. నిన్నటి తూర్పు గాలుల ద్రోణి దక్షిణ అంతర్గత కర్ణాటక నుండి నైరుతి మధ్యప్రదేశ్ వరకు మరాత్వాడ మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి ఈరోజు తక్కువగా గుర్తించబడినది. నిన్నటి ఉపరితల ఆవర్తనం ఉత్తర ఆంధ్రప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశాపై సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి, ఈరోజు తక్కువగా గుర్తించబడినది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు గమనిస్తే ఎండలు అధికంగానే ఉంటాయి. రాయలసీమతోపాటు కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో గరిష్ట ఉష్ణోగ్రతలు రాగాల ఐదు రోజుల్లో క్రమంగా 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రము సంచాలకులు ప్రకటనలో తెలిపారు.వాతావరణ శాఖ చెప్పినట్లుగానే ఆయా జిల్లాలో గరిష్టంగా 40 నుంచి 41,2 సగటు ఉష్ణోగ్రతలున్నాయి.

# పనిచేస్తున్న పోలీసులు

>> రోడ్డు మార్గాన చేరుకొని ఎంపిపి ఎన్నికల సమయంలో హత్యకు గురైన వైఎస్సార్సీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించి అక్కడే మీడియా పాయింట్లో విలేకరులతో మాట్లాడారు. తర్వాత మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో రామగిరి మండలం పాపిరెడ్డి పల్లె వద్ద నుంచి రోడ్డు మార్గాన ఎస్ఎస్ గేటుకు చేరుకొని జాతీయ రహదారి మీదుగా బెంగళూరుకు వెళ్లారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లెలో వైఎస్ జగన్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో బీహార్ లో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ రాష్ట్రంలో కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని.. చంద్రబాబు ఎంత భయపెట్టినా, ప్రలోభాలు పెట్టిన ఎంపిపి ఎన్నికల్లో వైఎస్సార్సీ గెలిచిందని.. 50 చోట్ల ఎన్నికలు జరిగిన 39 చోట్ల వైఎస్సార్సీ గెలిచిందని.. 7చోట్ల టిడిపి వారే వాయిదా వేయించారన్నారు. రామగిరిలో 8మంది మా ఎంపిటిసిలు ఉన్నా.. ఇక్కడ టిడిపి ఎమ్మెల్యే, ఆమె తనయుడు, రామగిరి ఎస్ఐ దౌర్జన్యాలు చేశారన్నారు. పెనుకొండలో మా ఎంపీటీసీలను కిడ్నాప్ చేసే ప్రయత్నం చేస్తే.. దాన్ని అడ్డుకున్నందుకు ప్రకాష్ రెడ్డి, ఉషాశ్రీపై కేసులు పెట్టారన్నారు. ఎన్నికలో గెలవకపోవడంతో భయం క్రియేట్ చేయాలని చూశారని అందులో భాగంగానే లింగమయ్యను బేస్ బాల్ కట్టెతో కొట్టి చంపారన్నారు. ఈ ఘటనలో 20మంది మీద అటాక్ చేస్తే.. ఇద్దరు మీద కేసు పెట్టారన్నారు. గ్రామంలో రెచ్చగొట్టిన ఎమ్మెల్యే కొడుకు, ఎమ్మెల్యే, ఆమె బంధువులపై ఎందుకు కేసులు పెట్టలేదన్నారు. లింగమయ్య భార్యతో బలవంతంగా వేలిముద్ర వేయించారని.. టిడిపి వారినే సాక్షులుగా ఇందులో చేర్చారంటే ఇంతకంటే దారుణం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు..

# బాధ్యతా రాహిత్యం సహించబోను

>> పథకంలో మంచి పురోగతి సాధించడం పట్ల సంబంధిత అధికారులను ప్రశంసించారు. మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ చూసినా ప్రజలు ట్రాన్స్ఫార్మర్లు కండక్టర్ల కావాలని కోరుకుంటున్నారని పులివెందుల నియోజక వర్గాన్ని ప్రత్యేక స్థానంగా గుర్తించి అవసరం మేరకు వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేసేలా కృషి చేయాలని ఇన్ చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. మరొక నెలలో మళ్లీ సమీక్ష సమావేశం జరుగుతుందని ఆ సమావేశానికి అల్లా అన్ని శాఖల అధికారులు వారివారి శాఖల్లో పురోగతిని కచ్చితంగా సాధించాలని లేనియెడల తగిన చర్యలు తీసుకొని బడునని ఆమె అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, తుంగభద్ర నీటి సంఘచైర్మన్ జోగిరెడ్డి, ఆర్డిఓ,వివిధ శాఖల అధికారులు, తహసిల్దారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పవన్ చిన్నకుమారుడికి ప్రమాదం

### సింగపూర్‌కు వెళ్లిన డిప్యూటీ సీఎం కుటుంబం - సింగపూర్ బయలుదేరి వెళ్ళిన,డిప్యూటీ సీఎం...ఆయన అన్న మాజీ కేంద్రమంత్రి చిరంజీవి ఇతర కుటుంబసభ్యులు - మార్క్ శంకర్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించిన సిఎం చంద్రబాబు, మార్క్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపిన చిరంజీవి - గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పరామర్శ

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ సింగపూర్‌లో తాను చదువుకుంటున్న పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డాడు. అగ్నిప్రమాదంలో అతడి చేతులు కాళ్లకు గాయాలయ్యాయి. అతడితో పాటు పలువురు చిన్నారులు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సింగపూర్‌లోని రివర్ వ్యాలీ షాప్‌హౌస్‌లో మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఈ ఘటన చోటచేసుకుంది. ఈ భవనంలో చిన్నారులకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. రెండు, మూడు అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. భవనం లోపల చిక్కుకున్న వారిని రక్షించి రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో 15 మంది చిన్నారులు సహా 19 మంది గాయపడ్డారు. వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ అందులో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు సింగపూర్ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రస్తుతం పవన్ అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్నారు. కార్యక్రమాలను రద్దు చేసుకొని సింగపూర్ వెళ్లాలని పార్టీ నేతలు ఆయనకు సూచించారు. ఇచ్చినమాట ప్రకారం గిరిజనులను కలిసి వెళ్తానని పవన్ చెప్పారు. ప్రారంభించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తిచేసుకున్నారు.. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన ముగిసిన తర్వాత పవన్ సింగపూర్‌కు బయలుదేరి వెళ్ళారుఆయన అన్న మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవి మార్క్ తన స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డారని,కాళ్ళు,చేతుల కాలినట్లు వివరించారు. శ్వాస తీసుకోవడంలో మార్క్‌కు ఇబ్బందిపడుతున్నాడని వివరించారు.ఎవ్వరు ఆందోళన చెందవద్దని,అతను కొలుకుంటాడని సామాజిక మాధ్యమం వేదికగా ప్రకటించారు.చిరంజీవి తన భార్య సురేఖతో సింగపూర్ వెళ్ళారు.చిరంజీవి సతీమణి పవనోవిచ్ సింగపూర్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తూ అక్కడే ఉంటున్నారు.దాంతో పవన్ కుమారుడు మార్క్ శంకర్‌కు అక్కడే చదువుకుంటున్నారు.పవన్ కల్యాణ్ కుమారునికి అగ్ని ప్రమాదంలో గాయాల కావడం పట్ల సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేసారు.మార్క్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.పవన్‌ను ఏపీ గవర్నర్ అబ్దుల్ నశీర్ ఫోన్ ద్వారా పరామర్శించారు.శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని ఊహించలేదు,, కంగారు పడకండి, నాకుమారుడు కొలుకొంటున్నాడు సింగపూర్‌లో తన కుమారుడు కొలుకొంటున్నాడనిపవన్ కల్యాణ్ వెల్లడించారు.ఆయన జెఎస్పీ కార్యాలయం ద్వారా విడుదల చేసిన ప్రకటనలోను,"ఎక్స్" వేదికలోను ఈ విషయం స్పష్టం చేసారు.అరకు పర్యటనలో ఉన్నప్పుడు నాకు ఫోన్ వచ్చింది పవన్ నా కుమారుడు చదువుతున్న స్కూల్‌లో ప్రమాదం జరిగింది ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని ఊహించలేదుపవన్ తెలిపారు. మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లినట్టు తెలిసింది.పవన్ ఘటనపై ప్రధాని మోదీ ఫోన్ చేసి ఆరా తీశారు సింగపూర్ హైకమిషనర్ కూడా సమాచారం అందించారు చంద్రబాబు సహా స్పందించిన వారందరికీ కృతజ్ఞతలు అకీరా పుట్టినరోజున ప్రమాదం జరగడం దురదృష్టకరం పొగ పీల్చడం వల్ల ఇబ్బందులు రావడంతో.. వైద్యులు చికిత్స అందిస్తున్నారని పవన్‌కల్యాణ్ తెలిపారు.మార్క్ శంకర్ క్రమంగా కోలుకొంటున్నాడు. ప్రమాద విషయం తెలుసుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోన్ చేసి మార్క్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి ధైర్యం చెప్పారు. సింగపూర్ లో అవసరమైన సహకారం అందించవలసిందిగా అక్కడి హై కమిషనర్ కు దిశానిర్దేశం చేశారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి మాట్లాడారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి నా ధన్యవాదాలు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఫోన్ చేసి ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ , తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి గారు, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి శ్రీ బండి సంజయ్ ఆంధ్ర ప్రదేశ్ ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్ కె.అచ్చెన్నాయుడు గారు, నాదెండ్ల మనోహర్ , దుర్గేష్ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్ బి.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.ఆర్. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సహచర సినీ నటులు, సినిమా రంగ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా, వివిధ మాధ్యమాల ద్వారా మార్క్ శంకర్ కోలుకోవాలని ఆకాంక్షించారు.

నాయకులు, కార్యకర్తలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి మార్క్ శంకర్ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఇంతమంది మంచి మనసుతో ఆకాంక్షించి, ఆశీస్సులు అందించడంతో మార్క్ శంకర్ క్రమంగా కోలుకొంటున్నాడు. ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

**మార్క్‌శంకర్ త్వరగా కొలుకోవాలి -చంద్రబాబు**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కుమారుడి ప్రమాద సమాచారం అందుకున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా సీఎం తన ట్వీట్లో "సింగపూర్ లోని స్కూల్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో అక్కడ చదువుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ కు గాయాలైన విషయం ఆందోళన కలిగించింది. సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న శంకర్ త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను." అని రాసుకొచ్చారు. కాగా సింగపూర్లోని ఒక పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతికి లోనయ్యానని కేటీఆర్ ట్వీట్ చేశారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలి మాజీ సీఎం జగన్

పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలి మాజీ సీఎం జగన్ఎక్స్ వేదికగా కోరుకున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డిసింగపూర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డారని తెలిసి నేను షాక్ అయ్యాను. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు వారి కుటుంబంతో ఉన్నాయి. ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నానన్నారు.ఇక వైకాంగ్రెస్‌పార్టీ నేతలు ఆర్కె రోజా,డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, ఆరే శ్యామల,పేర్ని నాని,కురసాల కన్నబాబు మార్క్‌శంకర్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు,.

**మార్క్ శంకర్ త్వరగా కొలుకోవాలి - తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**

సింగపూర్‌లో పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్‌శంకర్ గాయపడిన ఘటన దిగ్భ్రాంతికి లోను చేసిందని

తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.అతను త్వరగా కొలుకోవాలని,పవన్ ధైర్యంగా ఉండాలని "ఎక్స్" వేదికగా రేవంత్ పేర్కొన్నారు.తెలంగాణా శాసనసభలో విపక్షనేత కె,.తారకరామారావు మార్క్‌శంకర్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు.

# తిరుమల సమాచారం

## రేపటి నుండి మలయప్ప ఉత్సవర్లకు వసంతోత్సవాలు -11న రథోత్సవం

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని వసంతమండపంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేసవితాపం నుండి ఉపశమనం కోసం శాస్త్రోక్తంగా మూడురోజులు వసంతోత్సవాలు జరగనున్నాయి. ఈ వసంతోత్సవాలకు ఆలయానికి పడమరవైపు ఉన్న వసంతమండపాన్ని సహజప్రకృతిసిద్ధంగా పలు రకాల వివిధ జాతి పండ్లు, పుష్పాలు, వన్యప్రాణుల చిహ్నాలు, వట్టివేర్లతో సర్వాంగ



సుందరంగా అలంకరించారు.వసంతోత్సవాల్లో తొలిరోజు మధ్యాహ్నం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివార్లకు విశేష స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రెండవరోజు 11వతేదీ శుక్రవారం రథోత్సవం, 12వతేదీ చివరగా శనివారం మలయప్పస్వామికి, కోదండరామస్వామికి, శ్రీకృష్ణస్వామి ఉత్సవర్లకు విశేష స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించి అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. ఈ వసంతోత్సవాలతో పలు ఆర్జిత సేవలు రద్దయ్యాయి.. ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ఆర్జితసేవ టిక్కెట్లు అందుకున్న గృహస్థభక్తులు ఆయా రోజుల్లో సేవలో పాల్గొంటారు.

## శ్రీవారి ఆశీస్సులు కలగాలి : సింఘానియా

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు తెలిపారు. మంగళవారం ఉదయం రేమాండ్స్ అధినేత గౌతమ్‌సింఘానియా, హోంగార్డ్సు ఫైర్‌సర్వీస్ డిజి వివేక్ శ్రీవాస్తవ, క్రికెటర్ రవిశాస్త్రి,



భారతీయ మాస్టర్ హ్యాండ్లూమ్స్ డిజైనర్ గజం అంజయ్య లు వేర్వేరుగా తిరుమలకు వచ్చారు. ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సకల సదుపాయాలతో త్వరలో పిఎసి - 5 అందుబాటులోకి

### - పనులను పరిశీలించిన అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిది:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపైన నేపథ్యంలో సామాన్యభక్తులకోసం అదనంగా వసతి కల్పించేందుకు నిర్మాణంలో ఉన్న పిఎసి 5 పనులు త్వరగా పూర్తికావాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. పిఎసి 5లో కల్యాణకట్ట,డైనింగ్ హాల్, లాకర్ల ఏర్పాటు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. యాత్రికుల వసతి సముదాయం -5ని అధునాతనంగా సౌకర్యాలు ఉండాలన్నారు. ఈ పనులను ఆయన మంగళవారం సాయంత్రం డిప్యూటీ ఇఒలు పి.హరీంధ్రనాథ్, రాజేంద్ర, వెంకటయ్య, ఇఇలు వేణుగోపాల్, సుధాకర్, డిఇ చంద్రశేఖర్,విఎస్‌ఒ సురేంద్రతో కలసి తనిఖీ చేశారు.

## సినిమాల్లో మంచి అవకాశం వస్తే ఆలోచన చేస్తా

### -15వ వివాహవార్షికోత్సవాన శ్రీవారి దర్శనం ఆనందం - సినీనటి రంభ

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కుటుంబంతో చాలా సంతోషంగా ఉన్నానని, మళ్ళీసినిమాలలోనటించే ఆలోచన లేదని,మంచి అవకాశం వస్తే ఆలోచన చేస్తానని సినీనటి రంభ తెలిపారు. 15వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం భర్త ఇందిరన్ పద్మనాథన్‌తో కలసి వచ్చానని, స్వామివారి దర్శనం చాలా బాగా జరిగిందన్నారు. దేవుని ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు. కుటుంబంతో కలసి మంగళవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల రంభను చూడటానికి అభిమానులు, భక్తులు ఉత్సాహం చూపారు.

# ఫిర్యాదుల పరిష్కారాల్లో వేగం పెంచాలి: సిఎం చంద్రబాబు

### - రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల్లోనే అత్యధిక ఫిర్యాదులు

**విజయవాడ,, ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో మరింత వేగంగా స్పందించాలని, ఎప్పటికప్పుడు దరఖాస్తుదారుకు గ్రీవెన్స్ స్థితిని తెలిపేలా సమాచారం అందించాలని... ఇందుకు ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పరిష్కరించగలిగే వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని చెప్పారు. అలాగే పరిష్కరించలేని వినతుల విషయంలో ఫిర్యాదుదారుకు... ఎందుకు పరిష్కరించలేక పోతున్నామనే విషయాన్ని సవివరంగా తెలియజేయాలని సూచించారు. గ్రీవెన్స్‌ల పరిష్కారంపై సోమవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమీక్షించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధార్ నెంబర్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ తప్పనిసరిగా తీసుకోవడం ద్వారానే గ్రీవెన్స్ నమోదు చేయాలని, దీని ద్వారా నకిలీ ఫిర్యాదులు అరికట్టవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే, ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా, వ్యవస్థను దుర్వినియోగం చేసేలా ఒకే విషయంపై అదే పనిగా ఎవరైనా ఫిర్యాదు చేస్తూ ఉంటే... అటువంటి వారి వివరాలు సేకరించి, ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించా లన్నారు. వినతులు పరిష్కరించిన తర్వాత ఎవరైతే గ్రీవెన్స్ దరఖాస్తు చేశారో వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. తనకు నేరుగా వచ్చే గ్రీవెన్స్‌లను ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఫిర్యాదుదారుతో సంప్రదించి ఫాలోఅప్ చేయడం ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

3 శాఖల్లోనే 90 శాతం ఫిర్యాదులు : రెవెన్యూ, పోలీస్, మున్సిపల్... కేవలం ఈ 3 శాఖల నుంచే అత్యధికంగా ఫిర్యాదులు, వినతులు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ప్రభుత్వం రీ సర్వేలో నిబంధనలు ఉల్లంఘించడంతో భూసంబంధిత ఫిర్యాదులు పెరిగాయి. ఫిర్యాదుల్లో ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో భూ యజమాని పేరు మారిపోవడం, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో పేర్లు సవరణ, రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటివి ఎక్కువుగా ఉన్నాయి. అలాగే, పోలీస్ శాఖకు సంబంధించి ఆస్తి తగాదాలు, సైబర్ క్రైమ్, వైవాహిక సమస్యలు, భూసంబంధిత తగాదాలు, ఆర్థిక నేరాలతో ముడిపడిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. మున్సిపల్ శాఖలో కూడా ఫిర్యాదులు ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడం, అనధికార నిర్మాణాలు, ఆస్తి పన్నులు వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి.

# ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### ఎయూకి పూర్వవైభవం తీసుకురావాలి :మంత్రి నారా లోకేష్

**మంగళగిరి,ఏప్రిల్8,ప్రభాతవార్త :** ఎంతో ఘన చరిత్ర కలిగిన విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ, యూనివర్సిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వైస్ ఛాన్స లర్ జీపీ రాజశేఖర్ తో ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ సుదీర్ఘంగా సమీక్షి ంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకను నిర్వహించనున్నట్లు వీసీ వివరించారు. 1926లో ఆంధ్ర యూనివర్సిటీని స్థాపించారు. 2026, ఏప్రిల్ 26వ తేదీ వరకు ఏడాదిపాటు ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విజన్ ను వీసీ జీపీ రాజశేఖర్ ఆవిష్కరించారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఘనంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. క్యూఎస్ ర్యాంకింగ్స్ లో ఆంధ్ర యూనివర్సిటీ టాప్100లో స్థానం పొందడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే యూనివర్సిటీల్లో ఖాళీలను భర్తీచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు యథాతథం

**విజయవాడ.ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవల(ఆరోగ్యశ్రీ)ను యధావిధిగా కొనసాగిస్తున్నారు.ప్రభుత్వంతో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి.వారికి వెంటనే రూ.500కోట్లు బకాయిలు విడుదల చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా చర్చల సందర్భంగా వాగ్దానం చేసారు.దీంతో వైద్యసేలు కొనసాగించాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ నిర్ణయించింది.ఇదే విషయం అసోషియేషన్

మంగళవారం వెల్లడించింది.రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలను సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్ వెల్లడించింది.రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టిందని,

దీనివల్ల తాము దుర్భర పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారు. బకాయిల విడుదల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు అనేకసార్లు విన్నవించామని, లిఖితపూర్వకంగానూ కోరామని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే కానీ మందులు, సర్జికల్ ఐటమ్స్ సరఫరా చేయలేమని ఆయా కంపెనీలు చేతులెత్తేస్తున్నాయని చెప్పారు.

వైద్యులు, సిబ్బందికి 2 నెలలుగా జీతాలు నిలిపివేశామని చెప్పారు. దీనిపై గతనెల 7నే ట్రస్ట్‌కు లేఖ రాశామని, ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని తెలిపారు. బకాయిలు విడుదల చేయాలంటూ గతేడాది జూలై నుంచి ప్రభుత్వానికి 26 సార్లు లేఖలు రాశామని డాక్టర్ కె.విజయ్‌కుమార్ అన్నారు. 2025-26 బడ్జెట్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి రూ.4వేల కోట్లు కేటాయించగా,

బకాయిలే రూ.3,500 కోట్లు ఉన్నాయన్నారు. కనీసం రూ.1,500 కోట్లు చెల్లిస్తే తప్ప సేవలు కొనసాగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆశా కార్యదర్శి డాక్టర్ అవినాశ్ మాట్లాడుతూ బీమా విధానంలోకి మారే క్రమంలో ఆయుష్మాన్ భారత్‌తో పథకాన్ని ఇంటిగ్రేట్ చేస్తామని అంటున్నారని,

ఆయుష్మాన్ భారత్‌లోని 1,500 ప్రొసీజర్లు ఎన్టీఆర్ వైద్యసేవ కంటే తక్కువ ప్యాకేజీల్లో ఉన్నాయని తెలిపారు.

దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘంతో చర్చలు జరిపి వైద్య సేవలు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

# దేశంలోనే ఎపిని సిఎం చంద్రబాబు నెంబర్‌వన్ చేస్తారు : ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పంలో పాత్రికేయుల సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని తొమ్మిది నెలల పాలనలోనే సిఎం చంద్రబాబునాయుడు తలసరి ఆదాయం వృద్ధిరేటులో రాష్ట్రాన్ని దేశంలోనే రెండోస్థానంలో నిలి పారని పేర్కొ న్నారు. సేవ, వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో 15.14శాతం వృద్ధి సాధించడం జరిగిందన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారన్నారు. రాజధాని అమరావతి నగరాన్ని వైఎస్సార్సీ నేతలు శ్మశానంతో పోల్చారని అదే నేడు ప్రజారాజధానిగా రూపుదిద్దుకుంటోందన్నారు. అమరావతిలో 15వేల కోట్లతో పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. మరో పక్క రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును సైతం త్వరగా పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తెలుగువారు ఎక్కడున్నా అగ్రస్థానంలో ఉండాలనేది సిఎం చంద్రబాబు తపన అన్నారు. గతంలో జన్మభూమి కార్యక్రమంకు పిలుపునిచ్చిన సిఎం చంద్రబాబు నేడు మార్గదర్శి - బంగారు కుటు ంబం (పి4) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 20లక్షల పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తేవడమే లక్ష్యమన్నారు. ఉన్నతవర్గాల వారు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి కృషి చేసేలా సిఎం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. సమాజానికి మంచి చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు. కుప్పంలో సైతం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో సుస్థిర పాలన ఉంటే రాష్ట్రం ఎంతో తొందరగా అభివృద్ధి చెందుతుందన్నారు. సుస్థిర పాలన లేకుంటే గత వైఎస్సార్సీ పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. సిఎం చంద్రబాబుకు మంచిపేరు వస్తుందని రాజధాని అమరావతి నగరాన్ని అంధకారంలో నెట్టేయడంతో పాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారన్నారు. సమావేశంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, నాయకులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి, రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, బగ్గిడి వెంకటేష్, సుగుణమ్మ పాల్గొన్నారు.

# ఎస్పీఎఫ్ ఏపీ సెక్రటేరియట్ అధికారులు, సిబ్బందికి రక్త పరీక్షలు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్పీఎఫ్ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ, ఐజి బీవీ .రామిరెడ్డి వారి ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది అందరికి రక్త పరీక్ష నిర్వహణ చేపట్టారు.ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో కమాండెంట్ ఎం.శంకర్రావు ఆధ్వర్యంలో ఏపీఎస్ఎఫ్ అధికారులకు, సిబ్బందికి మంగళవారం రక్తపకీక్షలె నిర్వహించారు. సిబ్బంది యొక్క ఆరోగ్య దృష్ట్యాఏపీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ సహకారంతో రక్త పరీక్షలు ఉచితముగా నిర్వహించినట్లు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏపీ సెక్రటేరియట్ పి. వి. ఎస్. న్. మల్లికార్జున రావు తెలిపారు. సిబ్బందిని ఉద్దేసించి మాట్లాడుతూ ఈ రక్త పరీక్షలు నిర్వహించడం వలన సిబ్బంది యొక్క ఆరోగ్య సమస్యలను ముందుగానే తెలుసుకొని తగిన వైద్యం చేయించుకొనుటకు వీలుగా ఉంటుందని మరియు పాటించవలిసిన ఆహార నియమాలు గురుంచి వివరించినారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 217 మంది సిబ్బందితో పాటు ఇన్‌స్పెక్టర్లు ఎం. వెంకటేశ్వకర్లు, ఎస్. రమణ, ఎస్సైలు మరియు ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

# ఎపి లాసెట్, పిజిఎల్‌సెట్ 2025 దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిది:** రాష్ట్ర ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ఏపి లాసెట్, ఏపి పిజిఎల్‌సెట్-2025 కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం స్వీకరిస్తోంది. రెగ్యులర్‌గా ఎల్ఎల్‌బి 3సంవత్సరాలు, 5 సంవత్సరాలు, ఎల్ఎల్ఎం 2 సంవత్సరాలు కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని కన్వీనర్ తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 27వతేదీ చివరితేదీగా తెలిపారు. మరిన్ని వివరాలకు హెచ్‌టిటిపిఎస్://సిఇటిఎస్.ఎపిఎస్‌హెచ్ఇ.ఎపి.జివోవి.ఇన్"ను సంప్రదించాలని కన్వీనర్ కోరారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT SHORT TENDER NOTICE**

NIT No. 6/MAU61-ADMN0IS(INSS)/1/2025-IS Dt: 07/04/2025

Name of Work: APCRDA- "Supply & Installation of CCTV Cameras @ Block-1, AP Secretariat, Amaravati" - **Estimate Contract Value: Rs.75,10,064/- (Excl. of all taxes).**

The bid can be downloaded on AP e-procurement portal from **09.04.2025 to 15.04.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **15.04.2025 up to 15.00 Hrs,** Technical bid opening **15.04.2025 @ 16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త


ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# ఆక్వా కుదేలు!

అమెరికా తీరుతో ఆక్వారంగం కుదేలైంది. రైతులు,వ్యాపారులు ఈ నాలుగైదు రోజుల్లోనే వందల కోట్లరూపాయల మేరకు నష్టపోయారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో భారత దేశంనుంచి అమెరికాకు రూ.2.55బిలియన్ల డాలర్లవిలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలోరొయ్యలే 92శాతం వాటాను కలిగిఉన్నాయి. అమెరికా దేశానికి సముద్రఆహార ఎగుమతులపై రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారతదేశంపై 27శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతోంది. ఈక్వెడార్ వంటి దేశాలకు ఎగుమతిదారులపై కేవలం10శాతం పన్నుమాత్రమే అమెరికా విధిస్తోంది. అన్ని సుంకాలను కలుపుకుంటే ఈక్వెడార్‌కు భారతదేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20శాతం ఉంటుంది. దీనివల్ల మన దేశానికి పరోక్షంగా భారీనష్టం కలిగిస్తోంది. ఈసుంకాలవిధింపులో వ్యత్యాసం వలన మత్స్యవాణిజ్య ఎగుమతులలో వారికి అనుకూలంగా మారుతోంది. ఈ ఉపద్రవం నుంచిబయటపడే మార్గాలను ప్రభుత్వం అన్వేషించాల్సి ఉంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే5.77శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (సివిడి) భారాన్ని అదనంగా మోస్తున్నారు. అమెరికా విధించిన కొత్తసుంకం ఏప్రిల్ 5, 2025నుండి అమల్లోకి వచ్చింది.దీని కారణంగా అమెరికా దేశానికివెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈభారం పడుతోంది. గతంలో వచ్చిన ఆర్డర్‌లకు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి, కోల్డ్ స్టోరేజ్‌లు, పోర్టులలో ఉన్నాయి. కొత్త నిబంధనలవల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారంపడుతోంది. యూరోపియన్ యూనియన్‌లో భారతీయ ఎగుమతిదారులు 50 శాతం తనిఖీ రేట్లు, 47శాతం దిగుమతి సుంకంతో సహా నాన్‌టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ యూనియన్‌తో వారి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ ఎఫ్‌టిఎ) కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను సమర్థవంతంగా ఆక్రమిస్తున్నాయి. వియత్నాం, థాయి లాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారతదేశం నుండి సీఫుడ్‌ను కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. కాగా తాజాగా తుది ఉత్పత్తులపై విధించిన అధికట్యాక్సుల కారణంగా ఆ దేశాలు కూడా మనకు ఇచ్చిన ఆర్డర్లను రద్దుచేస్తున్నాయి. ఇలా ఆక్వారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వారైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకుఇలా సుంకాల బరువు నెత్తినపడింది. అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వారంగాన్ని ఆదుకొని అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ని కోరారు. ఇలాంటి సుంకాల కారణంగా తీవ్ర భయాందోళనలు చెందుతున్న ఆక్వారైతులు ఎగుమతి దారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెబుతున్నా,అదంతా మేకపోతు గాంభీర్యమే. ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆక్వారంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకోగలమని భరోసా ఇచ్చారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో మత్స్య రంగం కీలకభూమిక పోషిస్తోంది. ఎపిలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో కూడా తెలియని గందరగోళ పరిస్థితిలో రైతాంగంఉంది. మరోవైపు ఇంకా పంట సిద్ధంగా ఉంది. అధిక సుంకాల కారణంగా రైతుల నుండి పంట సేకరించడం ఎగుమతిదారులు నిలిపివేశారు. ఈపరిణామాలు రాష్ట్ర ఆక్వారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వా రైతులు,హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకు సమస్యలు వచ్చాయి. ఈ కారణంగా అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి సుంకాల నుంచి రొయ్యలను మినహాయింపు జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్చలుజరపాలి. సకాలంలో దీనిపై జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించడంవల్లఆక్వాపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మంది జీవనోపాధిని కాపాడవచ్చు. అమెరికా సుంకాల కారణంగా తీవ్రభయాందోళన లు చెందుతున్న ఆక్వా రైతులు,ఎగుమతిదారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇతర మార్గాల ద్వారా ఆక్వారంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఆక్వా రంగంపై ఆధారపడ్డ ఏఒక్కరూ అధైర్యపడకుండా ప్రభు త్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అమెరికా అధినేత ట్రంప్ సుంకాలపై నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై పరిస్థితులను నిశితంగా సమీక్షిస్తోంది. ఆరోగ్యానికి రొయ్యల వల్ల కలిగే మేలు గురించి విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు ప్రతిఒక్కరూ రొయ్యల వినియోగం పెంచేలా చేస్తే ఎగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉంది. వైరస్ వంటి ఇబ్బందులు మరింత పెరగకుండా రొయ్యలు కొనుగోలు జరిగేలా చూడాలి. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఆక్వారైతులు మళ్లీ కోలుకోలేరు. అమెరికా విధించిన సుంకం ఒక్క ఆక్వారంగంపైనే కాదని,అన్ని ఎగుమతులకు వర్తిస్తుంది. ఈ ఉపద్రవం నుంచి బయటపడే మార్గాలను ప్రభుత్వం కల్పించాలని పలువురు రైతులు కోరారు.ఆక్వాసాగులో 3 లక్షల మంది రైతులు నేరుగా,పరోక్షంగా మరో 50లక్షల మంది రైతులు ఆధారపడి ఉన్నారు. ఈ ఆకస్మికంగా ఆక్వారంగానికి వచ్చిన సమస్య అనూహ్యమైనది. దక్షిణ కొరియా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలలో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ చేసుకోగలిగితే గట్టెక్కే పరిసితి ఉంది.

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.



సోక్రటీస్

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణకువతో మెలగాలి.



ఎమర్సన్

# ఆకాశమే హద్దుగా.. ఏవియేషన్ హబ్

**శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటైన ఈ స్కూల్ నాలుగేళ్ల ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కోర్సును అందజేస్తుంది. ఈ కొత్త ఎయిర్‌పోర్టుల రాకతో వేలమంది యువతకు ఉద్యోగఅవకాశాలు వస్తాయి. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో తెలంగాణ ఏవియేషన్‌హబ్‌గా మారే అవకాశం ఉంది. దీనితో ఎయిరోస్పేస్ తయారీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలు లభిస్తాయి. జిల్లాల్లో ఉన్న ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే హైదరాబాద్‌దాకా రావాల్సిన అవసరం లేకుండా జిల్లాలనుంచే తేలికగా విమానాలలో ప్రయాణించటానికి అవకాశం కలుగుతుంది. అభివృద్ధి మొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు సైతం విస్తరించే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాలలో విపరీతంగా అభివృద్ధి జరుగుతుంది. ఆయాప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కూడా కొత్తగా అవకాశాలు కలుగుతాయి.**



బొర్రెడ్డి అయోధ్యరెడ్డి

నిన్నటివరకు విమాన ప్రయాణం అంటే ధనవంతులకే పరిమితమై ఉండేది. ఇక రోజులు మారాయి, మధ్యతరగతి వారికి విమాన ప్రయాణం అంటే బస్సులలో ప్రయాణించినంత అవలీలగా పరిమాణం చెందింది. విదేశాలకు వెళ్లాలంటే తప్పనిసరై విమానాలు ఎక్కేవారు. అభివృద్ధి చెందిన నేటి పరిస్థితుల్లో పక్కరాష్ట్రానికి వెళ్లాలన్నా,సమయం ఆదా కోసం విమానాల్లో ప్రయాణం చేస్తున్నారు. గతంలో పారిశ్రామికవేత్తలే ఎక్కువగా విమానాలలో ప్రయాణించేవారు. కానీ నేడు విదేశాలకు విద్యను అభ్యసించడానికి వెళ్లే విద్యార్థులు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారు విమానాల్లో ప్రయాణించటం ఎక్కువైపోయింది. హైదరాబాద్లో శంషాబాద్ విమానాశ్రయం ప్రారంభించినప్పుడు నష్టాలలో నడిచింది. ఈరోజు అక్కడ విమానాల రాకపోకలకు రన్వేలు సరిపోక, వాటిని విస్తరించాల్సి వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలు ప్రయాణికులతో బస్టాండ్ల మాదిరిగా కిటకిటలాడుతున్నాయి. ఎంతగా అంటే ప్రయాణికులకు వీడ్కోలు చెప్పడానికి నాలుగురైదురికిమించి విమానాశ్రయానికి రావొద్దని ఎయిర్‌పోర్టు సిబ్బంది వేడుకోవాల్సి వస్తోంది. అమెరికాలో కళాశాలలు ప్రారంభమయ్యే ఆగస్టు నెలలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. మెట్రో నగరాల విషయంలో ప్రయాణికుల సంఖ్యలో శంషాబాద్ విమానాశ్రయం దూసుకెళ్తుంది. విమాన సర్వీసుల పెరుగుదల అంశంలో హైదరాబాద్ 16.2శాతంతో ప్రథమస్థానంలో ఉండగా, చెన్నై 13.8 శాతం, బెంగళూరు 10.4శాతం, ఢిల్లీ 7.9శాతంతో పురోగతి కనిపించింది. శంషాబాద్ విమానాశ్రయంలో రోజువారీ ప్రయాణీకుల సంఖ్య లక్ష దాటే రోజు మరెంతో దూరంలో లేదు. గత ఫిబ్రవరి 21న రికార్డు స్థాయిలో ఇక్కడి నుంచి 96వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారంటే విమాన ప్రయాణాలకు మన రాష్ట్రంలో ఎంత డిమాండ్ ఉన్నదో చూడవచ్చు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సైతం ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు కేంద్రంపై ఒత్తిడి పెంచింది. దీనితో రాష్ట్రంలో కొత్తగా కేంద్రం రెండు కొత్త ఎయిర్‌పోర్టులను మంజూరు చేసింది. ఇంకో రెండు ఎయిర్‌పోర్టులు పరిశీలనలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామికంగా, పర్యాటకంగా రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడపడం కోసం అనేక ప్రణాళికలు రూపొందించింది. పర్యాటకులు రాష్ట్రానికి మరింతమంది రావాలన్నా, పారిశ్రామికవేత్తలు రాకపోకలకు ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. మన రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఒక్కటే ప్రయాణికులకు అందుబాటులో ఉన్నది. బేగంపేటలో ఉన్న పాత విమానాశ్రయం నుంచి ప్రైవేట్ విమానాలు మాత్రమే నడుస్తున్నాయి. దుండిగల్లో ఉన్న ఎయిర్‌పోర్టు ఎయిర్‌ఫోర్స్‌కు సేవలందిస్తోంది. దీనినిదృష్టిలో పెట్టుకొని జిల్లాలకు సైతం విమానాశ్రయాలు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడితెచ్చి కొత్త విమానాశ్రయాల ఏర్పాటు కు అనుమతులు సాధించారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా మామునూరు వద్ద కొత్త బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌర విమానయానశాఖ పచ్చజెండా ఊపింది. 1930లో నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ మామునూరు వద్ద ఎయిర్పోర్టును ప్రారంభించగా, అది 1981 వరకు సేవలందించింది. కాగజ్నగర్లో ఉన్న పేపర్ పరిశ్రమ, వరంగల్‌లోని ఆజాం జాహిమిల్స్



ప్రయోజనాల కోసం అప్పట్లో దీన్ని నిర్మించారు. ఈ పరిశ్రమలు మూత పడటంతో ఈ ఎయిర్‌పోర్టు కూడా మూత పడిపోయింది. గత పదేళ్లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై శ్రద్ధ చూపించలేదు. తూతూ మంత్రంగా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించటంతో ఈ ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నవిధంగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలను, బేషజాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా కేంద్రంతో సత్సంబంధాలు నెల కొల్పుకొని ఏడాది కాలంలో రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులు సాధించారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను పదేపదే కలిసి రాష్ట్రానికి రావాల్సిన జాతీయ రహదారులను సాధించారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న రోడ్ల వెడల్పుకు కంటోన్మెంట్ భూములు అవసరం కాగా, వాటిని సాధించారు.ఇప్పుడు కొత్తగా నాలుగు ఎయిర్ పోర్టులను సాధించటం కోసం తీవ్ర ప్రయత్నంచేశారు. దీనితో వరంగల్లోని మామునూర్ ఎయిర్‌పోర్టు,ఆదిలాబాద్లో ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతించింది. ఆదిలాబాద్లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ రానున్న రోజుల్లో శిక్షణా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ఐఏఎఫ్ వెల్లడించింది. వీటితో పాటు భద్రాద్రి కొత్త గూడెంలో ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని పౌర విమానయాన మంత్రి తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో కూడా రామగుండం ఎయిర్‌పోర్టును నిర్మించా లని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. పౌరవిమానయాన రంగంపై చేసే ఖర్చువలన ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి. వేలసంఖ్యలో ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పౌర విమానయానం ప్రత్యక్షంగా1.13కోట్ల ఉద్యోగాలను, పరోక్షంగా మరో8.3కోట్ల ఉద్యోగాలను సృష్టి స్తున్నది. 58శాతం అంతర్జాతీయ టూరిస్టులు విమానాల్లోనే పర్యటిస్తున్నారు. మనదేశంలో విమానాల తయారీ, నిర్వహణ, మరమ్మత్తులు చేసేవిభాగాలలో 2.5లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా. వచ్చేమూడేళ్లలో వైమానిక రంగంలో ఉపాధి అవకాశాలు 40శాతం పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రతి విమానానికి 100నుంచి 150మందిసిబ్బంది కావాలి.కాబట్టి ఈ విమానయానరంగంలో ఉపాధి అవకాశాలు ఎంతఎక్కువగా వుంటాయో తెలుసుకోవచ్చు. మనదేశంలో 17 అంతర్జాతీయవిమానాశ్రయాలు మొత్తం159. వీటిసంఖ్య 2030కల్లా 200 దాటే అవకాశం ఉంది. మన దేశంలో 2023లో 15.3కోట్ల మంది విమానాల్లో ప్రయాణించగా, 2030నాటికి ఈసంఖ్య 30కోట్లకు పెరిగే అవకాశముంది. ప్రతిఏటా హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో వైమానిక ప్రదర్శన నిర్వహిస్తారు.ఇక్కడ నిర్వహించే ఎయిర్‌పోర్టుకు ప్రపంచవ్యాప్తంగా అనేక విమానయాన సంస్థలు తరలివస్తాయి. ఎయిర్ అంబులెన్సు, హెలికాప్టర్లు, విభిన్నమైన డ్రోన్లు ఈ ప్రదర్శనల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.ఈ ప్రదర్శనకు వందల మంది వివిధ దేశాలకు చెందిన ఎయిరోస్పేస్ ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలు,పైలట్లు, ట్రైనీ పైలట్లు హాజరవుతారు. కొన్నేళ్ల నుంచి మనదేశ విమానయాన రంగంఏటా10నుంచి 15శాతంవృద్ధిని సాధిస్తోంది. ఈ దశాబ్దంలో దేశీయ ప్రయాణికుల సంఖ్య ఏటా 15 శాతం,అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 6.1శాతం చొప్పున పెరిగింది. గత 15ఏళ్లలో విమానాల ద్వారా సరుకురవాణా దేశీయంగా 60శాతం, అంతర్జాతీయంగా 53శాతం వృద్ధిసాధించింది. ఇదేవిధంగా ఆధునిక వైద్య సేవలకు,ఎయిర్ మెడికల్ సౌలభ్యాలకు మనం చొరవ చూపుతున్నాం. ఇదేగాక, హైదరాబాద్లో జీఎంఆర్ గ్రూప్ ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్ను గత ఏడాది జనవరిలో ప్రారంభించారు. శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిరోస్పేస్ అండ్ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటైన ఈ స్కూల్ నాలుగేళ్ల ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కోర్సును అందజేస్తుంది. ఈకొత్త ఎయిర్‌పోర్టులరాకతో వేలమంది యువతకు ఉద్యోగఅవకాశాలు వస్తాయి. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్యమరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో తెలంగాణ ఏవియేషన్ హబ్‌గామారే అవకాశం ఉంది. దీనితో ఎయిరోస్పేస్ తయారీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలు లభిస్తాయి. జిల్లాల్లో ఉన్న ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే హైదరాబాద్ దాకా రావాల్సిన అవసరం లేకుండా జిల్లాల నుంచే తేలికగా విమానాలలో ప్రయాణించటానికి అవకాశం కలుగుతుంది.అభివృద్ధిమొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు సైతం విస్తరించే అవకాశం ఉంది.ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాల లో విపరీతంగా అభివృద్ధి జరుగుతుంది. ఆయాప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కూడా కొత్తగా అవకాశాలు కలుగుతాయి. ●

# కలిసికట్టుగా పోరాడితేనే ప్రయోజనం!

ఫిరోజ్ ఖాన్

సంఖ్యాబలంతో లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు 2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జెడియూ, తెలుగుదేశం పార్టీ వంటి మిత్రపక్షాల సహకారంతో భారతీయ జనతాపార్టీ రెండు సభల్లోనూ బిల్ పాస్‌అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నది.ఆతర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితేవక్ఫ్‌బిల్లు విషయంలో దూకుడుగావెళ్లిన బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశముంది. ఎన్డీఏ, ఇండియా ఏ కూటమిలో ఉన్నా సౌత్ స్టేట్స్ కలిసికట్టుగా పోరాడకపోతే దక్షిణాది రాష్ట్రాలకు, అక్కడి ప్రజలకు తీరనినష్టం జరిగే ప్రమాదముంది. జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే ఎంపీ స్థానాలసంఖ్య 800నుంచి 1000 వరకు పెరగొచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో లాభపడుతుండగా, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదమున్నది. దీంతో భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువలేకుండాపోతుంది. 1951-52లో దేశ జనాభా 36కోట్లు. అప్పుడు లోక్‌సభ సీట్లు489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశజనాభా 54 కోట్లు. అప్పుడు సీట్లసంఖ్యను 545కు పెంచారు.1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో ఎమర్జెన్సీ సమయంలో లోక్‌సభ సీట్ల సంఖ్యకు మరో 25ఏళ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా అప్పట్లో ప్రధానిగా ఉన్నా వాజ్‌పేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు.లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పునర్ వ్యవస్థీకరణ చేశారు. కొన్ని జనరల్ స్థానాలను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించి వారి ప్రాతినిధ్యం పెంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యపెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలనుపునర్విభజించాలని భావిస్తున్నది. ప్రస్తుతం 2011సెన్సెస్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కరోనా కారణంగా 2021 జనగణనను వాయిదా వేశారు. కేంద్ర ప్రభుత్వం 2025లో జనగణన చేస్తుందనే ప్రచారం సైతం జరుగుతున్నది. జనగణనకు ఇంకా ఏడాది సమయం ఉన్నందున, 2021లో చేపట్టాల్సిన జనగణనను పూర్తిచేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం సీట్లసంఖ్య 80. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 160కిపైగా పెరిగే అవకాశముంది.ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 14.7శాతం నుంచి 16శాతానికి పెరుగుతుంది. రాజస్థాన్‌లో ప్రస్తుతం 25ఎంపీ సీట్లుండగా, అవికూడా 52కి పెరుగుతాయని అంచనా. ఇక్కడ కూడా సీట్లురెట్టింపు అవుతున్నాయి. అలాగే బిహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు కూడా గణనీయస్థాయిలో పెరిగే అవకాశాలున్నాయి. 1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 కాగా, ఇందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్లసంఖ్య 522కి కాగా, దక్షిణాది వాదా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్లసంఖ్య 545కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే ప్రస్తుతం డీలిమిటేషన్‌తో తెలంగాణ లోక్‌సభ సీట్ల సంఖ్య 17 నుంచి 39కి పెరిగే అవకాశముంది. అంటే పెరుగుదల 48 శాతం మాత్రమే. దీని ద్వారా పార్లమెంటులో తెలంగాణ ప్రాతినిధ్యం 3.1 శాతం నుంచి 3.3శాతానికి చేరుకుంటుంది. అదే ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే సీట్ల సంఖ్య 25నుంచి 52కు పెరుగుతుండగా, ఏపీవాటా మాత్రం 4.6శాతం నుంచి 4.3శాతానికి పడిపోతుంది. తమిళనాడులో 28శాతం సీట్లు పెరగనుండగా కేరళలో కేవలం ఒక్కశాతం మాత్రమే సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇలా అయితే పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం 7.2 శాతం నుంచి 6.4శాతానికి, కేరళ ప్రాతినిధ్యం 3.7 శాతం నుంచి 2.9 శాతానికి పడిపోతుంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటగలిగిన పార్టీలు దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువ. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులు కోల్పోయే ప్రమాదముంది. ●

# అంతర్జాతీయ వాణిజ్యంపై ట్రంప్ సుంకం!

తోట యోగేందర్

గత కొంతకాలంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇతర దేశాల నుండి అమెరికా దేశంలోకి దిగుమతి అయ్యే వస్తువులపై పన్నులను ఎడాపెడా పెంచారు. భారత్‌పై 26 శాతం,చైనాపై 34 శాతం వరకు దిగుమతి సుంకాన్ని పెంచారు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో చేసిన ప్రసంగంలో, చైనా, భారతదేశం,యూరోపియన్ యూనియన్ వంటి కొన్ని వాణిజ్య భాగస్వాములకు అమెరికా నుంచి దిగుమతి రేట్లు 50 శాతం వరకు చేరుకోవడంతో, తమ దేశంలోకి జరిగే అన్ని దిగుమతులపై యునైటెడ్ స్టేట్స్10శాతం సుంకాన్ని విధిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ఈ విధానం ట్రంప్‘పరస్పర’ వాణిజ్య వ్యూహానికి ప్రతిబింబంగా పరిగణించబడుతుంది. దీనిలో ఇతరదేశాలు వస్తువులపై విధించిన సుంకాలు వాణిజ్య అడ్డంకులకు ప్రతీకారంగా యునైటెడ్ స్టేట్స్ సుంకాలను వర్తింపజేస్తుంది. ఈ చర్య వాణిజ్య సంబంధాలను తిరిగి సమతుల్యం చేయడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, దాని అమలు దేశీయంగా ప్రపంచవ్యాప్తంగా అనేకసమస్యలు సృష్టించే అవకాశంఉంది. ముఖ్యంగా, అమెరికా వస్తువులపై సుంకాలు విధించే లేదా అమెరికాకు వ్యతిరేకంగా వాణిజ్యపద్ధతుల్లో పాల్గొనే దేశాలపై యునైటెడ్ స్టేట్స్ ప్రతీకారం తీర్చుకుంటుంది.చైనా లేదా యూరోపియన్ యూనియన్ వంటి దేశం అమెరికన్ వస్తువులపై 20శాతం సుంకాన్ని వసూలు చేస్తే, ఆ దేశం నుండి వచ్చే వస్తువులపై ప్రతిఫలంగా 20శాతం సుంకాన్ని వర్తింపజేస్తుంది. ఈవిధానం వాణిజ్య అసమతుల్యతలను సరిచేస్తుందని, అమెరికా అధ్యక్షుడి భావన. కరెన్సీ మానిప్యులేషన్, కోటాలు, రాయితీలు వంటి నాన్‌టారిఫ్ అడ్డంకులు వంటి హానికరమైన వాణిజ్య పద్ధతులుగా తాను భావించే వాటికి ఈసుంకాలు ప్రతిస్పందన అనిట్రంప్ తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. ఇతర దేశాల ‘అన్యాయమైన’ పద్ధతుల కారణంగా అమెరికన్ పరిశ్రమలు తయారీదారులు చాలా కాలంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. దానికి ప్రతిగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ టారిఫ్‌ల అమలు ఈ నెల మొదటివారిలో ప్రారంభమైంది. ఇది అనేక తక్షణ ఆర్థిక ప్రభావాలను కలిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ సుంకాలు తప్పనిసరిగా దిగుమతి చేసుకున్న వస్తువుల ధరకు జోడించబడే పన్నులు. ఈ అదనపు ఖర్చులు తరచుగా వినియోగదారులకు బదిలీ చేయబడతాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు, ఎలక్ట్రానిక్




వస్తువుల నుంచి దుస్తులు, ఆహార ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. అయితే ఇటువంటి సుంకాల చర్యలు ద్రవ్యోల్బణానికి దారితీస్తాయని, అమెరికన్ల జీవన వ్యయం పెరుగుతుందని పలువురు ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశీ పోటీని తగ్గించడం వల్ల దేశీయ ఉత్పత్తి పెరగవచ్చు. కాబట్టి తయారీ రంగం స్వల్పకాలిక ప్రయోజనాలను అనుభవించవచ్చు.అయితే, దీర్ఘకాలంలో మొత్తం ఆర్థిక ప్రభావం అంత అనుకూలంగా ఉండకపోవచ్చునని ఆర్థికవేత్తలభావన. వినియోగదారులు ధరల పెంపుదల భారాన్ని అనుభవించే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలు,ముఖ్యంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో చాలా కష్టపడవచ్చు అని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ టారిఫ్‌లు వినియోగదారుల వ్యయం తగ్గడానికి దారితీస్తాయని మరి కొందరి అభిప్రాయం. ఎందుకంటే పెరుగుతున్న ధరల కారణంగా కుటుంబాలు తక్కువ ఖర్చు చేసే ఆదాయాన్ని కలిగి ఉంటాయి. ఇది ఆర్థిక వృద్ధికి ఉపాధి అవకాశాలకు హాని కలిగించవచ్చు. ఇంకా ఇతర దేశాలు అమెరికా ఎగుమతులపై తమ సొంత సుంకాలను విధించడం ద్వారాపై ప్రతీకారం తీర్చుకోవడంతో వాణిజ్య యుద్ధం తీవ్రమవుతుంది. ఇది వ్యవసాయం, ఆటోమొబైల్స్ సాంకేతికత వంటి పరిశ్రమలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనీ ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. టారిఫ్ విధానంతో ముడిపడి ఉన్న అతిపెద్ద ప్రమాదాలలో ఒకటి ప్రపంచ వాణిజ్య సంబంధాలలో ఉద్రిక్తతలను పెంచేఅవకాశం. ఈ టారిఫ్‌లను విధించడం వాణిజ్యానికి న్యాయాన్ని పునరుద్ధరించడంలో సహాయపడుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విశ్వసిస్తుండగా, ఇతర దేశాలు, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్, చైనా, భారతదేశం ఈ చర్యను ప్రతికూలంగా భావించి తదనుగుణంగా ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉంది. ఆధునిక ప్రపంచం ఆర్థిక పరస్పర అనుసంధానం అంటే సుంకాల వంటి వాణిజ్య అడ్డంకులు అలల ప్రభావాలను కలిగి ఉంటాయి. యూరోపియన్ యూనియన్ నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై 20శాతం సుంకం కేవలం వినియోగదారులపైనే కాకుండా, అమెరికన్ ఎగుమతులపై ఆధారపడే యూరోపియన్ వ్యాపారాలపై కూడా ప్రభావం చూపుతుంది. అదేవిధంగా, ప్రపంచంలోని అతిపెద్ద ఎగుమతిదారులలో ఒకటైన చైనా, వస్తువులపై దాని స్వంత సుంకాలను వర్తింపజేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవచ్చు, ఈ విధంగా ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తుంది.రెండు ఆర్థిక వ్యవస్థలకు హానికలిగించే వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చు. ఈ విధానాల వల్ల ప్రపంచ మార్కెట్లు అనేక ప్రతి కూల ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ●

# ప్రజావాక్కు



### చిన్న చిన్న కారణాలతో తిరస్కరణ

దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగసంస్థల్లో పనిచేస్తున్న పదవీ విరమణ పొందిన వేల మంది ఉద్యోగులు అధిక పింఛనుకోసం దరఖాస్తు చేసినతర్వాత ఒక ఏడాదిన్నర పాటు పరిశీలనపేరిట ప్రాసెస్ పెట్టిన ఈ.పి.యఫ్.వో గత కొద్దిరోజుల నుండికారణమేమి తెలియ చేయకుండానే దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లుగా సమాచారమిస్తుంది.ఇది ఒక్కరి సమస్య కాదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు పింఛనుదారులకి అధిక పింఛను ఇవ్వబోమని, కట్టిన సొమ్మును వెనక్కిఇస్తామని ఈ పి.యఫ్.వో అధికారులు తెలుపగా వెంటనే విషయం తెలుసుకున్న సి.యం. చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి వారందరికీ న్యాయం జరిగేలా చేసారు. ఇదే తరహాలో చంద్రబాబు కేంద్రకార్మిక శాఖా మంత్రితో మాట్లాడి కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగసంస్థల్లోని ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఈ సేవ స్పెషల్ ఎంట్రీ టికెట్ల ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అనేకరకాల సౌకర్యాలను అందిస్తుంది. దర్శనం,వసతిలాంటి వసతులు భక్తులకు ఎంతో ఉపయోగకరం. ఈస్పెషల్ ఎంట్రీదర్శనంటిక్కెట్లు కొన్ని నెలల ముందుగా స్లాట్ పద్ధతిలో తిరుమల తిరుపతి దేవస్థానం కేటాయిస్తుంది.సమస్యఇక్కడే మొదలవుతుంది. భక్తులకు ఈ దర్శనం టిక్కెట్లు లభ్యమైనప్పటికీ వసతి సౌకర్యం టిక్కెట్లు మాత్రం లభించవు. ఈ దర్శనం టిక్కెట్లు ఉన్న వారికి,తిరుమలలోవసతి ఎంతోఅవసరం.వసతి సౌకర్యం కల్పించలేనప్పుడు భక్తులు కోరితే వారి వారి ఈ-దర్శనం టిక్కెట్లు రద్దు చేసుకొనే అవకాశం కల్పించాలి.

-గోమఠం నరసింహాచార్యులు, ప్రకాశం జిల్లా

### సౌర పార్కులు ఏర్పాటు చేయాలి

దేశ అవసరాలనుతీర్చేరీతిలో సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలనిలక్ష్యంగా పెట్టుకున్న భారత ప్రభుత్వం అటు వైపుగా పంచామృత్ సూత్రంతో ముందుకు వెళుతోంది. సౌర పవనవిద్యుత్ ఉత్పత్తిద్వారా జార్ఖండ్ తెలంగాణ మధ్యప్రదేశ్ చత్తీస్‌గఢ్‌లాంటి బొగ్గుఉత్పత్తి చేసే రాష్ట్రాలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆ రాష్ట్రాలలో పీపీపీ మోడ్‌లో సౌరపార్కులు,సౌరవిద్యుత్ ఉత్పత్తిక్లస్టర్లుఫామ్ చేయాలి.

-భారత అవినాష్, జనగాం

### సుంకాల బాధలు భరించక తప్పదా?

అధికసుంకాలు, వీసాల గొడవలు, ఉద్యోగుల భయాందోళనలు ఇంకా యితర సమస్యల మీద అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలకు విసుగు చెంది లక్షలాది ప్రజలు ఆందోళనలకుదిగారు.ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ చేపట్టబోయే విధానాలమీద ప్రజలకు అనుమానం రాకపోలేదు. ఈయన మీద పోటీ చేసిన కమలా హారిస్ గెలుపు వాకిట వరకు వెళ్లి అపజయం పాలయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం ట్రంప్ మొదటిసారి ఎన్నికయినప్పుడు కూడా ప్రజలు శ్వేతసౌధం ముందు ఈయన ఒద్దు బాబోయ్ అని కేకలు వేసారు. కానీ ఏమీ కాలేదు కదా! ఇప్పుడు రెండవసారి ఆయన్నే ఎన్నుకున్నప్పుడు ఈ నాలుగు సంవత్సరాలు ఆయన్ను భరించవలసిందే. యూరోపియన్ దేశాలతోసహా బీద దేశాలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినా మొండి వానికి ఏమవుతుంది? పెరిగిన సుంకాల వల్ల భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువులధరలు పెరుగుతాయంటున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మరమ్మతులు చేపట్టాలి

ఏపిలోని కొన్ని ప్రముఖ జిల్లాల్లో బడుల్లో పిల్లలకు మంచి నీరు అందించే వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల వాటి వినియోగానికి పనులు పెండింగ్ ఉన్నవి. రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలు తెచ్చిన బాటిల్స్ లో నీరు నింపుకునే సదుపాయం,బోరు మరమ్మతులు చేయిస్తే నీటికోసం పిల్లల ఎదురుచూపు ఉండదు. బడులు ప్రారంభానికి ముందుగానే వీటిని పరిష్కరిస్తే , తల్లితండ్రులు కూడా సంతోషించి ప్రభుత్వ ఉచిత పంపిణీలను ఉపయోగించి ప్రభుత్వ బడుల్లో కచ్చితంగా చేర్పించగలరు.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

### డిప్యూటేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగ వికలాంగుల ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతంలో సౌకర్యంగా ఉంటే అదే ప్రాంతంలో ఉంచాలి. ట్రాన్స్‌ఫర్, డిప్యూటేషన్ నుండి ఉద్యోగ వికలాంగులకు మినాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతంలో గదులు అద్దెకు తీసుకుని పిల్లల సంరక్షణలో స్కూల్‌లో జాయిన్‌అయిన తర్వాతవారిని ఇతర ప్రాంతాలకు మార్చడం చాలా ఇబ్బంది అవుతుంది. ప్రయాణానికి అనుకూలంగా ఉండే ప్రాంతంలో ఉంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



అరవింద్‌బాబు అన్నారు. అకాల వర్షాలు రైతులను నష్టపరిచాయన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలో 66 ఎకరాలలో మొక్కజొన్న తడిసి పోయిందన్నారు. కల్లాల్లో పోసి అమ్ముకునే సమయానికి ఇటువంటి పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతులు అండగా నిలిచారని గుర్తు చేశారు. మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం తెలిసిన వెంటనే రైతులను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు పొలాలకు రావడం జరిగిందన్నారు. సమాజానికి అన్నం పెట్టే రైతును కాపాడుకుంటామన్నారు. రైతులు ఏ పార్టీలో ఉన్నా వారిని ఆదుకునే కార్యక్రమం చేయాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ, రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్‌తో స్వయంగా మాట్లాడి రైతులకు తప్పకుండా న్యాయం చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు రైతులకు భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా నిలుస్తున్నదని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గత ప్రభుత్వం రోగులను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి సహాయనిధి నిలిపివేసి పేద ప్రజల మరణానికి కారణమైందని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరికి అలా జరగకూడదని సియంఆర్‌ఎఫ్ నిధులను ప్రజలకు అందిస్తూ, వైద్యం చేయించు కోలేని వారికి ముందుగా ఎల్‌ఓసి ఇచ్చి వారి వైద్యానికి సహాయం చేసి కూటమి ప్రభుత్వం వారిని ఆదుకుంటున్నదని ప్రత్తిపాటి తెలిపారు. అనంతరం బాధితులకు రూ2లక్షలు ఎల్‌ఓసిని



అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, మద్దిబోయిన శివ, ఆరె మల్లిఖార్జునరావు, అద్దంకి అనితాబాయి, విడదల లక్ష్మీనారాయణ(చినకాపు) తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే తెదేపా ధ్యేయం : ఎమ్మెల్యే వేగేశన

**బాపట్ల,ఏప్రిల్8,ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని



బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పంట కాలువలు,డ్రైన్‌ల అధునీకరణ లపై ఇరిగేషన్ అధికారులు,నీటి సంఘాల కమిటి సభ్యులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ వేసవి కాలం లో బాపట్ల నియోజక వర్గంలోపంట కాలువలు, డ్రెయిన్స్‌ల ఆధునికరణ పనులను సక్రమంగా నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించింది అని అన్నారు. కనీసం కాలువలో పార మట్టి గాని,గుర్రపు డెక్క గాని ఏమి తీయలేదు అని అన్నారు.కూటమి ప్రభుత్వం రాగానే నీటి సంఘాల కమిటీలు ఏర్పాటు చేసి నిరంతరం రైతులు అవసరాలు తెలుసుకుని దానికి తగట్టుగా అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసి రైతుల కోసం పాటు పడుతుంది అని అన్నారు. అదేవిధంగా బాపట్ల నియోజకవర్గం లో టెండర్లు పిలిచిన పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జలవనురుల శాఖ సూపరడెంట్ ఇంజనీర్ వెంకటరత్నం గారు మరియు డిఈలు, ఏఈలు, నీటి సంఘల ప్రెసిడెంట్ లు, వైస్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా బైరబోయిన పద్మావతి



**మంగళగిరి,ఏప్రిల్8,ప్రభాతవార్త :** మంగళగిరి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా స్థానిక పార్క్ రోడ్డు యాదవ్ పాలెంకు చెందిన బైరబోయిన పద్మావతి నియమితులయ్యారు. ప్రభుత్వం ఇటీవల మార్కెట్ యార్డ్ చైర్మన్ గా జవ్వాది కిరణ్ చంద్ ను, ఉపాధ్యక్షులుగా ఎర్రగుంట్ల భాగ్య రావు ప్రకటించిన సంగతి విధితమే. మంగళవారం ప్రకటించిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ల జాబితాలో పద్మావతి యార్డ్ డైరెక్టర్ గా స్థానం సంపాదించారు. పద్మావతి మావయ్య బైరబోయిన కోటేశ్వరరావు టీడీపీ కౌన్సిలర్ గా పని చేశారు. ప్రస్తుతం భర్త బైరబోయిన శ్రీనివాసరావు పట్టణ దేశం పార్టీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తమను మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా నామినేట్ చేసిన రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కు పద్మావతి, శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటిని కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మంగళవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను ఈ సందర్భంగా చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలకు వివిధ దశల్లో ఉన్న



పెండింగ్ ఫైల్స్ గురించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాలనకు సంబంధించి నియోజకవర్గంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేశారు. అర్హులైన లబ్దిదారులకు ఆయా పథకాలను అందజేస్తున్న తీరు, అధికారుల విధులు తదితర అంశాలపై వారు చర్చించారు. అదే విధంగా పార్టీ సంస్థాగత పదవులు, నామినేటెడ్ పోస్టులకు సంబంధించి నియోజకవర్గానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు పులిమి రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## జాబ్ క్యాలెండరును విడుదల చేసిన ఇన్‌ఛార్జిమంత్రి గొట్టిపాటి, ఎంపి, ఎమ్మెల్యే, కలెక్టర్

**పెదకూరపాడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి జాబ్ మేళా క్యాలెండర్‌ను మంగళవారం విడుదల చేశారు. అమరావతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి



గొట్టిపాటి రవికుమార్, ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులు, పరిశ్రమలను దృష్టిలో పెట్టుకొని వారికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అధికారి తమ్మాజీరావు పాల్గొన్నారు.

## తెలుగు యువత ఆధ్వర్యంలో మాచర్లలో చలివేంద్రం ఏర్పాటు

మాచర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు షేక్ మోసిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాచర్ల పురపాలక సంఘ ఛైర్మన్ పోలూరి నరసింహారావు ప్రారంభించారు. రోజురోజుకూ ఎండలు ముదురుతున్న నేపథ్యం



లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రైల్వే గేటు సమీపంలోని బస్టాప్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కేశవరెడ్డి, మున్నా రాంబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమత్తులకు చర్యలు

### -నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్8,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, స్టేడియంలో వాకింగ్ ట్రాక్



మరమత్తులకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ స్టేడియం, శ్యామల నగర్ మెయిన్ రోడ్ లోని స్విమ్మింగ్ పూల్ ని పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో వాకర్స్, సభ్యులు పలు సమస్యలు తమ దృష్టికి తెచ్చారని, వాటిలో ముఖ్యమైనని వాకింగ్ ట్రాక్ మరమత్తులు తక్షణం చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. స్టేడియంలోకి కుక్కలు వస్తున్నాయని, మెయిన్ గేటుల వద్ద ఉండే సెక్యూరిటి సిబ్బంది కుక్కలను స్టేడియంలోకి రాకుండా, అలాగే స్టేడియంలో కుక్కలకు తిను బండారాలు పెడుతున్నారని, అలా చేయకుండా వారికి తెలియచేయాలన్నారు. అనంతరం స్విమ్మింగ్ పూల్ ని పరిశీలించి, పూల్ ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా నిర్వహించాలని, లైటింగ్ మరమత్తులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పూల్ పరిసరాల్లో ఓపెన్ జిమ్, పచ్చదనం పెంపుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిఈఈని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, డిఈఈ మధుసూదన్, టిపిఎస్ లు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యం

### -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు,ఏప్రిల్8,ప్రభాతవార్త :** గుంటూరు తూర్పులో ఇప్పటి వరకు రూ.1.24 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత....నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి



ధైర్యంగా వైద్యం చేయించుకుంటున్నారంటే అది సీఎం చంద్రబాబు నాయుడు ద్వారా అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఉందనే నమ్మకమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు విడుదలైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే నసీర్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.1.24 కోట్ల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించామని తెలిపారు. దీనంతటికీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారమే కారణమని చెప్పారు. గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, దీంతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదలు కార్పొరేట్ సేవలను సద్వినియోగం చేసుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వారికి సాయం అందిస్తామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భారతి, కార్పొరేటర్ చిష్టి, గొల్ల ప్రభాకర్, మహంకాళి నరసింహారావు, పోతురాజు చంద్ర, వేల్పూరి కిరణ్, మొహమ్మద్ హఫీజ్, సలీం, కోటా పిచ్చిరెడ్డి, మల్లంపూడి శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, జమీర్, చిలక వెంకటేశ్వర్లు, జబీ,మొవ్వ శైలజ, ఉమామహేశ్వరి, సలాం, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రయం పొందుతున్న బాధిత మహిళల్లో ఆత్మస్థైర్యం నింపాలి

### -బాపట్లజిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**బాపట్ల,ఏప్రిల్8,ప్రభాతవార్త:** సఖి వన్ స్టాప్ సెంటర్ లో ఆశ్రయం పొందుతున్న బాధిత మహిళల్లో ఆత్మస్థైర్యం నింపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాపట్ల పట్టణంలోని సఖి వన్ స్టాప్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గృహ హింస నుంచి రక్షణ కోరి వచ్చే బాధిత మహిళలకు సఖి వన్ స్టాప్ సెంటర్ రక్షణ కవచంలా ఉండాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఏర్పాటైన సఖి వన్ స్టాప్ సెంటర్ మహిళలకు ఎంతో ఉపయుక్తం అన్నారు. సమాజంలో వివిధ రకాలుగా గృహ హింసకు మహిళలు గురవుతున్నారని చెప్పారు. మహిళల హక్కులకు భంగం కలిగించే పరిస్థితి, లైంగిక అవేధింపులు, తదితరమైన ప్రమాదంలో అన్న మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కొరకే సఖి వన్ స్టాప్ సెంటర్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఏర్పాటు చేశాయన్నారు. జిల్లాలో ఎక్కడనుండైనా, ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లోనైనా మహిళలు ఉన్నట్లు సమాచారం వస్తే తక్షణమే సఖి వన్ స్టాప్ సెంటర్ తమ కార్యకలాపాలను ప్రారంభించాలన్నారు. రాజకీయ ఒత్తిడిలు, ప్రలోభాలకు ఎట్టి పరిస్థితులలో గురికారాదన్నారు. అత్యవసరంగా బాధిత మహిళలు ఈ కేంద్రానికి వస్తే ఐదు రోజులపాటు ఆశ్రయం కల్పించే అంశాలపై ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఓ బాధిత మహిళతో కలెక్టర్ మాట్లాడారు. న్యాయ సలహాలు, సేవలు, వసతి సౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఇక్కడ 14 పోస్టులలో 11 మాత్రమే భర్తీ కాగా, ఒక్కొక్కరిని పిలిచి, వారి విధుల నిర్వహణలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు



గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. ఈ కేంద్రానికి పురుషులను ఎట్టి పరిస్థితులలో అనుమానించరాదన్నారు. ఎవరూ ఇక్కడకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది చిత్తశుద్ధితో పని చేస్తే బాధిత మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి డి రాధ మాధవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, తదితరులు ఉన్నారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### - వరుస ఘటనలు జరుగుతున్నా వీడని నిర్లక్ష్యం



రెంటచింతల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో మండలంలోని మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన దూదేకుల సిద్ద (32) సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇటీవల నెలలో వరుసగా రెండు ప్రనమాద సంఘటనలు చోటుచేసుకున్నా రోడ్ సేఫ్టీ అధికారుల్లో చలనం లేకపోవడం, జాతీయ రహదారిపై ఎటువంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రోడ్ సేఫ్టీ కోసం బ్లాక్ స్పాట్స్ ఏర్పాటు క్రమంలో గుంతల వెంబడి మట్టి కుప్పలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంతో ఇప్పటికి ఇద్దరు బలయ్యారు. మండలంలోని పాలువాయిలో జరిగిన ఫంక్షన్‌లో పాల్గొని మోటారు బైక్‌పై తిరిగి స్వగ్రామానికి బయల్దేరుతుండగా జాతీయ రహదారిపై ఉన్న మట్టి కుప్పను ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో సిద్ధయ్య మృతి చెందగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాలకు తరలించారు. మృతుడు రెంటచింతలలోని శ్రీరామ ఫెర్టిలైజర్స్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మృతునికి భార్య సైదాబి, బషీరా (10), పర్వీన్ (7), ఆషాబేగం (5) పిల్లలు ఉన్నారు.

## క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన పల్నాడు జిల్లా కలెక్టర్

**సత్తెనపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన సమస్యల పరిష్కారానికి సంబంధించి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గ్రామంలోని దేవాదాయశాఖ భూములపై గ్రామానికి చెందిన గంధం శ్రీకాంత్ ఫిర్యాదు చేయడంతో నేరుగా వారితో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి సమావేశం అనంతర ం గుడిపూడి గ్రామంలో ఫిర్యాదుదారులను కలిశారు. అధికారులకు సమర్పించినటువంటి ఫిర్యాదులను ఖచ్చితంగా పరిష్కరించాలన్నారు. రికార్డులను సరి చూశారు. చట్ట ప్రకారం దేవాదాయశాఖ భూముల విస్తీర్ణం నిర్ణయిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు అర్జీదారులకు తెలియజేశారు.

## అధికారులతో పలు ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ

**గుంటూరుతూర్పు,ఏప్రిల్8,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో ఈస్ట్ ట్రాఫిక్ లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిర సెంటర్(హిందూ కళాశాల సెంటర్) నుండి గాంధీ పార్కు సెంటర్, హిమనీ సెంటర్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, పండ్ల మార్కెట్, పల్నాడు బస్టాండ్ మరియు ఎత్తురోడ్డు ప్రాంతాల వరకు సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మంగళవారం ఎస్బి డిఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ సరళిని ఆయా ప్రాంతాల్లో ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు



వస్తున్నాయి.?, ఎవరి వలన వస్తున్నాయి..?, ఏయే సమయాల్లో వస్తున్నాయి..?, ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. లాలాపేట సీఐ శివప్రసాద్, కొత్త పేట సీఐ వీరయ్య చౌదరి, ఈస్ట్ ట్రాఫిక్ ఎస్సై విజయకుమార్ రెడ్డి లతో ట్రాఫిక్ సమస్యల గురించి చర్చించి, పోలీస్ శాఖ తరపున ట్రాఫిక్ సమస్యల నివారణకు మున్సిపల్, రోడ్డు రవాణా అధికారులు, రోడ్డు బిల్డింగ్ శాఖా అధికారులతో చర్చించి, తగిన ప్రణాళికలను రూపొందించి, వేగంగా పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.

## సాగర్ డ్యాంపై తెలంగాణ సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి

విజయపురిసౌత్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: నాగార్జునసాగర్ డ్యాంపై విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన 39వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ బలగాలు మంగళవారం కేఆర్‌ఎంబీ ఆదేశాలతో విధుల నుంచి వెనుదిరిగాయి. 2023 నవంబరులో ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల జల



వివాదం తలెత్తడంతో నాగార్జునసాగర్ డ్యాంపై ఆంధ్ర భూభాగంలో వైజాగ్ 234 బెటాలియన్ సీఆర్పీఎఫ్ బలగాలు, తెలంగాణ భూభాగంలో తెలంగాణలో ములుగు ప్రాంతానికి చెందిన 39వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ బలగాలు విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం తెలంగాణ బలగాలు వెనుదిరగడంతో సాగర్ డ్యాం పూర్తిగా వైజాగ్ 234వ బెటాలియన్ పర్యవేక్షణలోకి వెళ్లిపోయింది.

## శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ జగన్‌రెడ్డి : ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు క్రైమ్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైసీపీ శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని,ఎక్కడ శవం దొరికితే అక్కడ జగన్‌నుడ్డి గద్ద లాగా మారి,ఊసరవెల్లి లాగా తన రంగును మాటను మారుస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్మే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళ వారం పశ్చిమ నియోజక వర్గంలో ని టిడిపి కార్యాలయంలో విలేకర ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఘోరవ రాజయం తర్వాత కూడా జగన్‌రెడ్డి తీరులో ఎలాంటి మార్పు కనిపించ దం లేదు,ఐదేళ్ళ పాలనలో చేసిన అరాచకాలకు విసుగుచెందిన ప్రజలు కనీసం ప్రతిపక్షహోదా ఇవ్వ లేదనే విషయం తెలిసినా..



.వైసీపీ తన తీరు మార్చుకోవడం లేదు,వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలే హత్యలు,హత్యాచారాలు,లైంగిక వేధింపులకు పాల్పడితేనోరు మెదపని జగన్‌రెడ్డి ప్రస్తుతం ఆధారాల్లేకుండా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారంలో ఉన్నప్పుడు పోలీసు వ్యవస్థ వాడుకొని ప్రతిపక్షనేతలపై భౌతికదాడులు, తప్పుడు కేసులు పెట్టడానికి ఉపయోగించుకున్న ఆయన ఇప్పుడు విపక్షంలోనికి వెళ్ళే సరికి ఆ వ్యవస్థ బట్టలూడదీ స్తానని హెచ్చరిస్తున్నారని ఇది మొత్తం వ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేయటమేనని,మీ బెదిరింపులకు ప్రజాస్వామ్య వ్యవస్థలు లొంగవని,ఒక పార్టీకి అధినేతగా ఉన్న జగన్‌రెడ్డి ఇలాంటి భాషను మార్చుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హితవు పలికారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన పల్నాడుజిల్లా కలెక్టర్

**సత్తెనపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల్లో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పర్యటించారు. ముప్పాళ్ల మండలం మాదల గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించారు. కూలీలతో ఆయన మాట్లా డారు. వేతనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతులు అన్ని ఉన్నాయా అని ఆరా తీశారు. నందిగామ



గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట డ్వామా పి.డి. శిద్ధ లింగమూర్తి తదితరులు ఉన్నారు.

## భవన నిర్మాణ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేయండి : కమిషనరు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్8,ప్రభాతవార్త :** భవన నిర్మాణ దరఖాస్తులను పరిశీలించి నిర్దేశిత సమయంలోపు అనుమతులు మంజూరు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐ.ఎ.యస్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మంగళ వారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరం నందు పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు, సిబ్బందితో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రణాళిక కార్యదర్శుల వద్దకు వచ్చే భవన నిర్మాణ దరఖాస్తులను రెండు రోజులల్లో పరిశీలించి, తదుపరి అనుమతుల కోసం పట్టణ ప్రణాళిక అధికారుల వద్దకు పంపాలని ఆదేశించారు. కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో అనధికార నిర్మాణాలు, అనధికార లేఅవుట్లు, అనధికార డిస్ప్లే బోర్డుల పై ద్రుష్టి సారించి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాటి వివరాలు సేకరించాలన్నారు.అనధికార నిర్మాణాలను గుర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి నోటీసులు అందజేసి వాటిని తొలగించాలన్నారు. తమ రోజు వారీ పర్యటన లో అనధికార నిర్మాణాలు, డిస్ప్లే బోర్డులు, లేఅవుట్లను గుర్తిస్తే చర్యలు తీసుకొనుట జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా ఈ నెల 14 లోపు నగరంలో ఉన్న అనధికార డిస్ప్లే బోర్డులను గుర్తించి నివేదికలను అధికారులకు అందజేయాలని ఆదేశించారు. అలాగే అనుమతి



తీసుకొని డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసిన వారు కొంతమంది బకాయిలు ఉన్నారని, సదరు బకాయిలను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. వచ్చే నెల నుండి రాష్ట్ర ప్రభుత్వం అనధికార కట్టడాలు, లేఅవుట్లు, డిస్ప్లే బోర్డుల వివరాలను నమోదు చేయుటకు ప్రత్యేకంగా యాప్ ను తీసుకువస్తున్నారని, ఇక నుంచి సదరు యాప్ లో అనధికార నిర్మాణాలు, డిస్ప్లే బోర్డుల వివరాలను నమోదు చేయాలన్నారు. అంతేకాక నగరంలో ఉన్న నగర పాలక సంస్థ ఆస్తులు మరియు నిర్మాణాల వివరాలను సర్వే నంబర్ తో సహా సేకరించి వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. రోడ్డు మార్జిన్లు మరియు సైడు కాలువలు ఆక్రమణలు గురికాకుండా కార్యదర్శులు, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డి.సి.పి సూరజ్ కుమార్, ఏ.సి.పి లు వెంకటేశ్వర రావు, రెహమాన్, టి.పి.యస్ లు, టి.పి.బి.ఓలు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# రైతులకే తొలి ప్రాధాన్యత : ప్రత్తిపాటి



**యడ్లపాడు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రైతుల ప్రయోజనాల్లో కూటమి ప్రభుత్వం రాజీపడదని, గోదావరి జలాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలన్న చంద్రబాబు సంకల్పం కచ్చితంగా సాకారమవుతుందని మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. యడ్లపాడు గ్రామంలోని ఎన్ఎస్‌పీ కెనాల్ పరిధిలోని ఎన్ఆర్‌మేజర్, పెదనందిపాడు, తుర్లపాడు మేజర్ కాలువల్లోని కంప, పూడిక తొలగింపు పనుల్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. స్వయంగా ఎక్స్‌కవేటర్ నడిపి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోటిరూపాయల వ్యయంతో ప్రధాన మేజర్లలో 24పోస్ట్ పూడిక తొలగింపు పనులు ప్రారంభించడం జరిగిందని, పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని అన్నారు. ఏదో మొక్కుబడిగా కాకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా పూడికతీత పనులు జరగాలన్నారు. నీటిప్రవాహానికి ఎక్కడ అడ్డంకులు ఉన్నాయో గుర్తించి రైతుల అభిప్రాయాలు తెల్సుకొని పనులు చేయాలన్నారు. తొలగించిన కంపను కాలువగట్లపై అలాగే వదిలేయకుండా వెంటనే దాన్ని తొలగించాలన్నారు. నీటిసంఘాల అధ్యక్షులు రైతులతో పనుల్ని నిత్యం పర్యవేక్షించాలన్నారు. కంప, పూడిక తొలగింపు ఎప్పట్లోగా పూర్తిచేస్తారని ప్రశ్నించారు. నెలలోపు పూర్తిచేస్తామని అధికారులు, కాంట్రాక్టర్లు సమాధానమిచ్చారు. నెలతర్వాత మరలా పనులు పరిశీలిస్తానని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సరిగా చేయని పనుల్ని మరలా కాంట్రాక్టర్ తో చేయిస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, జువ్వాజి మదన్ మోహన్, కుర్ర రత్తయ్య, వెంకట రత్తయ్య, నీటి సంఘం అధ్యక్షులు రాఘవయ్య, మద్దూరి వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పోపూరి రామారావు, కందిమళ్ల రఘురామారావు, సుబ్బారావు, తోకల రాజేష్, పోతురాజు, కల్లూరి శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరకులు సక్రమంగా అందించని డీలర్లపై కేసులు

**కారంపూడి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మండలంలో ప్రభుత్వం అందిస్తున్నద నిత్యావసర సరకులు ప్రజలకు సక్రమంగా అందించని రేషన్ డీలర్లపై కేసులు నమోదు చేసినట్లు తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ మంగళవారం అన్నారు. కారంపూడిలో ఇద్దరు, ఒప్పిచర్ల, గాదెవారిపల్లె, భట్లువారిపల్లె గ్రామాల్లోని రేషన్ డీలర్లు నిత్యావసర సరకులు సక్రమంగా అందించడం లేదని ఫిర్యాదులు రావడంతో గ్రామాల్లో విచారించడం జరిగిందని తెలిపారు. డీలర్ల వద్దకు వచ్చిన స్టాకు అందించకుండా నిల్వ ఉండినట్లు విచారణలో తేలిందని తెలిపారు. నిత్యావసర సరకుల చట్టం ప్రకారం స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నాలుగు నెలలు గడువు ఇచ్చినా డీర్లు స్పందించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్న మధ్యాహ్నం భోజనం పథకం

**యడ్లపాడు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనపథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో ప్రధానంగా పేద బాల బాలికలు పేదరికం కారణంగా పాఠశాలకు వెళ్ళడం మానివేయకూడదనే ఉద్దేశంతో అన్ని పాఠశాలలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అన్ని పనిదినాలలో విద్యార్థులకు రోజు వారీ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తారు. దినసరిగణాంగా పాఠశాలలో హాజరు సంఖ్యను పెంచడం, పిల్లల్లో సామాజిక సమ భావన పెంపొందించడం, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం వంటివి జరుగుతాయి. ఈ సందర్భంగా



ఎంపియూపి పాఠశాల హెచ్ఎమ్ హేమలత వివరిస్తూ రోజు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రతి రోజూ భోజనం ముందు విద్యార్థులు అందరూ వరుసగా కూర్చొని శ్లోకాలను పఠించి తదుపరి భోజన అరగించటం జరుగుతుందని, వారు తిన్నంత వరకు రోజు వారీ ఒకరు ఉపాధ్యాయులను పర్యవేక్షించుతున్నారు.

## ప్రభుత్వ పథకాలు పేదలకు చేరవేయటంలో కీలకపాత్ర కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లదే : డీఎల్‌డిఓ

**నిజాంపట్నం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ప్రభుత్వ పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను అర్హులకు



చేరవేయటంలో క్షేత్రస్థాయిలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులు కీలకపాత్ర పోషిస్తారని డీఎల్‌డిఓ పి పద్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్స్, పంచాయితీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులను గుర్తించటంలో పక్షపాతం చూపవద్దని కోరారు. సంక్షేమ పథకాల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వారి దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేసి ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో చేరేందుకు పాలిసెట్ కోచింగ్ పుస్తకాలు ఉపయోగకరం



**రేపల్లె(నిజాంపట్నం), ఏప్రిల్8, ప్రభాతవార్త:** సాంకేతిక విద్య అయిన పాలిటెక్నిక్‌లో చేరాలనుకున్నవారికి ప్రవేశపరీక్ష వ్రాసేందుకు పాలిసెట్ కోచింగ్ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు పాలిసెట్ కోచింగ్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్



**పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సువర్ణ బురదగుంట అనే అధ్యాపకురాలికి సీఎస్ఈ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అటెన్షన్ బేస్డ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ ఫర్ ఎన్‌హ్యాన్స్డ్ ప్రొడక్ట్ రెకమెండేషన్ సిస్టమ్స్ అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని తెలిపారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివాది బాలకృష్ణ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈమె తన పరిశోధనలో భాగంగా ఒక ఎస్‌సీఐ, 2 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సువర్ణ బురదగుంటను వర్సిటీ వీసి ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# స్విమ్మింగ్ లో జాతీయ స్థాయిలో సత్తా చాటిన కానిస్టేబుల్ నాగ బ్రహ్మారెడ్డి

**బాపట్ల,ఏప్రిల్8,ప్రభాతవార్త:** పోలీస్ సిబ్బంది క్రీడలలో సత్తాచాటాలని, క్రీడలలో ప్రతిభ కనబరిచే



వారిని ప్రోత్సహిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పిట్టలవానిపాలెం మండలం, చందోలు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నాగ బ్రహ్మారెడ్డిని జిల్లా ఎస్పీ అభినందించి స్విమ్మింగ్ లో సాధించిన మెడల్స్ తో సత్కారించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చందోలు కానిస్టేబుల్ పిట్టు నాగ బ్రహ్మారెడ్డి స్విమ్మింగ్ పోటీలలో సత్తాచాటి మెడల్స్ గెలిచి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడం అభినందనీయమన్నారు. గతంలో కూడా 4 మెడల్స్ గెలుపొందినాడన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, గుజరాత్ లోని గాంధీ నగర్ లో జరిగిన స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని విజేతగా నిలవడం ఎంతో హర్షించదగ్గ విషయ మన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరెన్నో క్రీడా పోటీలలో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు సిబ్బంది బ్రహ్మారెడ్డి స్ఫూర్తితో క్రీడలలో పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచే పోలీస్ అధికారులను సిబ్బందిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు.

# పంట సరళిలో మార్పులు చేసుకోవాలి

**బాపట్ల,ఏప్రిల్8,ప్రభాతవార్త:** మారుతున్న వాతారణం పరిస్థితుల బట్టి రైతులు పంట సరళిలో మార్పులు చేసుకోవాలి అలాగే రైతులు విరివిగా వారి వారి గ్రామాలలో జరుగు



వ్యవసాయ సాగుపై జరుగు కార్యక్రమాలలో పాల్గొని వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలనీ ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, లాం విస్తరణ విభాగ సంచాలకులు డా. జి శివన్నారాయణ అన్నారు. మంగళవారం ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యములో ఏరువాక కేంద్ర జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కోత అనంతరం పరిశోధన స్థానం లో కృష్ణా జోన్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహా సంచాలకులు డా. ఎం వి వి ఎస్ దుర్గ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. డా. శివ నారాయణ మాట్లాడుతూ పరిశోధన అనునది నిరంతర ప్రక్రియ అని అందువల్లనే కొత్త రకాలు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటున్నాయని రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలి అన్నారు. ఈ కార్యక్రమం లో ఏరువాక కేంద్ర బాపట్ల ఏరువాక కేంద్ర సమన్వయ కర్త డా. బాల మురళీధర్ నాయక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఖరీఫ్ మరియు రబీ కాలాల్లో చేపట్టిన కార్యక్రమం వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రైతులు మరియు శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమానికి జిల్లా వ్యాసాయ శాఖ అధికారి వై రామకృష్ణ , ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డా. ఎం ఉష, డి. ఆర్. సి. ఎ డి ఎ డా. రత్న కుమారి, జిల్లా ఉద్యానవన అధికారి జనమ్మ, వివిధ శాఖల అధికారులు, బాపట్ల లోని వివిధ వ్యవసాయ కేంద్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరు అయ్యి అపరాల సేద్యం, సేంద్రియ వ్యవసాయం, కలుపు నివారణ మందులు వాడకం, వివిధ ఆధునిక వ్యవసాయ పనిముట్లు వాడకం వంటి విషయాలపై వ్యవసాయ రైతులకు సలహాలు సూచనలు అందించారు.

# శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా విలువైందని నేడు మారుతున్న కాలంలో మానసిక సమస్యల గురించి అవగాహన కలిగించడం చాలా ముఖ్యమని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాలో ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా మానసిక ఒత్తిడి, మతిమరుపు అంశాలపై సభ జరిగింది. డాక్టర్ సురేష్‌కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మానసిక ఆరోగ్యం మన భావోద్వేగాలను, ఆలోచనను, ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని ఒక వ్యక్తి మనస్సు ఆరోగ్యంగా ఉండడం వల్ల అతను జీవితం పట్ల ఉత్సాహంగా ఉంటూ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతాడన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌కుమార్ ను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. సభలో విద్యాధర కుమార్, కొండా శివరామిరెడ్డి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ అన్న ప్రసాద వితరణ

**పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** పట్టణం లోని తెలగాపాలెం శ్రీ కోదండరామాలయంలో మంగళవారం భారీ అన్న ప్రసాద వితరణ జరిగింది. శ్రీ కోదండ రామాలయానికి మహాసంప్రోక్షణ నిర్వహించడం, అనంతరం



శ్రీరామనవమి సందర్భంగా స్వామివారికి కళ్యాణోత్సవం నిర్వహించిన సందర్భంగా ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం శాశ్వత ధర్మకర్తలు ఉకుం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని దానముల కన్న అన్న దానమే మిన్న అని, ఆకలిగా ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడం మానవ ధర్మమన్నారు. అందులో భాగంగా దేవాలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. తొలుత శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం ఛైర్మన్ అల్లం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు అప్పికట్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి శింగంశెట్టి శివ శంకర్, పలువురు సభ్యులు ఏర్పాట్లు చేశారు.

# డ్రైన్ టు డ్రైన్ నిర్మాణం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కమిషనర్ శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్8,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో నూతన రోడ్ల డ్రైన్ల నిర్మాణం అనంతరం డ్రైన్ టు డ్రైన్ నిర్మాణం చేపట్టాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో థర్డ్ పార్టీ క్వాలిటి కంట్రోల్ విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ బృందం నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో తీసుకోవాల్సిన అంశాలపై ఇంజినీరింగ్ అధికారులకు అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరిగే అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని, లోపాలను ఎప్పటికప్పుడు విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజి థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది గుర్తించి నిర్మొహమాటంగా నివేదిక ఇవ్వాలన్నారు. బిల్లుల చెల్లింపుకు ముందే ప్రతి పనిని నేరుగా పరిశీలిస్తామని తెలిపారు. టెండర్ పొందిన పనులు నిర్దేశిత అంచనాల మేరకు క్షేత్ర స్థాయిలో జరగాలని, క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీ ఆ దిశగా కూడా పరిశీలించాలన్నారు. అలాగే నగరంలో అనేక ప్రాంతాల్లో మెయిన్ లైన్లపై ఇంటికి ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని తమ దృష్టికి వచ్చాయని, దీని వలన ఆయా గృహాలకు 24 గంటలు నీరు సరఫరా జరుగుతుందన్నారు. ఏఈలు సచివాలయాల వారీగా ట్యాప్ లను సమగ్ర సర్వే చేసి, అనధికార ట్యాప్ లు, మెయిన్ లైన్ పై ఉన్న ట్యాప్ లను, బిల్లులు చెల్లించని, గృహ అవసరాలకు తీసుకున్న ట్యాప్ ని కమర్షియల్ గా వినియోగించడం వంటి ట్యాప్ లను ఈ నెల 25వ తేదీలోపు తొలగించాలన్నారు. 25 తర్వాత నేరుగా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని, ఎక్కడైనా అటువంటి వాటిని గుర్తిస్తే సంబంధిత ఎమినిటి కార్యదర్శి, ఏఈపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమినిటి కార్యదర్శులు త్రాగునీటి సరఫరా సమయంలో శ్యాంపిల్స్ తీసుకోవడంలేదని, ఇక నుండి ప్రతి రోజు సచివాలయాల వారీగా తీసిన శ్యాంపిల్స్ రిపోర్ట్ తమకు అందించాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే హౌసింగ్ విధుల్లో ఉన్న కార్యదర్శుల డెప్యుటేషన్ రద్దు చేసి, వారికి ఇంజినీరింగ్ విధులు కేటాయించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజి థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ నుండి మల్లికార్జునరావు, పాండురంగారావు, ఏఈలు, డిఈఈలు పాల్గొన్నారు.



# కెఎల్‌యు లో ఆధునిక తెలుగు సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు పోస్టరు విడుదల

**తాడేపల్లి,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు ,వాదాలు , సమాలోచన అనే అంశంపై కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని బిఏ (ఐఏఎస్)



విభాగం,ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యాయన కేంద్రం సంయుక్తాధ్వర్యంలో ఈనెల 10,11 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు బిఏ(ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివ నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవుల మధ్య కుల,మత, విద్య,ఆర్థిక,లింగ,సాంస్కృతిక అసమానతలే ప్రధాన కానా వ్సుగా తెలుగు భాషలో ఆధునిక సాహిత్యంఆవిర్భ వించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సుకు హాజరయ్యే పరిశోధకులకు, ఆచార్యులకు రెండురోజుల ఆన్ డ్యూటీ అవకాశాన్ని కల్పించిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లో జరిగే ఈ సదస్సుకు ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ మాజీ ఉప సభాపతి,అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్,రాష్ట్ర రోడ్డు సెఫ్టీ విభాగం డిఐజి సిహెచ్ విజయరావు, నెల్లూరు మున్సిపల్ కమీషనర్ వై.ఓ.నందం, జిఎస్టీ అడిషనల్ కమీషనర్ డి.రాంబాబు,ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యాయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్,కృష్ణా జిల్లా రచయితల సంఘ కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్,తానా పూర్వ అధ్యక్షులు తోటకూర ప్రసాద్,వాషింగ్టన్ నుంచి ఇంగువ మాధురి,జర్మనీ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ తొట్టెంపూడి ప్రసాద్ వంటి పలువురు ప్రముఖులు ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు .పరిశోధక విద్యార్థులు ,ఆచార్యులు,ఉపన్యాసకులు, సాహితీమిత్రులు ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని భావి సమాజానికి సాహిత్యం ద్వారా మార్గనిర్దేశం చేయాలని ఆయన కోరారు. పరిశోధనా మిత్రులు మరిన్ని వివరాలకోసం సహాయ ఆచార్యులు డాక్టర్ కె.ప్రజాపతి ని 98899 41900 నెంబరులో సంప్రదించాల న్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ,ప్రొ విసిలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, బిఏ (ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య,ఉప విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## ఎపి బయోడైవర్సిటి బోర్డు చైర్మన్ విజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ధూళిపాళ్ల ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్



**చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటి బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్‌ను మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం పట్టణానికి చెందిన ధూళిపాళ్ల ఫౌండేషన్ చైర్మన్ ధూళిపాళ్ల శ్రీనివాస్ కలసి అభినందనలు తెలియచేశారు.

## సామ్‌సంగ్ నుండి బేస్పోక్ ఏఐజెట్ అల్ట్రా కార్డ్‌లెస్ వ్యాక్యూం క్లీనర్

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఈ నెలలో జరిగిన వెల్‌కం బేస్పోక్ ఏఐ గ్లోబల్ ఈవెంట్లో తమ ఆధునిక శక్తివంతమైన కార్డ్‌లెస్ స్టిక్ వ్యాక్యూమ్ క్లీనర్‌ను విడుదల చేయనున్నట్లు శాంసంగ్ ప్రతినిధులు వెల్లడించారు. మెరుగైన ఏఐ క్లీనింగ్ మోడ్ 2.0, అధునాతన హెపా వడపోత వ్యవస్థతో తాజా ఆవిష్కరణ, స్మార్ట్‌హోమ్‌క్లీనింగ్ ఉపకరణాలతో శాంసంగ్ నాయకత్వంపై నిర్మించబడిందన్నారు.

# వేమూరులో పోషకాహార పక్షోత్సవాలు

**కొల్లూరు, ఏప్రియల్ 8 (ప్రభాతవార్త) :** వేమూరు మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం పౌష్టికాహార



పక్షోత్సవాలను నిర్వహించినట్లు వేమూరు, జంపని సెక్టార్ సూపర్‌వైజర్లు అమృతవాణి, మాధవిలు తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అమృతవాణి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పిల్లలకు అవసరమైన రాగులు, జొన్నలు, కొర్రలు మొదలైన పౌష్టికాహార చిరు ధాన్యాలతో వంటలు తయారు చేసే విధానాన్ని తెలియజేశామన్నారు. ఆరోగ్య రీత్యా ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా ఆకు కూరల్లో మాంసకృత్తులు కూడా ఉంటాయన్నారు. ఏప్రిల్ 8నుండి 22వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ పోషకాహార మహోత్సవాలు జరుగుతాయన్నారు. జంపని సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్య విషయాల్లో కూడా ఎంతో జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముందుగా వేమూరు, జంపని, గ్రామాల్లో పౌష్టికాహార విలువలపై ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సరోజినీ, రాజకుమారి, రెబ్బమ్మ, మదీనా, మస్తాన్, బి.అమల, బసవమ్మ, తల్లులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

**తెనాలి, ఏప్రియల్ 8 (ప్రభాతవార్త) :** గర్భిణీలు పోషకాహార విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ తలాటం



మురళీకృష్ణ కోరారు. పట్టణంలో మంగళవారం సుల్తానాబాద్, గంగానమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎంలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మహిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు కాన్పులను ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రమే నిర్వహించుకోవాలన్నారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వటం వలన తల్లిపాలలో ఉండే కోలాస్ట్రం బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు లాగా పని చేస్తాయన్నారు. పిల్లలు ఎదుగుదలకు ఎంత ఉపకరిస్తుందన్నారు. డాక్టర్ వట్టి ప్రోలు మౌనిక కుమార్ గర్భిణీస్త్రీలు ప్రతి నెలా చెకప్ చేయించుకోవడం వలన వారి యొక్క ఆరోగ్య స్థితి, బరువులో పెరుగుదల, తల్లి గర్భంలోని పిండము యొక్క ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్, సబ్ యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గుద్దంటి రవికుమార్, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివప్రసాద్, హెల్త్ విజిటర్ పాగోలు వెంకటేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ మున్నంగి రత్నాకరరరావు, షేక్ బాషీద్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ భూషణంకు అంబేద్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రధానం

**తెనాలి, ఏప్రియల్ 8 (ప్రభాతవార్త) :** పాత్రికేయ రంగంలో సేవలందిస్తున్న జర్నలిస్టులకు అంబేద్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డును శ్రీశ్రీ మీడియా మరియు టాలెంట్ టెక్స్‌ప్రెస్ నిర్వాహకులు సినీ దర్శకులు కనపర్తి రత్నాకర్ ఆధ్వర్యంలో 2025 అంబేద్కర్ ఎక్స్‌లెన్స్ అవారును ఆంధ్రప్రభ రిపోర్టర్ ఉన్నం ధనవ భూషణ్‌కు ప్రధానం చేయటం హర్షణీయమని పట్టణంలోని హోటల్ ప్రిన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహశీల్దార్ గోపాలకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లెన్స్ అవార్డు అందించి సత్కరించారు. జర్నలిస్టులు మరి ముఖ్యంగా నైతిక విలువలను కలిగి ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, ఒన్‌టౌన్ సిఐ వి.మల్లిఖార్జునరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తెనాలి గౌరవ సలహాదారులు ఎస్.ఎస్.జహీర్, జిల్లా కార్యదర్శిలు మునిపల్లి శ్రీకాంత్, అంబటి శ్యామ్‌సాగర్, కోశాధికారి ఎస్ఎస్వీ శేఖర్, వైస్ ప్రెసిడెంట్ అచ్యుత సాంబశివరావు, సభ్యులు పాదర్తి వెంకట్, కోడూరు నాగరాజు, శ్రీరామ్ సుభాని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు, కంచర్లపాలెం పంచాయితీ కార్యదర్శి పొన్నెకంటి జయదేవ్, మాజీ జ్యూడిషియల్ అధికారి ఉన్నం ఏస్కెల్, యడ్లపల్లి రవికిరణ్, తేదేపా నాయకులు సుద్దపల్లి నాగరాజు, మాస్ నాయకులు కూచిపూడి మోహన్, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, శీలం వినయ్, ఉన్నం అనిల్‌కుమార్, ఉన్నం సన్నీ, మంచికలపూడి ప్రభాకర్, పినపాటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలి : ఆర్డీఓ రామలక్ష్మి



**అమృతలూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలని రేపల్లె ఆర్‌డిఓ రామలక్ష్మి రెవిన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక తహశీల్ధార్ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని విఆర్‌ఓలకు ఆర్‌డిఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డిఓ రామలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే రీ సర్వే పక్కాగా ఉండాలని సూచించారు. రైతుల దగ్గర నుండి నీటి పన్నును వెంటనే వసూలు చేసి మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్థార్ కె.నెహ్రూబాబు, ఆర్ఎస్ డిటి. ఎం.శివయ్య, ఆర్ఐ సౌజన్య, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

# బీసి కార్పోరేషన్ ఋణ మేళాను సద్వినియోగం చేసుకోండి

## -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు



**పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** ప్రభుత్వం బీసి కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేసేందుకు ఈ నెల 9వ తేదీ ఉదయం 10గంటలకు మునిసిపల్ కార్యాలయంలో రుణ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. రాష్ట్రంలోనీ బీసి కార్పోరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య,క్షత్రియ, బ్రాహ్మణ కార్పోరేషన్లకు సంబంధించిన లబ్దిదారులకు బీసి కార్పోరేషన్ ద్వారా వివిధ పథకముల ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకొన్న లబ్దిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న అప్లికేషన్ జిరాకు స కాపీ, ఆదార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుబుక్, కుల దృవీకరణ పత్రాలు అన్నియు రెండు సెంట్లు జిరాక్సు కాపీలను కార్యాలయంలో అందజేయాలన్నారు. క్రెడిట్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ముప్పాళ్ళ కోరారు.

# నగరంలో విస్తృతంగా యాంటీ లార్వా ఆపరేషన్స్

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** నగరంలో ప్రజలకు దోమకాటు వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గాను ఇంఛార్జి మున్సిపల్ కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నగరంలో బయాలజీ సూర్యకుమార్ అధ్వర్యంలో విస్తృతంగా యాంటీ లార్వా ఆపరేషన్స్‌ను మలేరియా సిబ్బంది చేపట్టారు. సోమవారం ఉదయం 59వ వార్డు గంగానమ్మ గుడి కల్వర్ట్ వద్ద ఫాగింగ్,యంయల్ ఆయిల్ స్ప్రే,ఏలూరు కాల్వ సెంటర్ వద్ద ట్రక్సర్ మెషిన్‌తో కాలువలోని వ్యర్థాలను శుభ్రపర్చడం చేశారు. 30వ డివిజన్ రామకృష్ణాపురం,57వ డివిజన్ కొత్త రాజరాజేశ్వరీపేట,బుడమేరు కాలువలో గుర్రపు డెక్కలను బోట్ల సహాయంతో మలేరియా సిబ్బంది శుభ్రపర్చారు. నీటి నిల్వలు ఎక్కడ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు.



నీరు నిల్వ ఉంటే దోమ పుట్టుకకు కారణమవుతుందని ఎప్పటికప్పుడు యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తూ ప్రజలకు దోమకాటు వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## నవమి ఉత్సవాలకు పెట్టింది పేరు చిలకలూరిపేట : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త:** శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు చిలకలూరిపేట పెట్టింది పేరని, పట్టణంలోని



అన్నివర్గాలు సమిష్టిగా నిర్వహించే నవమి వేడుకలు చూడటానికి రెండు కళ్లు చాలవని, రాష్ట్రంలోమరెక్కడా ఈ విధంగా నవమి శోభ ఉండదని మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని బాలాజీ సంఘం, స్టీలుకొట్లు బజార్, మైదానవీధి,గౌడవీధి,బోస్‌రోడ్, షరాఫ్ బజార్లలోజరుగుతున్న శ్రీరామనవమి పూజా కార్యక్రమాలలో మంగళవారం ప్రత్తిపాటి పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో బాగంగా ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు, మంచినీరు, మజ్జిగ చలివేంద్రాలను ఆయన పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచి ఏర్పాట్లు చేశారని నిర్వాహకులను అభినందించారు. కులమతాలకు అతీతంగా సమాజ హితం కోరుతూ ఐకమత్యంతో పట్టణ వాసులు శ్రీరామనవమి ఏన్నో ఏళ్లనుంచి ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. వ్యాపార వర్గాలు, హిందు సంఘాలు, భక్తులు, వివిధ వర్గాల ప్రజలు శ్రీరామకళ్యాణం ఇతర కార్యక్రమాలకు వ్యయ ప్రయాసలకు తట్టుకుంటూ ప్రజలు మెచ్చేలా నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. విద్యుత్ దీపాల వెలుగులతో అలంకరించిన ఆలయాలు చూడటానికి రెండు కళ్లు సరిపోవని అన్నారు. ఈ కార్యక్రమాలలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్‌ఖాన్, కనమర్లపూడి రమేష్, కె లక్ష్మీ తిరుమల, అమరా రమాదేవి, పార్టీ నాయకులు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రైతు సాధికారితకు కూటమి పభుత్వం పెద్దపీఠ


**వెల్దుర్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయానికి రైతు సాధికారితకు ఎన్డీయే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. వెల్దుర్తి మండలం, వెల్దుర్తి గ్రామంలో



మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా మంజూరైన వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేశారు. 30 తైవాన్ స్ప్రేయర్ ఇంజిన్లు, 20 రోటవేటర్లు, 20 కల్టివేటర్లును అర్హులైన 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తెలుగుదేశం పార్టీ వెల్దుర్తి మండల నాయకులు పాల్గొన్నారు.

## అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల,ఏప్రిల్08,ప్రభాతవార్త:** ప్రగతిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2025-2026 ఆర్థిక సంవత్సరంలో 10వేల కుటుంబాలకు పాడి పశువులను అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించారని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందుకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని పశు వైద్య శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. ఒక్కో కుటుంబానికి రెండు పశువుల చొప్పున ఇవ్వాలన్నారు. లబ్ధిదారులకు శ్రీనిధి ఉన్నతి మరియు బ్యాంకు లింకేజ్ ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. పశువుల పంపిణీలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని అయన అధికారులకు సూచించారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణ లక్ష్యాలను ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.వికలాంగులు మరియు హెల్త్ పెన్షన్ల విషయమై పిడిడిఆర్‌డిఏ తో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆరా తీశారు. పెన్షన్ల పంపిణీలో ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో 10వేల ఎకరాలలో పశుగ్రాసం పెంచేందుకు లక్ష్యంగా నిర్దేశించిందని ఆయన తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఒక్కొక్క పంచాయతీలో 50 ఎకరాల చొప్పున స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఎ పి డి ను ఆయన ఆదేశించారు. ఆస్థలంలో బోర్లు వేయించి వాటి ద్వారా గడ్డిని పెంచాలన్నారు. ఆ స్థలాలను స్వయం సహాయక సంఘాలకు అందజేయాలన్నారు. ఆస్థలంలో పెరిగిన గడ్డిని ప్రతి ఇంటికి అందజేసి నామమాత్రంగా డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. ఆ డబ్బును ఆసంఘాల అవసరాలకు వాడతారని ఆయన తెలిపారు.అన్నా క్యాంటీన్ల నిర్వహణపై మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆరా తీశారు. అన్న క్యాంటీన్ కి వచ్చే వారి వివరాలను నమోదు చేయాలని అన్నారు. వారి నుండి ప్రజాభిప్రాయం సేకరించాలని తెలిపారు. అన్న క్యాంటీన్ కి వచ్చే వారికి సంతృప్తికరమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్, డి ఆర్ డి ఎ పి డి కె.శ్రీనివాసరావు, బాపట్ల, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్య రంగాన్ని ప్రైవేట్ పరం చేసే కుట్ర జరుగుతుంది : మాజీ ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మాజీఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పేదవానికి ఉచితంగా వైద్యం అందించాలని మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన గొప్ప ఆశయానికి తూట్లు పొడిచే కుట్ర ప్రస్తుతం జరుగుతుందన్నారు.మాజీ సిఎం వైఎస్ జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1000 విలేజ్ హెల్త్ క్లినిక్స్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఒక మండలానికి రెండు పిహెచ్‌సిలు, 3 వైద్యులను ఉంచే కార్యక్రమం చేశారన్నారు. నాడు-నేడు పథకంలో50-100 పడకలకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లను అప్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు. ఆరోగ్యశాఖలో 54వేల మంది వైద్యులు, ప్రత్యేక డాక్టర్స్, ల్యాబ్ అసిస్టెంట్‌లు, నర్సులను నియమించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం 75 నియోజకవర్గాలలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో ప్రభుత్వాసుపత్రులు పెట్టే కార్యక్రమం చేస్తామని చెప్పడం ద్వారా పేదలకు వైద్యం దూరం చేస్తామని అంటున్నారని విమర్శించారు. ఇప్పటికే నిర్మించిన మెడికల్ కళాశాలలను సైతం ప్రైవేట్ వారికి అప్పగించే చర్యలు ప్రభుత్వం ప్రకటించిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వివరించారు.



## వార్డులోని సమస్యలను తక్షణమే పరిష్కారించాలి

**బాపట్ల,ఏప్రిల్08,ప్రభాతవార్త:** ప్రజల వద్దకు వెళ్ళి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరుగుతుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.మంగళవారం మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా వేగేశన నరేంద్ర వర్మ బాపట్ల పట్టణంలోని 2వ వార్డులో పర్యటించి, ప్రజల దైనందిన సమస్యలను నేరుగా పరిశీలించారు.ప్రత్యక్షంగా ప్రజల సమస్యలను విని,తక్షణ చర్యలు తీసుకునే చొరవ అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి గారు,మునిసిపల్ ఇంజనీర్ కృష్ణారెడ్డి గారు,పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు గారు, సందు సాంబశివరావు,అంకాల శ్రీనివాసరావు,మరియు వివిధ శాఖల అధికారులు,తెలుగుదేశం, జనసేన,బిజెపి,నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు



## వెల్దుర్తిలో నేడు ప్రజాదర్బార్

**వెల్దుర్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తిలో నేడు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ప్రజాదర్బార్లో నియోజకవర్గ ప్రజలు పాల్గొని వారి సమస్యలను వినతుల రూపంలో అందించి, పరిష్కరించుకోవాలని విజ్ఞప్తిచేశారు.

## అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో జీర్ణకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స

**నరసరావుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కేంద్రంలోని అంజిరెడ్డి హాస్పటల్స్‌లో గ్యా స్ట్రిక్, లివర్, జీర్ణకోశ వ్యాధులకు ఆధునిక వైద్య సేవలను అందిస్తున్నట్లు ఛైర్మన్ డాక్టర్ లోకి రెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళ వారం తెలిపారు. ఇరవై సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో వేల మంది ప్రజలకు వైద్యసేవలను అందించి ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించడం జరుగుతుందన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఇఆర్‌సిపి, ఎంఆర్‌సిపి, అన్నిరకాల అడ్వాన్స్ ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవతో పాటు ఇహెచ్ఎస్, అన్ని ప్రైవేట్ హెల్త్ కార్డులు తీసుకోవడం జరుగుతుం దన్నారు. ఉచితంగా అందించే సర్జరీలను ఆయా ప్యాకేజీలలో వినియోగించుకోవాలని కోరారు. అంజిరెడ్డి హాస్పటల్స్ అందిస్తున్న వైద్యసేవలను ప్రకాశం, పల్నాడు జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు.



## పట్టణంలో ఆక్రమణల తొలగింపు

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపును కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు ఆదేశాల



మేరకు నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబయ్య ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగింది. అన్న క్యాంటీన్ వద్ద నుండి ప్రారంభించి పెద్దచెరువులోని బిసి కమ్యూనిటీహాల్ వరకు చేపట్టారు. డ్రైన్లను నిర్మించిన మెట్లను తొలగించారు. అదే విధంగా డ్రైన్లపై నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేసే వారిని హెచ్చరించడంతో పాటు టీ స్టాల్స్, హోటల్స్‌ను అక్కడి నుండి తొలగించారు. ఎట్టి పరిస్థితులలో ఆక్రమణలను సహించబోమని హెచ్చరించారు. సత్తెనపల్లిరోడు లోని సాయినగర్ సమీపంలో అనధికారికంగా వేసిన ప్లాట్లలో బౌండ్రీ రాళ్ళను తొలగించారు. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు సూచించారు.

**ప్రభుత్వ రాయితీతో పన్నుల చెల్లింపు...**

రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా కార్యాలయంలో నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రాపర్టీ ట్యాక్స్, ఖాళీ స్థలముల పన్నుకు సంబంధించి 5 శాతం రాయితీని వినియోగించుకోవాలని కమిషనర్ జశ్వంత్‌రావు కోరారు. ఈ నెల 30వతేదీలోపు ఏఖ మొత్తంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ లభిస్తుందని తెలియజేశారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్

**సత్తెనపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ మంగళవారం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పేదలకు అందించే ఆహారాన్ని, మధ్యాహ్న భోజనాన్ని వివిధశాఖల అధికారులతో కలిసి రుచి చూశారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమయ వేళలు పాటించాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని టోకెన్లు ప్రజలకు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్‌తో పాటు డి.ఈ. వెంకటరమణ, ఏఈ సాగర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారధి పాల్గొన్నారు.



## యువికా-2025కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నాగార్జున

### - పల్నాడు జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి

విజయపురిసౌత్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: పాఠశాల విద్యార్థుల కోసం యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్ పేరుతో భారతీయ అంతరిక్ష పరిశోధనా



సంస్థ (ఇస్రో) యువికా 2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేశంలో మొత్త 350 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 10 మంది ఎంపికకాగా, విజయపురిసౌత్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి పి.వెంకటనాగార్జున పల్నాడు జిల్లా నుంచి ఒకేఒక్కడు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబులు నాగార్జునను అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు తిరుపతి జిల్లాలోని సూళ్లూరు పేటలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, దేశంలోని వివిధ స్పేస్ సెంటర్లలో మే 19 నుంచి 30 వరకు అంతరిక్ష పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ధ్యేయం. విద్యార్థి వెంకట నాగార్జునను పాఠశాల హెచ్ఎం యు.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల పూర్వవిద్యార్థులు హర్షం వెలిబుచ్చారు. విద్యార్థి తండ్రి పి.వంశీకృష్ణ స్థానిక ఏపీఆర్‌డీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేస్తాం : ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి విజయలక్ష్మి

పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త: ఓటర్ల జాబితాను నూరుశాతం పారదర్శకంగా తయారు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి టివి విజయలక్ష్మి చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలంటే అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలన్నారు. ప్రస్తుతం మృతి చెందిన, డబుల్ ఎంట్రీ వున్న ఓటర్లను విచారణ చేసి వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని తొలగించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ విషయంలో బిఎల్వోలకు సహకరించాలని కోరారు. బిఎస్పీ నాయకుడు ఓటర్ల జాబితాను ఎన్ని పర్యాయాలు విచారణ చేపట్టినా డబుల్ ఎంట్రీలు ఎందుకొస్తున్నాయి...ఓటర్ల జాబితాలో పారదర్శకత లోపించడం వల్లే ఇలాంటి



పరిస్థితి ఎదురవుతుందన్నారు. డబుల్ ఎంట్రీలు రాకుండా ఓటుకు ఆధార్‌ను లింకు చేయాలని సూచించారు. అందుకు విజయలక్ష్మి మాట్లాడుతూ ఓటుక ఆధార్ లింక్ చేయడం అనేది ఎన్నికల కమిషన్ తీసుకోవాల్సిన నిర్ణయమని, సభ్యులు సూచించిన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 17సంవత్సరాలు నిండిన వారు కూడా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకొంటే వారి అర్జీలను కూడా పరిశీలించి, వారి ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. మళ్ళీ సార్వత్రిక ఎన్నికలకు సుమారుగా నాలుగు సంవత్సరాలు సమయం ఉందని, ఈ లోగా నూరుశాతం ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేయాలనే లక్ష్యంతోనే ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా తయారీ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తుందన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని తహశీల్దార్లు మహమ్మద్ జియావుల్ హక్, శ్రీనివాసశర్మ, పరాశరం కృష్ణకాంత్, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ హసన్ అహ్మద్, పార్టీల నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, లక్ష్మీనారాయణచదరి, పఠాన్ అహమ్మద్‌ఖాన్, కలపాల శ్రీనివాసరావు, గోవాడ వెంకటకృష్ణారావు, దేశంశెట్టి సూర్య, ఆరేటి రామారావు, గోపిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపులు తనిఖీ


**రాజుపాలెం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండలంలోని రెడ్డిగూడెం, చౌటపాపాయపాలెం గ్రామాలలో మద్యం షాపుల తనిఖీని సత్తెనపల్లి ఎక్సైజ్ సి.ఐ. పి.విజయ్‌కుమార్, ఎస్.ఐ. కె.నాగలక్ష్మిలు



మంగళవారం నిర్వహించారు. తనిఖీలలో షాపు సేల్స్‌మెన్‌కు పలు సూచనలు చేశారు. ఎంఆర్‌పి ధరకే మద్యం అమ్మకాలు జరపాలన్నారు. ఎకౌంట్ రిజిస్టర్ ్స ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. షాపు ముందు ఎంఆర్‌పి ధరలు స్పష్టంగా అర్థమయ్యే రీతిలో బోర్డును ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ సి.ఐ. పి.విజయ్‌కుమార్ సూచించారు.

## ప్రజల ఆశీస్సులు, దైవానుగ్రహంతో మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిన్నకుమారుడు మార్క్‌శంకర్ ఇవనోవిచ్ అగ్నిప్రమాదంలో గాయపడటం దురదృష్టకరమని, ప్రమాదవార్త తెలిసిన వెంటనే దిగ్భ్రాంతికి గురయ్యానని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సింగపూర్‌లోని పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన మార్క్‌శంకర్ త్వరగా కోలుకొని గతంలోలా తల్లిదండ్రులతో ఉల్లాసంగాగడపాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. దైవానుగ్రహం,ప్రజల ఆశీస్సులతో మార్క్ క్షేమంగా ఇంటికి చేరాలని కుమారుడి ప్రమాదవార్తపై ఆందోళన చెందక ధైర్యంగా ఉండాలని పవన్‌ను కోరుతున్నానన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వంతో మాట్లాడి మార్క్‌శంకర్‌కు,అగ్నిప్రమాదంలో గాయపడిన మిగిలిన పిల్లలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రత్తిపాటి మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.



## ఉద్యానవన పంటలను పరిశీలించిన కలెక్టర్


**పెదకూరపాడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరేలు మంగళవారం పెదకూరపాడు మండలంలోని కాశిపాడు గ్రామంలో పర్యటించారు. అక్కడ ఉన్న ఉద్యాన పంటలైన బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్, జామ, అవకాడు తోటలను పరిశీలించారు. పంటల సాగుకు సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాబడి,



ఖర్చుల గురించి చర్చించారు. జిల్లాకు వచ్చే ఆదాయంలో హార్టికల్చర్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఉద్యాన రైతు ఆంజనేయులు బొప్పాయి సాగులో ఎకరాకు 1000 మొక్కలు నాటారన్నారు. 40 టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. కిలో రూ.10ల చొప్పున విక్రయించారని, సుమారు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. రైతులు మిరప పంటకు పరిమితం కాకుండా జామ, డ్రాగన్ వంటి పండ్ల తోటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సి.హెచ్.రమణారెడ్డి పాల్గొన్నారు.

## రొంపిచర్ల మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**రొంపిచర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రొంపిచర్ల మండలంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. విప్పర్ల రెడ్డిపాలెం గ్రామంలో కనుమూసిన వైఎస్సార్‌సీపీ నాయకులు దుద్దుకుంట శివారెడ్డి కుటుంబాన్ని ఈ



సందర్భంగా వారు పరామర్శించారు. కుటుంబ పెద్దలు దుద్దుకుంట వెంకటేశ్వరరెడ్డికి సానుభూతిని తెలియజేశారు. శివారెడ్డి మృతి బాధాకరమన్నారు. కుటుంబసభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాధించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా శివారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా గ్రామంలో పార్టీ నాయకులను, కార్యకర్తలను కలిసి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట పార్టీ నాయకులు కురుగుంట శ్రీనివాసరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, పొలిమేర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రొంపిచర్లలో సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీ

రొంపిచర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి నాయకులుకాసా రాంబాబు, చక్రవరం సత్యనారాయణ నాయకత్వం వహించి మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్పొరేట్ శక్తులకు కేంద్రం ఊడిగం చేస్తుందన్నారు. వారికి రాయితీలు కల్పిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపైపెను భారాలు మోపుతున్నారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మార్చి 23 నుండి ఏప్రిల్ 14వరకు దేశ వ్యాప్త ప్రచార ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. సిపిఐ నిర్వహించే పోరాటాలకు రైతులు, కార్మికులు కలిసి రావాలని నాయకులు రాంబాబు, సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో నాయకులు వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, జాన్ సైదా, గణేష్ ప్రసాద్, కృపారావు, రాజు, ఏసోబు, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

**పెదకూరపాడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సామాన్య ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి కేంద్ర ప్రభుత్వం మోయలేని భారాలను మోపిందని సిపిఎం నాయకులు విమర్శించారు. మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ గ్యాస్ ధరపై రూ.50 లు పెంచడం వలన సామాన్య ప్రజలపై అనేక రకాలుగా భారాలు ఉంటాయన్నారు. పెట్రోల్, డీజిల్ సుంకం లీటరుకు రూ.2లు పెంపు వలన వివిధ వస్తువులు పెరుగుతాయని సూరిబాబు తెలియజేశారు.

## 10న డయల్ యువర్ ఆర్టీసి డియం

**చిలకలూరిపేట,ఏప్రిల్8 ,ప్రభాతవార్త:** చిలకలూరిపేట నియోజక వర్గంలోని మూడు మండలాలు, పట్టణానికి చెందిన ప్రజలు ఆర్‌టిసికి సంబందించిన సమస్యలను ఈనెల 10వతేదిన డయల్ యువర్ డియం కార్యక్రమంలో తెలియచేయవచ్చునని స్దానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎస్ రాంబాబు మంగళవారం తెలిపారు. ఆర్‌టిసి బస్‌ల గురించి సూచనలు, సలహాలు ఇవ్వవలసినదిగా ఆయన కోరారు. 10వతేది ఉదయం 11 గంటలనుంచి 12 గంటలమద్య సెల్‌నెంబర్ 9959225427 కు కాల్ చేసి డియంతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలియచేయవచ్చునని ఆయన తెలిపారు.




## నేషనల్ పెట్‌డేకు అమేజాన్ డీల్స్

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** జాతీయ పెట్ దినోత్సవం సందర్భంగా పెంపుడు జంతువులకవసరమైన విస్తృతశ్రేణి ఉత్పత్తులను అందిస్తున్నట్లు అమేజాన్ ప్రతినిధులు తెలిపారు. ఏప్రిల్ 11 నుండి 14 వరకు ప్రత్యేక స్టోర్‌ఫ్రంట్‌తో పోషకవంతమైన ట్రీట్స్ , వినోదపు బొమ్మలు, అగ్రశ్రేణి గ్రూమింగ్ ఉత్పత్తులు, పెడిగ్రీ, డ్రూల్స్, రాయల్ కెనైన్, మూచీ, పర్మీనా, హిమాలయా ఇంకా మరెన్నో అగ్రశ్రేణి ఉత్పత్తులందిస్తామన్నారు.

## ఖజానా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**గుంటూరు విద్య,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నూతన జిల్లా ఖజానా అధికారి ఎం.చంద్రశేఖర్



రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే ఖజానా శాఖలోని ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.మార్చి 2025 కన్వేయన్స్ అలవెన్సును జిల్లాలోని ఖజానా శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింప చేసే లాగా డైరెక్టర్ దృష్టికి తీస్కెళ్ళి పరిష్కరించాలని కోరారు.పెనన్ సెక్షన్‌లో రిటైర్డు అయిన విశ్రాంత ఉద్యోగుల పిపిఓలను ఎప్పటికప్పుడు జిల్లాలోని ఉప ఖజానా కార్యాలయాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.సరెండర్ లీవ్ బిల్లులను త్వరగా వారి ఖాతాల్లో జమచేసే విధంగా డైరెక్టర్ దృష్టికి తీస్కెళ్ళాలని అభ్యర్థించారు.సమస్యలపై జిల్లా ఖజానా అధికారి ఎమ్.చంద్రశేఖర్‌రెడ్డి స్పందిస్తూ తప్పనిసరిగా చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ భాష,జిల్లా కార్యదర్శి శివరెడ్డి ఉపాధ్యక్షులు విజయబాబు, లక్ష్మీనారాయణ,నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య ,కోశాధికారి శ్రీనివాస్,శరత్‌కుమార్,వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి,మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రాదేవి లలితమ్మ,రోజా,పెన్షన్ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి,రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముత్తయ్య,రామారావు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.


# శిశుగృహాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టరు



**బావట్ల,ఏప్రిల్08,ప్రభాతవార్త:** అనాధ శిశువులను తన పిల్లలను చూసుకున్నట్లే చూసుకుంటాను, వారి బాగోగులు స్వయంగా పర్యవేక్షిస్తానని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు.బాపట్ల పట్టణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే శిశు, గృహ, బాలసదన్ లను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.నలుగురు శిశువులే ఉండగా దస్త్రాలలో తొమ్మిది మంది అనాధ శిశువులు ఉండడం ఏమిటని ప్రశ్నించారు.ఏడాది లోపు వయసు ఉన్న నలుగురు శిశువులనే ఇక్కడే ఉంచామని,మిగిలిన చిన్నారులు అంగన్‌వాడి కేంద్రంలో ఉన్నారని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనాధ శిశువులకు అందిస్తున్న పోషణ, వారి సంరక్షణ చర్యలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సంబంధిత దస్త్రాలను ఆయన పరిశీలించారు. శిశు గృహ మేనేజర్, మరొక సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంపై చార్జిమెమో జారీ చేయాలని ఆదేశించారు. ఏడాది బాలిక బలహీనంగా ఉండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. కొద్దిరోజులుగా ఆ బాలిక ఏమి తింటున్నా వాంతులు అవుతున్నాయని, దీంతో బలహీన పడిందని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తక్షణమే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారితో కలెక్టర్ ఫోన్ లోనే మాట్లాడారు. ఆ చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఏరియా వైద్యశాలలోని చిన్నపిల్లల వైద్యులు ప్రతిరోజు శిశు గృహాన్ని తప్పనిసరిగా సందర్శించాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రంలోగా ఒక సమయాన్ని ఎంచుకుని వైద్య పరీక్షలు చేసి వెళ్లాలని ఆదేశించారు. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.అనాధ శిశువులు ఆశ్రయం పొందుతున్న శిశు గృహంలో సిసి కెమెరాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ పనిచేసే సిబ్బందిలో ఒక ఆయా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. అనాధ పిల్లలను ఆమె కొడుతున్నట్లు సమాచారం వచ్చిందని, అలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తక్షణమే సీసీ కెమెరాలు బిగించండి, వాటిని కలెక్టర్, ఎస్పీ, ఐ సి డి ఎస్ పి డి, డిఎం అండ్ హెచ్ ఓ ఫోన్ లకు అనుసంధానించాలన్నారు. వారిని తన పిల్లల్లా చూసుకుంటాను. సీసీ కెమెరాలలో నిరంతరం పర్యవేక్షిస్తానన్నారు. వారి మీద ఈగ వాలినా ఒప్పుకునేది లేదు. వారిని కొట్టినా,తిట్టినా, తన పిల్లలను కొట్టినట్లుగానే భావిస్తాను, తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని మందలించారు. అనాధ పిల్లలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మీకిస్తున్న వేతనాలకు న్యాయబద్ధంగా చిత్తశుద్ధితో పనిచేయాలని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనంతరం బాలసదన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాధ బాలికలు, పాక్షిక అనాధ బాలికల వివరాలపై ఆరా తీశారు. బాలికలంతా సమీపంలోని పాఠశాలకు వెళ్లడంతో వసతులు, సౌకర్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. బంకర్ కాట్స్, బెడ్లు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాల సదన్ లోని గదులన్నిటిని ఆయన పరిశీలించారు. బాలికలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు.ఆయన వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి డి.రాధా మాధవి, డి సి పి ఓ పురుషోత్తం, తదితరులు ఉన్నారు.

## మృతి చెందిన మత్స్యకారుని కుటుంబానికి ఆర్థికసాయం

**మాచర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మాచర్ల మండల పరిధిలోని విజయపురిసౌత్ కు చెందిన మత్స్యకారుడు జనసేన కార్యకర్త సురడా భూలోకం మృతి చెందడంతో జనసేన నాయకులు మంగళవారం ఆర్థికసాయం




అందించారు. జనసేన నాయకులు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, అధికారి ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు, మండల అధ్యక్షులు గుండెబోయిన సాంబశివరావు, రుత్రాల రవి, స్థానిక నాయకులు తాడిమళ్ల రాహుల్, సురడా అశోక్, శ్రీను మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం ఆర్యవైశ్య సంఘం నాయకులు కట్టమూరి సతీష్ రూ.10 వేలు జనసేన నాయకుల చేతుల మీదుగా కుటుంబానికి అందించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## దీర్ఘకాలిక వ్యాధులకు గొప్ప పరిష్కారం ఆయుర్వేద వైద్యం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త:** అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం గొప్ప పరిష్కారమని, అనాది కాలంనుంచి భారతదేశ వారసత్వ సంపదగా, సాంప్రదాయ వైద్యంగా ఆయుర్వేదం కొనసాగుతుందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రాధాకృష్ణ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి దుష్పరిణామాలు ఉండవని, వైద్యులు, దాతలు నిర్వహించే ఆయుర్వేద వైద్యశిబిరాలు వినియోగించుకోవాలని కోరారు. అన్నిరకాల వ్యాధులకు ఆయుర్వేదంలో పరిష్కాం ాలు ఉన్నాయని ప్రజలు నిస్సందేహంగా ఆయుర్వేద చికిత్స ను పొందవచ్చునని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో ఇబ్బంది పడేవారిని పరీక్షించిన మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, డాక్టర్ అర్వపల్లి సురేష్, కె బుచ్చిబాబు,డాక్టర్ మురళీకృష్ణ, విష్ణుప్రియ,డాక్టర్ మురళీచంద్, డాక్టర్ శరవణ్, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, కనమర్లపూడి రమేష్, బేరింగ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బోటు వీరాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేటరూరల్,ఏప్రిల్8,ప్రభాతవార్త:** మండలంలోని మురికిపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బోటు వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు,తిరునాళ్లు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మాజీమంత్రి,స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించి, గ్రామస్తులను అభినందించారు. స్వామివారి అనుగ్రహంతో మురికిపూడి గ్రామానికి మంచి జరగాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, కోడె మణి, కందిమళ్ల హనుమంతరావు, గుర్రం నాగపూర్ణచంద్రరావు, సాగర్, నాగరాజు, చిగురుపాటి రాజాబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, గ్రామపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా కరాటే టోర్నమెంట్స్‌లో ప్రతిభ కనబరిచిన కొల్లూరు పోర్ట్ స్కూల్ విద్యార్థులు

**కొల్లూరు, ఏఫ్రియల్ 8 (ప్రభాతవార్త) :** గుంటూరులో జరిగిన మూడవ సౌత్ ఇండియా 2025 ఫ్రెండ్షిప్ కరాటే టోర్నమెంట్స్ లో కొల్లూరు మంగళవారం ఫోర్ ఫ్రెంట్ స్కూల్ ఆవరణలో మొదట, రెండవ బహుమతులు గెలుపొందిన 9మంది విద్యార్థులను ట్రైనింగ్ ఇచ్చి కరాటే



ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కరాటే టోర్నమెంట్‌లో పాల్గొని టీం కటా విభాగంలో మొదటి బహుమతి, మరో రెండు టీం విద్యార్థులు రెండవ బహుమతులను గెలుపొందారు. ఈ సందర్భంగా మాస్టర్ పులివర్తి సోమయ్యలను స్కూల్ డైరెక్టర్ తెనాలి నవీన్‌పాల్, ప్రిన్సిపాల్ అనితకుమారి, రాజన్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

**మాచర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభించినట్లు నిర్వాహకులు జూలకంటి గౌతమ్‌రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, జూలకంటి చిరంజీవిరెడ్డి, బోయ వెంకటరామిరెడ్డి, దుర్గెంపూడి శశిభూషణ్‌రెడ్డిలు తెలిపారు. పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో పోటీలను ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.50116, రెండో బహుమతి రూ.30,116, మూడో బహుమతి 20,116 నగదు బహుమతులలతోపాటు మ్యాన్ ఆఫ్ దిసిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన వారికి బహుతులు ఉన్నాయన్నారు. వివరాలకు కె.సాయినాథ్ 8121413772, యు.శివనాగరాజు 9640282299 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా॥ జె.లక్ష్మీకుమారి, మాచర్ల పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మాజీ కౌన్సిలర్ మద్దిగపు వెంకటరామిరెడ్డి, బోయ వెంకటరామిరెడ్డి, మున్నా రాంబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వయంఉపాధి కల్పనకోసం రుణాలు మంజూరు చేయండి : మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త: మైల వరపు గుండయ్య కౌన్సిల్‌హాల్‌నందు



బిసి,ఈబిసి,ఒసి లబ్దిదారులకు కార్పోరేషన్ లోన్‌లకు సంబంధించి రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పనకోసం రుణాలు మంజూరుచేయాలని బ్యాంక్ మేనేజర్లను కోరారు. ఈ రుణమేళాకు మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు అధ్యక్షత వహించారు. స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చొరవతో జిల్లాలోనే అత్యధిక లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తున్నామని చైర్మన్ వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బిసి, ఈబిసి, ఒసి వర్గాలకు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు,చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలమేరకు రుణాలు మంజూరుచేయాలని బ్యాంకర్లను కోరారు.

## ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



**మాచర్ల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మాచర్ల మండల పరిధిలోని రాయవరం జంక్షన్ వద్ద జరిగింది. తాళ్లపల్లి గ్రామానికి చెందిన బేవరాల నరసింహారావు ద్విచక్రవాహనంపై దుర్గి నుంచి మాచర్లకు వస్తున్నారు. అదే సమయంలో నామసామి మురళీకృష్ణ మాచర్ల నుంచి వెళ్తున్నారు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ ఎస్సై రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టౌన్‌హాల్‌ను మరింత అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** టౌన్‌హాల్‌ను మరింత అభివృద్ధి చేస్తామని, ఇందుకోసమే నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. టౌన్‌హాల్ సెక్రటరీగా గుత్తా అంకమ్మచౌదరిని నియమించామన్నారు. టౌన్‌హాల్‌కు సంబంధించి నిర్వహణ బాధ్యతలను ఆర్డీవో మధులతతో పాటు నూతన కమిటీ తీసుకుంటుందన్నారు. పల్నాడు జిల్లా కేంద్రంలో సంస్కృతి, సాంప్రదాయాలు,కలలు, నాటక రంగాన్ని కాపాడుకునేందుకు టౌన్‌హాల్ వంటి వేదికలు కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. టౌన్‌హాల్ సెక్రటరీగా నియమితులైన అంకమ్మచౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ఆర్డీవో మధులత, తమపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా సేవలందిస్తామన్నారు. టౌన్‌హాల్‌కు పూర్వ వైభవంగా తీసుకువస్తామన్నారు. పూర్తి స్థాయిలో అన్ని వర్గాల ప్రజలకు టౌన్‌హాల్‌ను అందుబాటులోకి తీసుకొని వచ్చి అభివృద్ధి చేస్తామని అంకమ్మ చౌదరి తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబును ఘనంగా సత్కరించింది.



## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిభా అవార్డుకు ప్రైవేటు ఉపాధ్యాయుడు షేక్ జాఫర్ ఎంపిక



**చిలకలూరిపేటటౌన్,ఏప్రిల్8,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు షేక్ జాఫర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. సదరన్ ప్రైవేట్ ఉపాధ్యాయ, అధ్యాపక సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా అవార్డును ఈనెల 13వ తేదిన గుంటూరు పట్టణంలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఈ అవార్డును జాఫర్‌కు ఆ సంస్థ అందచేయనున్నది. వివిధ రాష్ట్రాలనుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈ అవార్డులను సంస్థ అందచేయనున్నారు. గత 15 సంవత్సరాలనుంచి జాఫర్ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ప్రైవేటు ఊపాధ్యాయులు సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాల చేపట్టారు. విద్య, సామాజిక సేవా రంగాలలో కృషి చేస్తున్నారు. కవితా తరంగణి పుస్తకాన్ని రచించారు. సబ్జెక్ట్ కాలమిస్ట్‌గా రాణించారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ పేరుతో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాల అవకాశాల కోసం ప్రయత్నం చేశారు. ఈ అవార్డుకు జాఫర్ ఎంపిక కావడం పట్ల పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందనలు తెలియచేశారు.

## కార్మికుల కుటుంబాలకు సంక్షేమ బోర్డు ఆర్థిక సాయం చేయాలి

### -ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు

**పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** వివిధ రకాల కారణాల వల్ల ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం పెయింటింగ్ కార్మికుడు డొక్కు మాల రాంబాబు పనిచేసే ప్రదేశంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ప్రభుత్వం ఈ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నుంచి రూ.16,600లను మృతి చెందిన రాంబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో



సంక్షేమ బోర్డుల ద్వారా ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు గుమ్మడి రోశయ్య, కార్యదర్శి హెప్లేజర్‌బాబు, ఉపాధ్యక్షుడు మాకాని పాండురంగారావు, తదితరులున్నారు.

## ఇష్టపడి చదవండి మంచి మార్కులు సాధించండి : ఎంఈవో సాల్మన్‌రాజు



**కొల్లిపర,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు.మంగళవారం మండలంలోని కొల్లిపర,అత్తోట,తూములూరు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వాహకులు ఆజాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించాలన్నారు.పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## మిట్టపాలెం గ్రామంలో ప్రారంభమైన సుజల సురక్షిత తాగునీటి పథకం

చిలకలూరిపేట,ఏప్రిల్8,ప్రభాతవార్త: మండలంలోని మిట్టపాలెం గ్రామంలో ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని మంగళవారం



గ్రామస్తులు ప్రారంభించారు. 2019వ సంవత్సరంలో టిడిపి ప్రభుత్వంలో ఈ పథకంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని మూలన పడేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ఆర్వో వాటర్‌ను గ్రామంలోని వాటర్‌ప్లాంట్‌కు సరఫరా చేస్తున్నారు. ఈ పథకం ద్వారా పంచాయితీ పరిధిలోని గొట్టిపాడు, మిట్టపాలెం, నాగభైరువారిపాలెం, గోరంట్లవారిపాలెం, ఈవూరివారిపాలెం, ఉప్పలపాడు పంచాయితీలోని ఉప్పలపాడు, జరుగులవారిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు సురక్షిత మంచినీటిని వాడుకునే అవకాశం కలిగింది. ఈ సదుపాయాన్ని మాజీమంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రత్తిపాటికి ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో మిట్టపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దండా కోటేశ్వరరావు, చిలుకూరి రామారావు, దండా శ్రీనివాసరావు, చిలుకూరి రాజశేఖర్, కోటపాటి వీరనారాయణ, దండా రవిబాబు, జరుగుల పుల్లారావు, నాగభైరు వెంకటేశ్వర్లు, నాగభైరు వెంకట్రామయ్య, దండా యజ్ఞనారాయణ, మన్నెం సాంబశివరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలి

### -మండల వైద్యాధికారి సుమంత్

**కొల్లిపర,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని అన్నవరం గౌడపాలెంలో వైద్యాధికారులు ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తు లు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాల న్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌సీ జానీబేగం,ఎఎన్ఎం మేరిమ్మ,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఉపాధి కోసమే ఉపాధిహామీ పనులు : ఎపిఓ వెంకయ్య



**కొల్లిపర,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** పేదప్రజలకు ఉపాధి కల్పించటానికే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎపిఓ వెంకయ్య అన్నారు.మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,పీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘీక సంక్షేమశాఖ వసతి గృహాలను పునరుద్ధరించాలి

### -స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ

**గుంటూరు విద్య,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ హాస్టళ్ళలను ప్రభుత్వం పట్టించుకోలేదని,కనీస వసతులు కల్పించడంలో విఫలం అయ్యిందని,ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాలను పునరుద్దరించాని స్వరా ్ణంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ కోరారు.ఎస్సీ కార్పొరేషన్‌కు అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా నిరీ ్వర్యం చేసిందని,అంతేకాకుండా చదువుకునే విద్యార్థుల విషయంలో ప్రతికూలంగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి చదువుకునే ఎస్సీ విద్యార్థులపై భారం పడకుండా ఎస్సీ హాస్టళ్ళను కనీస వసతులతో సిద్ధపరిచే లాగా త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.స్వయం ఉపాధి కల్పనకు సంబంధించి ఎస్సీ అభ్యర్థులు సమరి ్పంచాల్సిన కుల సర్టిఫికేట్ విషయంలో పలు సచివాలయాల ఉద్యోగులు సానుకూలంగా దరఖాస్తు దారులతో వ్యవహరించడం లేదని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.నిరక్షరాస్యులుగా ఉన్న ఎస్సీ అభ్యర్థుల విషయంలో సచివాలయం ఉద్యోగులు అప్పటి వైసీపీ ప్రభుత్వం మాదిరిగా వ్యవహరిస్తున్నారని,ఇది ఎంతమాత్రం తగదని ఈ విషయం ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు.విలేకరుల సమావేశంలో ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ మాదిగ,ఉమ్మడి జిల్లాల గౌరవాధ్యక్షుడు మాచర్ల కెన్నడీ మాదిగ,నగర అధ్యక్షులు సుబ్బయ్య మాదిగ, నగర ఉపాధ్యక్షులు గూడూరు విజయ మాదిగ,బల్లారపు శ్యామ్ మాదిగ,ఆరుమల్ల చెంచు మాదిగ,ఇనుబర్ల రమేష్ మాదిగ,శివమ్మ,ఉపాధ్యక్షులు కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భారీ ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న



**ఎ కొండూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూర నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు అకాల వర్షానికి 250 ఎకరాలు మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఈ మండలంలో 237 ఎకరాల మొక్కజొన్న పంట సాగులో ఉండగా 250 ఎకరాలు పంట నష్టం అవ్వగా, పంటచేలను పరిశీలించి, ప్రాథమిక అంచనాలను తయారుచేసి జిల్లా వ్యవసాయ శాఖాధికారి కార్యాలయానికి పంపనున్నట్లు ఆ నివేదిక రాగానే పంటనష్టం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఏవో ఎస్‌కె టిప్పుసుల్తాన్ తెలిపారు.


## పన్ను చెల్లింపులకు పురమిత్ర యాప్

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** 2025-26 పంవత్సరానికి గాను ఇంటిపన్ను,ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులకు 5 శాతం రాయితీని పురమిత్ర యాప్ ద్వారా కూడ పొందవచ్చని,నగర ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు,ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని మున్సిపల్ కార్పొరేషన్ ఇంఛార్జి కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను వెంటనే అధికారులకు తెలిపేందుకు పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని, ప్రజలు ఈ యాప్‌ని తమ ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి తమకు విజయవాడ నగరపాలక సంబంధిత ఎలాంటి సమస్యనైనా వెంటనే ఫొటో తీసి అప్‌లోడ్ చేసిన వెంటనే దగ్గర లోని సంబంధిత సచివాలయ సిబ్బంది వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. పురమిత్ర యాప్‌లో ప్రజా ఫిర్యాదుల కోసం సేవలకు,చెల్లింపులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఫిర్యాదుల్లో ప్రజలు పారిశుద్ధ్యం,నీటి సరఫరా,పట్టణ ప్రణాళికా సంబంధిత,వీధి దీపాలు,ఇంజనీరింగ్,తదితర అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. సేవల విభాగంలో ప్రజలు ఆన్‌లైన్ సేవలను పొందవచ్చని, ఖాళీ స్థలాలపై పన్ను విధించడం,నీటి ఛార్జీలు,ట్రేడ్ లైసెన్స్,ప్రకటనల పన్ను,డ్రైనేజి కనెక్షన్ తదితర అంశాలున్నాయన్నారు. చెల్లింపుల విభాగంలో ప్రజలు పురమిత్ర యాప్ ద్వారా ఇంటిపన్ను,ఖాళీ స్థలాల పన్ను,నీటి ఛార్జీలు,ప్రకటనల పన్ను,ఆస్థి పన్నులు,పేరు మార్పు,మ్యుటేషన్ ఛార్జెస్,తదితర అంశాలపై ప్రజలకు సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అంతేకాక ఇంటివద్దనే చెత్త సేకరణ,పరిసరాల్లో పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని కూడ తెలియచేసే అవకాశాన్ని ఈ యాప్‌లో కల్పించారని ఆయన పేర్కొన్నారు.

## గాలివాన భీభత్సానికి రెండు నివాస రేకుల షెడ్లు ధ్వంసం

**ఎ కొండూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** గాలివాన భీభత్సానికి సోమవారం ఎ కొండూరు మంలం చీమలపాడు గ్రామంలో యాదవ బజార్‌లో ఉమ్మడి కాసులు, ఉమ్మడి శ్రీనివాసరావు అనే వ్యవసాయ కూలీలకు చెందిన నివాసముండే రెండు సిమెంట్ రేకుల షెడ్డులు గాలి భీభత్సానికి కుప్పకూలిపోయాయి. ఈ రెండు రేకుల షెడ్ పై కప్పులు ఎగిరి పక్కనే పంటచేలలో పడ్డాయి. దెబ్బతిన్న ఈ ఇద్దరి వ్యవసాయ కూలీల నివాసం ఉండే రేకుల షెడ్‌లను కోలా నాగమణి డాక్టర్ నరసింహా రావు, సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు సందర్శించారు. మంగళవారం ఉదయం విఆర్వో లక్ష్మయ్యతో పాటు వెళ్లి పరిశీలించారు. మండల తహశీల్దార్ ఆఫీసులో రిపోర్టు అందచేస్తానని విఆర్వో లక్ష్మయ్య తెలిపారు.

## రాష్ట్రంలో యథ విధిగా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు : డాక్టర్ ప్రకాష్



నరసరావుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : రాష్ట్రంలో యధావిధిగా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు అన్నీ సూపర్‌స్పెషాలటీ హాస్పిటల్స్, నెట్‌వర్క్ ఆసుపత్రులలో కొనసాగుతున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాష్ మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3500కోట్ల బకాయిలు ఉండటంతో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించేపరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో ఈ నెల 7వ తేది నుండి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపి వేసేందుకు నిర్ణయం జరిగిందన్నారు. అయితేరాష్ట్ర నాయకులతో నేరుగా ముఖ్యమ ంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా భేటి అయ్యారని, తక్షణమే రూ.500 కోట్లు బకాయి చెల్లించేందుకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి కోరారని తెలిపారు. త్వరలో ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్ ్లంచేందుకు ముఖ్యమంత్రి స్వయంగా అంగీకారం తెలపటం జరిగిందన్నారు. దీంతో పాటు నెట్‌వర్క్ ఆసుపత్రులకుఆరోగ్యశ్రీ కి సంబంధించి ప్యాకేజీలు, సవరణకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలిపిందన్నారు. ఈ మేరకు కేవలం ఒక్క రోజు మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కావటం జరిగిందన్నారు. అన్నీ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య సేవలు కొన సాగుతున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాష్ వివరించారు.

9-4Pg5.qxd:9-4Pg5.qxd 01/01/01 7:15 AM Page 1



# వేగంగా వాహనం నడిపినా వీసా రద్దు..

## అమెరికాలో విద్యార్థులకు కొత్త ఆందోళన?




**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో అర్థంకాని పరిస్థితుల్లో అమెరికాలోని విదేశీ విద్యార్థులు వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ కథనం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడి నోటీసులు అందుకున్నా సరే వీసా రద్దు వంటి కఠిన శిక్ష ఎదురవుతున్నట్లు ఈ కథనం పేర్కొంది. భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పలు అమెరికా కళాశాలలు పేర్కొన్నారు. వారిలో చాలామందికి క్యాంపస్‌లలో జరుగుతోన్న అనుకూల ఆందోళనలతో ఎలాంటి సంబంధం లేదు. అయినప్పటికీ గతంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారనే కారణం చూపించి వీసాలను రద్దు చేసినట్లు ఆ మీడియా కథనం వెల్లడించింది. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ సహా పలు ప్రముఖ విశ్వవిద్యాలయ అధికారులు ఈ ఆకస్మిక వీసా రద్దుపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్‌ను చూసిన తర్వాత ఆ విషయం తమకు తెలిసిందన్నారు. వీసా రద్దుకు సంబంధించిన కారణాలు కూడా ప్రభుత్వం పేర్కొనడం లేదని చెప్పారు. ప్రభావిత విద్యార్థుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో గాజా సంబంధిత అంశాలపై మద్దతు తెలిపినందుకు మరికొందరికి స్టూడెంట్ వీసాలు రద్దయ్యాయి. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై అమెరికా నిఘా పెట్టినట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన నాటి నుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు పోస్టులు చేశారు. ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి ఎఐతో స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్‌లు ఉంటాయని ఆ నివేదిక పేర్కొంది. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఈ మెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే యాక్సియోస్ నివేదిక, తాజా కథనం వెలువడటం చర్చనీయాంశంగా మారింది.



## బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా.. అందుకే దేవుడు బతికించాడు

### మాజీ ప్రధాని షేక్ హసీనా

**ఢాకా, ఏప్రిల్ 8:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా మళ్లీ దేశానికి తిరిగి రానున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలతో జరిగిన సంభాషణ సందర్భంగా హసీనా హామీ ఇచ్చారు. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఏదో ఒకకారణం వల్లే ఆ దేవుడు నన్ను ఇంకాబతికించాడు. అవామీ లీగ్ పార్టీ సభ్యులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న వారికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుంది. తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉంచండి. నేను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తాను' అని షేక్ హసీనా భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూనస్‌పై మండి పడ్డారు. 'యూనస్‌కు ప్రజలంటే ప్రేమ లేదు. అధిక వడ్డీకి రుణాలుఇచ్చి ఆయన విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడిపి వచ్చారు. ఆ సమయంలో ఆయన తీరును అర్థం చేసుకోలేక పోయాం. అతడికి దేశం ఎంతో సహాయం చేసింది' అని అన్నారు.

**బంగ్లాలో ఎన్నో నేరాలు:** 'యూనస్ వల్ల దేశ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అతడికి అధికారంపై వ్యామోహం మాత్రమే ఉంది. వారి సారథ్యంలో బంగ్లా ప్రస్తుతం ఉగ్రవాద దేశంగా మారింది. మన నాయకులు, కార్యకర్తలను దారుణంగా హత్య చేశారు. పోలీసులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కళాకారులు ఇలా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్నో అత్యాచారాలు, హత్యలు, దొంగతనాలు జరుగుతున్నాయి. కానీ, మీడియాకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటారనే భయంతో ఈ నేరాలు బయటకు రావడం లేదు' అని తాత్కాలిక ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.

**వారికి శిక్ష తప్పదు:** తన తండ్రి బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబర్ రెహమాన్ సహా తన కుటుంబం మొత్తం హత్యలకు గురైన సంఘటనలను షేక్ హసీనా గుర్తు చేసుకున్నారు. 'ఒక్క రోజులోనే నా తండ్రి, తల్లి, సోదరుడిని కోల్పోయాను. నాడు వారు మమ్మల్ని దేశంలోకి రానివ్వలేదు. మీ సొంత వారిని కోల్పోయి ఇప్పుడు మీరంతా అనుభవిస్తున్న బాధను నేను అర్థం చేసుకోగలను. నా ద్వారా మీ అందరికీ మంచి చేయాలని ఆ భగవంతుడు కోరుకుం టున్నాడేమో. అందుకే నన్ను ఇంకా రక్షిస్తున్నాడు. నేను తిరిగి వచ్చాక అన్యాయం చేసిన వారందరికీ కఠిన శిక్ష అమలు చేస్తా' అని హసీనా ప్రతిన బూనారు.

# అమెరికాతో వాణిజ్య యుద్ధానికి చైనా మార్కెట్లు రెడీ?



**బీజింగ్, ఏప్రిల్ 8:** నానాటికీ వాణిజ్య యుద్ధం ముదురుతుండడంతో అమెరికాతో అమీతుమీ తేల్చుకొనేందుకు చైనా మార్కెట్లు, నియంత్రణ సంస్థలు సన్నాహాలు మొదలుపెట్టాయి. తాజాగా ఆ దేశానికి చెందిన ఎన్ఎఫ్ఆర్ఎ (నేషనల్ ఫైనాన్షియల్ రెగ్యులేటరీ అడ్మినిస్ట్రేషన్), పీపుల్ బ్యాంక్ ఆఫ్ చైనా (పిబిసి), ప్రభుత్వ రంగంలోని ప్రధాన పెట్టుబడి సంస్థలు మంగళవారం ఉదయం కీలక నిర్ణయం తీసుకొన్నట్లు గ్లోబల్ టైమ్స్ పత్రిక పేర్కొంది. దేశంలోని క్యాపిటల్ మార్కెట్‌కు బలమైన మద్దతు ఇవ్వనున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎన్ఎఫ్ఆర్ఎ బీమా ఫండ్స్ ఈక్విటీ పెట్టుబడులపై ఓ నోటీసు జారీ చేసింది. దీని ప్రకారం ఆ ఫండ్స్ మరింత మొత్తాలను స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లభించింది. దీంతో వాస్తవిక ఆర్థిక వ్యవస్థకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయి. దేశంలోకి ఇటీవల అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక సంస్థల్లో పెట్టుబడులను ఇవి ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు.

మరోవైపు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా కూడా స్టాక్ మార్కెట్ స్థిరీకరణ నిధి ఏర్పాటుకు అవసరమైన సొమ్మును ది సెంట్రల్ హుయ్‌జిన్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్‌కు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ చైనా ప్రధాన భూభాగంలోని కంపెనీల షేర్లను కొనుగోలు చేయనుంది. ఈ విషయాన్ని మంగళవారం పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా ప్రకటించింది.

**ట్రంప్..తప్పు మీద తప్పు చేస్తున్నావ్ : బీజింగ్ హెచ్చరిక:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పు మీద తప్పు చేస్తున్నారని చైనా విమర్శించింది. ఆయన ప్రపంచ వాణిజ్య యుద్ధంలో అవకాశాలు వెతుక్కొంటున్నారని అభిప్రాయపడింది. చైనా ప్రభుత్వం అమెరికా వస్తువులపై విధించిన సుంకాల ఉపసంహరణకు ట్రంప్ 48 గంటల డెడ్‌లైన్ విధించిన నేపథ్యం లో చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 'మాపై టారిఫ్‌లు పెంచుతామని అమెరికా బెదరించడం తప్పు మీద తప్పు. ఇది అమెరికా బ్లాక్‌మెయిల్ విధానాలను మరోసారి బహిర్గతం చేసింది. చైనా వీటిని ఏమాత్రం పట్టించుకోదు. తన దారికి రావాలని అమెరికా పట్టుబడితే చివరి వరకు పోరాడుతుంది. అమెరికా ఏకపక్షంగా విధించిన అన్ని పన్నులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. చైనా సార్వభౌమత్వం, అభివృద్ధి ప్రయోజనాలు, భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతిఘటన చర్యలు తీసుకుంటాం. ఇందుకు మాకు పూర్తి హక్కుంది' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని చైనా ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భగ్గుమన్నారు. ఏప్రిల్ 9 నుంచే 50 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఆ దేశంతో చర్చలు కూడా నిలిపివేస్తామని తేల్చి చెప్పారు.



## మా భూభాగంలోకి కిమ్‌జోంగ్ సైన్యం చొరబాటు: దక్షిణ కొరియా ఆరోపణ


**సియోల్, ఏప్రిల్ 8:** ఉత్తర కొరియా సైన్యంపై హెచ్చరికల కాల్పులు జరిపినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. సరిహద్దులోని తూర్పు భూభాగంలో కిమ్ సైన్యం ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించింది. ఈ క్రమంలో హెచ్చరికలు చేయడంతో పాటు వార్నింగ్ షాట్‌లు ఇచ్చామని దాంతో 10 మంది కిమ్ సైనికులు తిరిగి వారి భూభాగంలోకి వెళ్లిపోయారని తెలిపింది. ఉత్తరకొరియా కార్యకలాపాలను నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించింది. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉన్న సైనికరహిత ప్రాంతంలో ఉల్లంఘనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. గతజూన్‌లోనూ కిమ్ సైన్యం సరిహద్దుఉల్లంఘనకు పాల్పడింది. అయితే, శత్రుసైన్యం ఉద్దేశపూర్వకంగా చొరబడలేదని దక్షిణ కొరియా అధికారులు ధ్రువీకరించడంతో ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తలేదు. ఇక తాజా చొరబాటు వెనుక ఉద్దేశంపై మాత్రం స్పష్టత రాలేదు.

ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు సాయం చేస్తున్న ఉత్తర కొరియా అటు అణ్వాయుధ ప్రయోగాలను ముమ్మరంగా కొనసాగిస్తూనే ఉంది. అణు నిరాయుధీకరణ చర్చలను పునఃప్రారంభించాలని అమెరికా, దక్షిణ కొరియాలు పిలుపునిస్తున్నప్పటికీ కిమ్ మాత్రం వాటిని పెడచెవిన పెడుతున్నట్లు కనిపిస్తోంది. కిమ్ తనకు మిత్రుడని, దౌత్య సంబంధాలు మెరుగుపరిచేందుకు ఆయనతో భేటీ కావడానికి సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నప్పటికీ ఉత్తర కొరియా నుంచి ఎటువంటి స్పందన లేదు.

# టిఎంసిలో రచ్చకెక్కిన విభేదాలు: మమతకు తలపోటు తెస్తున్న నేతలు!



**కోల్‌కతా, ఏప్రిల్ 8:** తృణమూల్ కాంగ్రెస్‌లోని అంతర్గతపోరు రచ్చకెక్కింది. లీకైన విడియోలు వాట్సాప్‌చాట్‌లను బిజెపి షేర్‌చేయడంతో నేతలమధ్య ఘర్షణ బయటకు వచ్చింది. కమలం పార్టీ ఐటి సెల్ ఇన్‌ఛార్జి అమిత్‌మాలవీయ వాటిని షేర్‌చేసారు. ఎన్నికలసంఘం కేంద్ర కార్యాలయం వద్ద సీనియర్ ఎంపి కల్యాణ్ బెనర్జీ, మరో ఎంపిమధ్య ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. మాలవీయ పేర్కొన్న దాని ప్రకారం ఒక ప్రజంటేషన్‌ను ఇవ్వడానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిదుల బృందం ఈసీ కార్యాలయానికి వెళ్లింది. ఈసీ ఆఫస్‌కు వెళ్లడానికిముందు వినతిపత్రంపై సంతకాలు చేసేందుకు ఒకసారి సమావేశం కావాలని పార్టీ ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆ ఎంపి సమావేశానికి రాకుండానేరుగా ఈసీ వద్దకువెళ్లారు. ఇది ఇద్దరు ఎంపిలమధ్య గొడవకు దారితీసింది. ఆ ఘర్షణను ఆపేందుకు పోలీసులు జోక్యంచేసుకోవాలని పిలిచేవరకూ వెళ్లింది. బిజెపి షేర్ చేసిన విడియోలో కల్యాణ్‌బెనర్జీ మరో ఎంపిపై ఆగ్రహంతో ఊగిపోతున్నట్లుగా ఉంది. ఇదంతా పబ్లిక్‌ప్లేస్ కాసనత సంయమనం పాటించండి అని అక్కడున్న టిఎంసి నేత డెరెక్ ఓబ్రెయిన్ సర్దిచెప్పే ప్రయత్నంచేసినా ఫలితం లేకపోయింది. ఆతర్వాత ఎంపిలు బెనర్జీ, కీర్తి ఆజాద్ చాటింగ్ చేసారు. ఇక మాలవీయ షేర్‌చేసిన చాట్ ప్రకారం ఎఐటిసి ఎంపి 2024 పేరిట ఉన్న వాట్సప్‌గ్రూప్‌లో కల్యాణ్ బెనర్జీ కీర్తి ఆజాద్ మధ్య వాగ్వాదం నడిచింది. వారి చాటింగ్‌లో ఒక మహిల ప్రస్తావన కూడా వచ్చింది. సీనియర్ ఎంపి ప్రవర్తన కారణంగా పార్లమెంటు మహిళా సభ్యురాలు ఆగ్రూప్‌నుంచి ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై టిఎంసినేత సౌగతారాయ్ స్పందించారు. ఇలాంటివి జరిగి ఉండాల్సింది కాదు.ప్రతిపార్టీ అంతర్గత గోప్యతను కాపాడుకోవాలి. ఈ గొడవ జరిగినపుడు నేను అక్కడ లేను. కానీ మహువా కన్నీళ్లుపెట్టుకోవడంచూసాను. కల్యాణ్ ప్రవర్తనపై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అని రాయ్ తెలిపారు. కల్యాణ్‌తో జరిగిన వాగ్వాదంలో ఉన్న మరో ఎంపి మహువా మెయిత్రా అని తేలింది. ఈ మొత్తం ఎపిసోడ్ ఈ లీక్స్‌పై టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా కలతచెందారని వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి మీడియాలో ఎలాంటి ప్రకటనలు చేయద్దని నేతలకు ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే వాట్స్‌చాట్‌లలోపేర్కొన్న మహిళ ఎవరో తెలియాల్సి ఉందని మాలవీయ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే వక్ఫ్‌బిల్లుపై గతంలో జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా కల్యాణ్ నిగ్రహాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే.ఆయనకు బిజెపి ఎంపి అభిజిత్ గంగోపాధ్యాయకు మధ్య వాగ్వాదం జరగ్గా తీవ్రఆగ్రహానికి గురైన టిఎంసిఎంపి పక్కనే ఉన్న గాజు వాటర్ బాటిల్‌ను పగలగొట్టారు. దీనితో ఆయన చేతికి గాయం కూడా అయింది.



## హింగోలి జిల్లాలో 13వేల మందికి పైగా కేన్సర్

**ముంబయి, ఏప్రిల్ 8:** కేన్సర్ కేసులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు మహారాష్ట్రలో నిర్వహించిన సర్వేలో ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. సంజీవని అభియాన్ పేరిట హింగోలి జిల్లాలో స్థానిక యంత్రాంగం నిర్వహించిన డ్రైవ్‌లో 13,500 మంది మహిళల్లో కేన్సర్ అనుమానిత లక్షణాలు కనిపించాయి. 7000 మందిలో సర్వైకల్ కేన్సర్, 3500 మందికి రొమ్ముకేన్సర్, 2000 మందిలో నోటికేన్సర్ అనుమానిత లక్షణాలను గుర్తించినట్లు కలెక్టర్ అభినవ్‌గోయల్‌మీడియాతో వెల్లడించారు. మరికొందరిలో ఇతర కేన్సర్ లక్షణాలు కనిపించాయన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని 3.5 లక్షలమంది మహిళలపై సర్వేజరిగింది.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని ప్రారంభించామన్నారు. ప్రస్తుతంస్క్రీనింగ్ ముగిసిందని తర్వాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. నిపుణులు శిక్షణ పొందిన వైద్యబృందం పర్యవేక్షణలో ఈప్రక్రియను చేపట్టామని కలెక్టర్ తెలిపారు.

## నేటి నుంచి సీమాంధ్ర మీదుగా హుబ్లీ-కతిహార్ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ సీమాంధ్ర మీదుగా హుబ్లీ-కతిహార్-హుబ్లీ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. హుబ్లీ నుంచి కతిహార్ వెళ్లే నెంబర్ 07325ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9(నేటి) నుంచి 30వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 3.15గంటలకు హుబ్లీ నుంచి బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు కతిహార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కతిహార్ నుంచి హుబ్లీ వెళ్లే నెంబర్ 07326ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12నుంచి మే 3వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు కతిహార్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10.50గంటలకు హుబ్లీ చేరుకుంటుంది.

# టీచర్ నియామకాల్లో సిబిఐ దర్యాప్తు అవసరంలేదు..

## మమతకు ఊరటనిచ్చిన సుప్రీం ఉత్తర్వులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపివేసిన ఉపాధ్యాయనియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సక్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో సిబిఐ దర్యాప్తునిమిత్తం హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీంకోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్రకేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సిబిఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టంచేసింది. నిపుణులతోచర్చలుజరిపిన తర్వాతే బెంగాల్ విద్యాశాఖ ఈ అదనపు పోస్టులను సృష్టించింది. దీనికి గవర్నర్‌నుంచి ఆమోదం లభించింది. అలాంటప్పుడు ఇందులో న్యాయపరమైన జోక్యం అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది.అయితే టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు వెల్లడించింది. ప్రభుత్వ ప్రయోజిత ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులలుకు ఉపాధ్యాయులతోపాటు గ్రూప్‌సి, గ్రూప్‌డి స్టాఫ్ సిబ్బంది నియామకాలకోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహిం చింది. 24,650ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికిపైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపికప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందచేసారు. అయితే ఖాళీలు ఉన్న సంఖ్యకంటే ఎక్కువమందిని ఎంపికచేయడంపై వివాదం రాజుకుంది. ఉద్దేశ్యపూర్వకంగానే అదనపు పోస్టులను సృష్టించి అక్రమ నియామకాలు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణజరిపిన కోల్‌కత్తా హైకోర్టు 2016 నాటికి ఆ నియామక ప్రక్రియ చెల్లదని తీర్పు వెలువరించింది. అంతేకాక ఈ కేసులో రాష్ట్రప్రభుత్వ అధికారుల పాత్రతోపాటు అవకతవకలపై దర్యాప్తుజరపాలని సిబిఐ ఆదేశించింది. దీన్ని సవాల్‌చేస్తూ బెంగాల్‌ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణజరిపిన సర్వోన్నత న్యాయస్థానం సిబిఐ దర్యాప్తుపై స్టే విధించింది. తాజాగా అదనపు ఉద్యోగాల సృష్టిపై దర్యాప్తు అవసరం లేదంటూ తీర్పు వెలువరించింది. ఇప్పటికే 25,753 మంది టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు గత వారం తీర్పు వెలువరించింది.

## మీరట్ హత్యకేసులో నిందితురాలు గర్భవతి

### నిర్ధారించిన మీరట్ ఆసుపత్రి వైద్యులు



**మీరట్, ఏప్రిల్ 8:** మర్చంట్‌నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్యకేసులో నిందితురాలు ఆతడి భార్య ముస్కాన్ రస్తోగి గర్భం దాల్చినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీనిపై బాధిత కుటుంబం స్పందించింది. ఒకవేళ ఆ బిడ్డ సౌరభ్‌కు చెం దినది అయితే దత్తత తీసుకుంటామని వెల్ల డించారు. ఆమె గర్భం దాల్చిన సంగతి మాకు తెలిసింది. ఒక వేళ బయోలాజికల్‌గా కడుపులోని బిడ్డ మా సోదరుడికి చెందిందే అయితే పుట్టినతర్వాత దత్తత తీసుకునేందుకు మా కుటుంబం సిద్ధంగా ఉందని అన్నారు. ఆ బిడ్డను పెంచుకునేందుకు మా అందరికీ ఇష్టమే అని సౌరభ్ సోదరుడు మీడియాకు తెలిపాడు. కాగా ప్రేమించి పెళ్లాడిన భర్తను ప్రియుడి సాయంతో కట్టుకున్న భార్యే దారుణంగా హత్యచేసి ముక్కలు చేసిన ఘటన సంచలనం కలిగించింది. ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్న నిందితురాలు ముస్కాన్‌కు ఇటీవల వైద్యపరీక్షలు నిర్వహిస్తే ఆమె గర్భం దాల్చినట్లు తేలింది. సిఎంఓ డాక్టర్ అశోక్ కటారియా స్వయంగా వెల్లడించారు. గర్భం దాల్చిన సంగతి నిందితురాలికి తెలిపారా అన్న ప్రశ్నపై ఫలితాలు వచ్చిన సమయంలో ఈ విషయాన్ని ఆమెకు తెలియజేసారని అనుకుంటున్నా. కానీ అల్ట్రాసౌండ్ రిపోర్టు వచ్చిన తర్వాతనే ఈ విషయాన్ని జైలు అధికారులు నిందితురాలికి అధికారికంగా తెలియజేస్తారని తెలిపారు. సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో నిందితులయిన ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాలు జైలులో ఉన్నారు. నిందితుడిని కలిసేందుకు ఆతడి బామ్మ వస్తున్నారని కానీ ముస్కాన్‌ను కలిసేందుకు ఎవరూ రావడంలేదని జైలు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె గర్భం దాల్చిన విషయం వెలుగులోకి వచ్చింది.

# తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం సీరియస్

## వీటో అధికారం గవర్నర్‌కు లేదు.. సుప్రీంబెంచ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. రాష్ట్ర అసెంబ్లీ పంపించిన బిల్లులను తన వద్దనే పెట్టుకుని వీటో అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. జస్టిస్ జెబి పార్డీవాలా, ఆర్ మహాదవేన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చర్యలు అక్రమం అని పేర్కొన్న కోర్టు ఆయన వద్ద బిల్లులకు గవర్నర్ తప్పనిసరి అనుమతి ఇవ్వాలని,అయితే బిల్లుల్లో వైరుధ్యం ఉంటే దాన్ని తిరస్కరించాలని కోర్టు పేర్కొంది. తమిళనాడు శాసనసభ పంపించిన పది బిల్లులను గవర్నర్ రిజర్వులో పెట్టుకోవడం అక్రమం అని న్యాయవ్యతిరేకమైనదని అందుకే ఆచర్యలను పక్కన పెడుతున్నామని ఆ బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన నాటినుంచి వాటికి క్లియరెన్స్ దక్కినట్లు కోర్టుప్రకటించింది. తమ బిల్లులకు గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తమిళనాడు ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై కోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గవర్నర్లు చాలా చురుకుగా పనిచేయాలని కోర్టు పేర్కొంది. ఓ స్నేహితుడిగా మార్గదర్శిగా, తత్వవేత్తగా గవర్నర్ పనిచేయాలని కోర్టు సూచించింది.రాజకీయ ప్రేరణతో ఆయన పని చేయకూడదని ధర్మాసనం హితవు పలికింది. సమస్యలు పరిష్కరించడంలో గవర్నర్ ఒక దూతలా ఉండాలని ఉత్ప్రేరకంగా పనిచేయాలని కోర్టుచెప్పింది. రాజ్యాంగ విలువల్ని గవర్నర్లు రక్షించాలని కోర్టుతెలిపింది. 2020నుంచి 2023వరకూ సుమారు 12 బిల్లులను తమిళనాడు అసెంబ్లీ గవర్నర్ అనుమతికోసం పంపించింది. కానీ గవర్నర్ ఆ బిల్లులను నిరవధికంగా వాయిదావేసారు. దీనితో ఆ బిల్లుల అనుమతి కోరుతూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే 2023 నవంబరులో రెండుబిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించగా మరో 10బిల్లులు గవర్నర్‌వద్దనే ఉండిపోయాయి. అయితే కొన్నిరోజుల వ్యవధిలో మళ్లీ ఆ పదిబిల్లులను రాష్ట్రశాసనసభలో పాస్‌చేయించారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అనుమతి కోరుతున్నట్లు తమిళనాడు సర్కారుతన పిటిషన్‌లో సుప్రీంకు వివరించింది.

## న్యూఢిల్లీ డిఆర్ఎం కార్యాలయంపై సిబిఐ పంజా

### సీనియర్ డిఇఇ సహా మరో ఇద్దరు ఎస్ఎస్ఇలు అరెస్టు

### సోదాల్లో రూ.63.85లక్షల నగదు, రూ.3.46కోట్ల బంగారం,కీలకపత్రాలు స్వాధీనం



సిబిఐ దాడుల్లో బయటపడిన నగదు, బంగారు ఆభరణాలు



**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** నార్థన్ రైల్వే న్యూఢిల్లీ డిఆర్ఎం కార్యాలయంపై సిబిఐ పంజా విసిరింది. ఈ దాడుల్లో రైల్వేకి చెందిన ఒక సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్,మరో ఇద్దరు సీనియర్ సెక్షన్ ఇంజనియర్లు సిబిఐ వలలో చిక్కడంతో డిఆర్ఎం కార్యాలయంలో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే. నార్థన్ రైల్వే న్యూఢిల్లీ డివిజన్‌లో విద్యుత్ విభాగానికి చెందిన పనులను అప్పగించేందుకు గుత్తేదారును సంబంధిత విభాగం అధికార యంత్రాంగం రూ.7లక్షల లంచాన్ని డిమాండ్ చేశారని బాధిత గుత్తేదారుడు సిబిఐని ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి సదరు గుత్తేదారుడు ఇచ్చిన ముందస్తు పక్కా సమాచారంతో బాధిత కాంట్రాక్టర్ రూ.7 లక్షల లంచాన్ని ఇస్తుండగా సిబిఐ చాకచక్యంగా వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా సీనియర్ డిఇఇ సహా మరో ఇద్దరు ఎస్ఎస్ఇలను అరెస్టు చేసింది. ఇదే సమయంలో తొమ్మిది వేర్వేరు ప్రాంతాల్లో వీరికి చెందిన నివాసాలలో ఏకకాలంలో దాడులు చేసి సోదాలు నిర్వహించగా రూ.63.85లక్షల నగదు, సుమారు రూ.3.46కోట్ల విలువైన బంగారం(రూ.96.26లక్షల బంగారు ఆభరణాలు), ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు, మొబైల్ ఫోన్లు,ల్యాప్‌టాపులు,ఈకేసుకు సంబంధించిన కీలక పత్రాలు,హార్డ్ డిస్కులు సీనియర్ డిఇఇ భార్య నిర్వహించే(చెందిన) లాకర్‌లో రూ.2.5కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు సోదాల్లో స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి.

ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోందని వారు పేర్కొన్నారు.

9 - 4pg6exHMNWJQE.qxd:9 - 4pg6exHMNWJQE.qxd 01/01/01 9:39 AM Page 1



## వెట్టిచాకిరి ఘటనపై ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం నివేదిక కోరిన చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు



ప్రసంగిస్తున్న కేసన శంకరరావు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ సామాజిక వర్గ దంపతుల వెట్టి చాకిరీ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర నివేదిక పంపాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆదేశించారు.తమను వెట్టిచాకిరి చేయిస్తున్నారంటూ నంబూరు పద్మ, అగ్ని దంపతులు ఇచ్చిన ఫిర్యాదు పై స్పందించిన బాపట్ల కలెక్టర్ ను చైర్మన్ అభినందించారు.వెట్టిచాకిరి చేయించడంతో పాటు, దంపతులను అమ్మకానికి పెట్టడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కాలంలో కూడా వెట్టిచాకిరి చేయించేందుకు యత్నించడం దారుణమన్నారు.ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను బాపట్ల జిల్లా అధికారులు వెంటనే కమిషన్ కు సమర్పించాలని ఆదేశించారు.

## జనగణనలో కులగణన చేపట్టాలి: కేసన శంకరరావు

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** జనాభా దామాషాలో ఆయావర్గాలందరికి రిజర్వేషన్లు, సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లల్లో అందించి, సామాజిక న్యాయం అందాలంటే తప్పనిసరిగా ఈ సారి జరిపే జనగణనతో పాటే సమగ్ర కులగణన చేయాల్సిందేనంటూ ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు కేసన శంకరరావు పునరుద్ఘాటించారు. విజయవాడలో ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ఎస్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వేంకటేశ్వరరావు అధ్యక్షతన 45 బిసికుల సంఘ నాయకులతో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ దేశాభివృద్ధికి, సంపద పంపిణీకి, పేదరిక నిర్మూలనకు కులగణన చేయాల్సిందేనని, ఈ విషయంలో బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఓబిసిలు సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 27న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడి నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి మహాత్మా జోతిబా పూలే, డా బిఆర్ అంబేద్కర్ల విగ్రహాలకు జనగణనలో సమగ్ర కులగణనకు విజ్ఞాపన పత్రాలందిస్తామన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలికవరప కనకారావు, బి శ్రీనివాస్, అందే జగదీష్, మేకా వెంకటేశ్వరరావు, కుక్కల వీర వెంకట సత్యనారాయణ, గుంటుపల్లి ఉమా మహేశ్వరరావు, సిహెచ్ పుల్లారావు, కందిమళ్ల శేషగిరిరావు, దాసరి కేశవరావు తదితర బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### ఎపి ఎస్పీఎఫ్ ఎపి సెక్రటేరియట్ యూనిట్ నందు రక్త పరీక్షలు

**సచివాలయం,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** ఏపిఎస్పీఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ ఐజి బి.వి.రామిరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందిక అందరికీ రక్త పరీక్ష నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ సచివాలయం నందు కమాండెంట్ ఎం.శంకరరావు ఆధ్వర్యంలో ఏపిఎస్పీఎఫ్ అధికారులకు సిబ్బంది యొక్క ఆరోగ్య దృష్ట్యా ఏపిఎస్పీఎఫ్ హెడ్ క్వార్టర్ ్స రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారని చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్ ఏపి సెక్రటేరియట్ వి.వి.ఎన్.ఎస్.మల్లికార్జునరావు తెలిపారు.సిబ్బందిని ఉద్దేశించి మాటా్లడుతూ ఈ రక్త పరీక్షలు నిర్వహించడం వలన సిబ్బంది యొక్క ఆరోగ్యసమస్యలను ముందుగానే తెలుసుకొని తగిన వైద్యం చేయించుకోవడానికి వీలుగా ఉంటుందని మరియు పాటించాల్సిన ఆహార నియామాలను గురించి వివరించారు.కార్యక్రమంలో సుమారుగా 217మంది సిబ్బందితోపాటు ఇన్‌స్పెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు,ఎస్.రమణ,ఎస్సైలు,ఎఎస్సైల ు పాల్గొన్నారు.

### రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుండాలి -తిరుమలలో టిడిపి ఏపి అధ్యక్షుడు శ్రీనివాస్

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రప్రజలు బాగుండాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. మంగళవారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 11 న ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం



వటపత్రసాయిగా రాముడు

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజున జగదభి రాముడు వటపత్ర సాయిగా ఉదయం భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి నవనీత నవనీత కృష్ణ అలంకారంలో సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిచ్చారు. ఒంటిమిట్ట పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. ఊరేగింపు కేరళ వాయిద్యాలు, మహిళల కోలాటాలు, చెక్కభజనతో గ్రామోత్సవం కన్నుల పండుగగా ఆధ్యాత్మిక పండుగ వాతావరణంలో సాగింది. ఇదిలా ఉండగా ఈనెల 11 లో జరిగే ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి సతి సమేతంగా కోదండరామస్వామికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు, కడప కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఒంటిమిట్ట టిటిడి కళ్యాణ మండపం పరిపాలన భవన సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్ రావు, తితిదే ఈఓ జె. శ్యామల రావు, తితిదే జెఈఓ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు సమీక్షించారు. శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందన్నారు. అశేష భక్తజన సందోహం మధ్య కన్నుల పండుగగా జరిగే ఈ మహోత్సవానికి.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా హాజరు కానున్నారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

## పుంగనూరులో ఆర్పీ చేతివాటం - రూ.32 లక్షలు స్వాహా



**పుంగనూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త** పట్టణంలో పొదుపు సంఘాల బాధ్యతలు వహిస్తున్న ఆర్పీలు లక్షలాది రూపాయలు డబ్బులు స్వాహా చేస్తున్నప్పటికీ వీరిపై దర్యాప్తు చేయకపోవడంతో వీరి ఆటలకు హద్దు లేకుండాపోతోంది. ఇప్పటికే పట్టణంలోని అన్ని డ్వాక్రా సంఘాల ఆర్పీలో వ్యవహారాలపై బుట్టెడు ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఇంతవరకు ఎవరిపై కూడా చర్య తీసుకున్న సంఘటనలు లేవు. అయితే తాజాగా పట్టణంలోని 28 గ్రూపులకు చెందిన 280 మంది డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.32 లక్షల రూపాయలు స్వాహా చేసిన ఆర్పి పరారైన ఉదంతం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వైభవలక్ష్మి సంఘానికి చెందిన గ్రూప్ సభ్యుల పొదుపు లావాదేవీలకు సంబంధించి ఆర్పి రెడ్డి రాణీ బాధ్యత వహిస్తున్నారు. అయితే ఆమె కొన్ని నెలలుగా తన పరిధిలోని గ్రూపు సభ్యుల వద్ద నుంచి రుణాల కోసం పొదుపు డబ్బుల కోసం దరఖాస్తులు చేయించి చాలా రోజులైనప్పటికీ ఎటువంటి డబ్బులు మంజూరు అయినట్లు తెలుపకపోవడంతో గ్రూప్ సభ్యులు ఆమెను నిలదీశారు. దీంతోపాటు ఆమెకు ఇప్పటివరకు చెల్లించిన పొదుపు డబ్బులు డ్వాక్రా డబ్బులు గురించి ఇంతవరకు ఎవరికీ రసీదులు కూడా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన సభ్యులు ఆమెను నిలదీయగా ఆమె స్పందించక పోవడంతో సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం పట్టణానికి వచ్చిన డిఎస్పి ప్రభాకర్కు సంఘాలకు చెందిన మహిళలురాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు 32 లక్షల రూపాయల వరకు ఆమె నిధులు కాజేసినట్లు వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ సంఘాల మహిళలకు చెందిన డబ్బులు దుర్వినియోగం చేసిన రెడ్డి రాణి గురించి దర్యాప్తు నిర్వహిస్తామని దీనిపై పుంగునూరు పురపాలక సంఘ అధికారులతో పాటు దర్యాప్తు చేస్తామని బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించారు.

## బాలికను గర్భవతి చేసిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు

**చౌడేపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** పెళ్ళి చేసుకొంటానని మాయమాటలు చెప్పి మైనర్ బాలికను గర్భవతి చేసిన వ్యక్తిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని ఆమినిగుంట పంచాయతీకి చెందిన ఓ మైనర్ బాలిక(15)ను అదే గ్రామానికి చెందిన నాగేంద్ర ప్రేమించానని, పెళ్ళి చేసుకొంటానని నమ్మించి మాయమాటలు చెప్పి 6నెలల గర్భవతిని చేసాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా న్యాయం చేయమని నాగేంద్ర తల్లిదండులు లక్ష్మన్న, విజయలక్ష్మిలను అడిగితే కులం పేరుతో దూషించి, గ్రామం వదిలి వెళ్ళిపోవాలని బెదిరించిన ఇరువురిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

## దేవుని ఆశీస్సులతో మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలి - జనసేన నేతలు ప్రత్యేక పూజలు



**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్‌బాబు సింగపూర్‌లో స్కూల్‌లో అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని, బాలుడు త్వరగా కోలుకోవాలని కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని జనసేనపార్టీ తిరుపతి జిల్లా నేతలు వేడుకున్నారు. మంగళవారం సాయంత్రం అలిపిరి పాదాలమండపం వద్ద జనసేననేతలు నియోజకవర్గ నాయకుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ప్రజలకోసం పరితపించే పవన్‌కల్యాణ్ కుమారుడికి ఇలా జరిగినా ఆయన ముందుగా ప్రజలకిచ్చిన మాటతో కార్యక్రమంలో పాల్గొని అనంతరం సింగపూర్ వెళ్ళడం ఆయన ప్రజలకోసమేనని తెలుస్తుందన్నారు. గోవిందా...శంకర్‌బాబు త్వరగా కోలుకోవాలని పూజలు చేశారు.

## పోలవరం ప్రాజెక్టు అథారిటీ భేటీ.. కీలక అంశాలపై చర్చ..

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో హైదరబాద్‌లో భేటీ అయింది. తెలంగాణ ఈఎన్సీ అనిల్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు భేటీలో పాల్గొన్నారు. పోలవరం పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు, ఇతర అంశాలపై వారు చర్చిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తించే అంశం, పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను తెలంగాణ అధికారులు మరోమారు ఈ భేటీలో లేవనెత్తారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి సమావేశంలో తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి ప్రస్తావించారు. ఖమ్మం పట్టణం, భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం మణుగూరు భారజాల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. గత ఏడాది వరదల ప్రభావంతో ముంపునకు గురైన నేపథ్యంలో అధ్యయనం సమగ్రంగా జరగాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై స్పష్టత రావాలని అథారిటీని తెలంగాణ అధికారులు కోరారు.

## గంజాయి మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి నార్కోటిక్ పోలీస్‌స్టేషన్

**విజయవాడ ఏప్రిల్ 08 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి , మాదకద్రవ్యాల కట్టడి కోసం అమరావతి కేంద్రంగా నార్కోటిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి రాష్ట్రమంతటా పరిధి కల్పించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎక్కడైనా గంజాయి మాదకద్రవ్యాలు పట్టుబడితే ఆయా ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్‌ల్లో కేసులు నమోదు చేస్తున్నారు. ఇకపై అంతర్రాష్ట్ర ముఠాలు, ఇతర వ్యవహారాలకు సంబంధించిన కేసులుంటే నార్కోటిక్ పోలీసుస్టేషన్‌లోనే నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి మాదకద్రవ్యాలకు సంబంధించి కేసుల నమోదు, దర్యాప్తు అధికారిన్ని దాఖలు పరిచింది. డీఎస్పీ స్థాయి అధికారి ఈ పోలీసుస్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా వ్యవహరించనున్నారు. ఈగల్ లో అంతర్భాగంగా ఈ పోలీసుస్టేషన్ పనిచేయనుంది. ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ నేతృత్వం, పర్యవేక్షణలో ఈ పీఎస్ కార్యకలాపాలు కొనసాగుతాయి.

# వైయస్ జగన్ పర్యటనలో భద్రతా లోపం

### హెలిప్యాడ్‌లోకి దూసుకొచ్చిన అభిమానులు - హెలికాప్టర్ నుంచి దిగేందుకే ఇబ్బంది పడ్డ జగన్ - హెలికాప్టర్ సమస్యతో రోడ్డు మార్గాన తిరుగు ప్రయాణం



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఉన్న హెలికాప్టర్ వద్దకు దూసుకు వచ్చిన అభిమానుల దృశ్యాలు

**అనంతపురం, ఏప్రిల్ 8, (ప్రభాతవార్త బ్యూరో)** ఉమ్మడి అనంతపురం జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డి పల్లె లో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైసీపీ అధినేత ,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలో భద్రత లోపం బయటపడింది. ఐదేళ్లపాటు సీఎంగా పని చేసి ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ జెడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న జగన్ మోహన్ రెడ్డికి తగిన మొదట కల్పించకుండా పోలీసులు చేతులెత్తేస్తున్నారు అని అభిప్రాయ వ్యక్తమోతోంది.. ఇందుకు రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం కుంటిమద్ది,పాపిరెడ్డి పల్లి లలో జరిగిన సంఘటనలో అదే కనిపించింది. అత్యంత భద్రత ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి హెలికాప్టర్లో రామగిరి మండలం కుంటిమద్ది ప్రాంతానికి వస్తే... అక్కడ జనాన్ని నియంత్రించకుండా పోలీసులు చేతులెత్తేసారు. దీంతో ఒక్కసారిగా వైసిపి కార్యకర్తలు, జనం హెలికాప్టర్ వద్దకు వచ్చారు. ఈ సమయంలో హెలికాప్టర్ నుంచి కుంటి మధ్యలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ లో దిగేందుకే వైయస్ జగన్ ఇబ్బంది పడాల్సి వచ్చింది. వైసీపీ కార్యకర్తలు,అభిమానులు దూసుకు రావడంతో హెలిపాడ్ లో వేచి ఉన్న వైసిపి నాయకులు కూడా తమ నేత వైయస్ జగన్ ను సరిగా కలుసుకోలేకపోయారు.హెలిపాడ్ లో ఒకానొక సమయంలో హెలికాప్టర్ వైపు దూసుకెల్లడంతో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతినింది అని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. మరోవైపు అక్కడికి వచ్చిన జనం పై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ముందుగా చెరగట్టినప్పటికీ వైఎస్ జగన్ అక్కడికి వచ్చే సమయంలో పట్టించుకోలేదని అభిప్రాయం ఉంది. చివరి నిమిషంలో పోలీసులు చేతులు తీయడం వల్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు భద్రత పరంగా ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. ముందే పరిస్థితిని చక్కదిద్దకుండా జగన్ భద్రతకు ప్రమాదం వాటిల్లేలా చేశారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కుంటిమద్ది నుంచి పాపిరెడ్డిపల్లి వరకు జగన్ ముందుకు వెళ్లడానికి వీలు లేకుండా భారీగా జన సందోహం వచ్చింది. పాపిరెడ్డి పల్లెలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించే సమయంలో పాపిరెడ్డి పల్లెలో జనాన్ని అదుగు చేసే విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. వైఎస్ జగన్ జిల్లా పర్యటనలో జనాన్ని కంట్రోల్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్న.

## ఈతలో బంగారు పతకాల రాణి, వైద్య వృత్తిలో సేవామార్గదర్శిని

### స్విమ్మింగ్‌లో రాణిస్తున్న చెందిన యువవైద్యురాలు సాయి శ్రీ



**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు చెందిన ఓ యువ వైద్యురాలు ఈత పోటీల్లో అదర గొట్టెస్తోంది.బంగారు పతకాలతో సహా పలు క్రెడిట్స్‌ను ఆమె ప్రతిభతో సొంతం చేసుకుంది. విజయవాడకు చెందిన మధుసూధన్‌రావు, ధనలక్ష్మీ దంపతుల ద్వితీయ కుమార్తె సాయి శ్రీ. వృత్తి రీత్యా అల్లూరి జిల్లా పాడేరు మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణిగా పని చేస్తోంది. చిన్నతనం నుంచి తల్లిదండ్రులు క్రీడల వైపు ప్రోత్సహించడంతో బరిలోకి దిగితే పతకం సాధించాల్సిందే అన్నట్లుగా రాటు తేలింది. రాష్ట్ర, జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 100 పతకాలు సాధిస్తే అందులో 50 స్వర్ణాలే ఉండటం ఆమె క్రెడిట్స్‌ను నిదర్శనం. క్రీడల్లో రాణిస్తూ చదువును ఏ మాత్రం అలసత్వం చేయలేదు. కష్టపడి చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఔరా అనిపించింది. అఖిల భారత ఉద్యోగుల క్రీడాపోటీల్లో అద్భుత ప్రతిభను చూపి ఫ్రీ స్టైల్‌ల్లో 50, 100 మీటర్ల విభాగంలో విజయం సాధించడంతో పాటు దిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటిందీ యంగ్ డాక్టర్ క్రీడలు, చదువులో రాణించాలంటే శ్రమ, పట్టుదల, కృషి, కార్యచరణ ఉండాలి. ఎవరైనా సరే రెండింట్లో ఒక్కదానిపైనే దృష్టి పెడతారు. ఆ యువతి మాత్రం అటు క్రీడలు, ఇటు చదువులో రాణిస్తూ వందల పతకాలు, అవార్డులు, ప్రశంసా పత్రాలు సొంతం చేసుకుంది. అలాగే గిరిజన ప్రాంతాల్లోని నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలను అందుకుంటుంది. బెజవాడకు అంటేనే అదరని,బెదరని యువతీ.యువకుల వేదిక ఆ నగరానికి చెందినచెందిన సాయిశ్రీ. చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువతో స్విమ్మింగ్‌లో కఠోర సాధన చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో 100 పతకాలు, అవార్డులు సాధించింది. అంతేకాదు గిరిజన ప్రాంతాల్లో నిరుపేదలకు నిరంతరం వైద్య సేవలందిస్తూ ఒలిపిక్స్ పోటీలకు సన్నద్ధమవుతోంది.ఆరేళ్ల వయసులో కృష్ణా నదిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి అవార్డుతో పాటు ప్రముఖుల నుంచి అభినందనలు అందుకుంది. చిన్నతనం నుంచి ఒకవైపు క్రీడలు, మరోవైపు చదువులో రాణిస్తూనే ఎన్ సీసీ క్యాడెట్‌గా సైతం మంచి గుర్తింపు తెచ్చుకుంది. సీ సర్టిఫికేట్ సాధించి రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగిన ఎన్నో కార్యక్రమాల్లో అద్భుత ప్రదర్శనతో అందరి చేత శభాష్ అనిపించుకుంది. క్రీడలు, చదువును బ్యాలెన్స్ చేసుకుని ముందుకు వెళ్తే కచ్చితంగా విజయం సొంతమవుతుందని చెబుతున్నారు జిల్లా వైద్యాధికారి జమల్ బాషా. స్విమ్మింగ్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సాయి శ్రీ పతకాలు సాధించడం పట్ల తోటి వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఆమెను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తే దేశానికి మంచి పేరుతో పాటు పతకాలు సాధిస్తారు. తనకు ఆర్థికంగా తోడ్పాటునిస్తే ఒలిపింక్స్‌లో స్వర్ణం తీసుకొస్తానని సాయి శ్రీ చెబుతుంది.

## ఆడపిల్లల జోలికి వచ్చారో,ఇక జైలుకే..! మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తి బృందాలు

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో క్రైమ్ ఎగినెస్ట్ విమెన్ నియంత్రించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం శక్తి బృందాలనుఅదుపులోకి తీసుకుని వచ్చింది.జయవాడ విశాఖపట్నం నగర కమిషనరేట్‌ల పరిధిలో నాలుగేసి, ప్రతి జిల్లా కేంద్రంలో రెండేసి ప్రతి పోలీసు సబ్ డివిజన్‌లో ఒక్కోటి చొప్పున మొత్తం 164 శక్తి బృందాల్ని సిద్ధం చేసింది. మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వీటిని ఏర్పాటు చేశారు. ఆయా నగర కమిషనరేట్‌ల కమిషనర్ల జిల్లాల ఎస్పీలు, సబ్ డివిజన్‌ల డీఎస్పీల పర్యవేక్షణలో ఇవి పనిచేస్తున్నాయి. ప్రతి శక్తి బృందంలో ఒక ఎస్సై స్థాయి అధికార నేతృత్వంలో ఆరుగురు సిబ్బంది ఉన్నారు. శక్తి బృందాన్ని మహిళలు, అమ్మాయిలు నేరుగా సంప్రదించొచ్చు. శక్తియాప్ ద్వారా కూడా వారిని చేరుకోవొచ్చు. బాధితురాలి వివరాల్ని గోప్యంగా ఉంచి వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తారు. ఆత్మరక్షణ విధానాలపై శిక్షణ చట్టపరమైన హక్కులపై చైతన్యం సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండటంపై అవగాహన కల్పిస్తారు. మహిళలు, అమ్మాయిలపై ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా వేధింపులు చోటుచేసుకుంటున్నాయో ఆ హాట్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ నిరంతరం ఈ బృందాలు గమనిస్తుంటాయి. శక్తి బృందాల్లోని సభ్యులు సివిల్ డ్రెస్‌లో తిరుగుతూ మహిళలపై వేధింపులకు సంభందించి నిఘా పెడతారు.బహిరంగ ప్రదేశాల్లో మహిళల్ని అమ్మాయిల్ని వేధిస్తున్నా., ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారా, బాలికలు,యువతులను వెంటపడుతూ ఇబ్బంది పెడుతున్నా ఫోన్ మెసేజ్, మెయిల్ సామాజిక మాధ్యమాల వంటి వాటి ద్వారా అభ్యంతకరమైన సందేశాలు పంపిస్తూ వారిని హింసిస్తున్నా ఇక ప్రభుత్వం వదిలిపెట్టదు.అటువంటి వారిపై చర్యలు తీసుకుంటుంది.

## ఆగమోక్తంగా ప్రారంభమైన దుర్గమ్మ చైత్రమాస బ్రహ్మోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలు సోమవారం ఆగమోక్తంగా ప్రారంభమయ్యియి. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లకు మంగళస్నానాలు గావించి, నూతన వధూవరులుగా ముస్తాబు చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ, అఖండ దీపస్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం నిర్వహించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ మల్లేశ్వర స్వామివార్ల మండపం నుండి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకీలో వేంచేపు చేసి పల్లకీ సేవలను ప్రారంభించారు. అక్కడినుండి శ్రీ స్వామి అమ్మవార్లు నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీ స్వామి అమ్మవార్ల పల్లకీ సేవకు ముందుగా పలు రకాల తప్పెట్లు, కోలాటాలు, భజనలు, వివిధ రకాల వేషధారణలు సాగుతుండగా, మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్ర ఘోషలతో శ్రీ స్వామి అమ్మవార్ల విహారం కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట మెయిన్‌బజార్ ప్రాంతాల్లో కొనసాగింది. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లను తిరిగి శ్రీ మల్లేశ్వర మండపానికి తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపారు.

### ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ రైలుకు తప్పిన ప్రమాదం

**పలాసమ్రందస (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 8 ప్రభాతవార్త** శ్రీకాకుళం జిల్లా మందస రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైంది. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు మందస రైల్వేస్టేషన్ దగ్గర ఏ1 భోగికు ఉన్న లింకు తెగిపోవడంతో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ట్రైను రెండు భాగాలుగా విడిపోయింది. మందస రైల్వేస్టేషన్‌లో ఇంజన్‌తో సహా 15 బోగీలు నిలిచిపోగా కొర్రాయి గేటు-మకరజోల స్టేషన్ మధ్య 8 బోగీలతో వెనక్కి వెళ్లి ఆగింది. ఈ హఠాత్పరిణామానికి భయపడిన ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. ప్రయాణీకులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తెగిన బోగికి మరమ్మతులు చేసి వేరొక ఇంజన్‌తో సంటింగ్ చేసి మందస రైల్వేస్టేషన్‌కు తీసుకు వచ్చారు. సుమారు రెండున్నర గంటల పాటు మందస రైల్వేస్టేషన్ దగ్గర రైలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. రైల్వే ఇంజనీరింగ్ అధికారులు పునరుద్దరణ చర్యలు చేపట్టి తెగిపోయిన ఏ1 బోగీని మందసలో విడిచిపెట్టిన అధికారులు మిగతా బోగీలకు సంటింగ్ చేసి రైలును హౌరా వైపు తరలించారు.

## పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్... కుమారుడి ఆరోగ్యంపై ఆరా...

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఆరోగ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. పవన్‌కు ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సింగపూర్‌లోని ఓ స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలిసిందే. కాళ్లు, చేతులకు కాలిన గాయాలు కావడంతో ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. అయితే విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు సమాచారం. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని పవన్‌కు ధైర్యం చెప్పినట్లు తెలిసింది. మరోవైపు విశాఖ పర్యటన ముగించుకున్న పవన్ కల్యాణ్ సింగపూర్ బయల్దేరి వెళ్సారు.. చిరంజీవి దంపతులు సైతం సింగపూర్ బయల్దేరి వెళ్ళారు.. మార్క్ శంకర్‌కు గాయాలైన విషయం తెలియడంతో తెలుగు రాష్ట్రాల సీఎం చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు స్పందించారు. పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

## అత్యధిక సభ్యత్వాలు చేయించిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు హసీం బేగ్‌కు సన్మానం

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్త** నియోజకవర్గంలో అత్యధికంగా 3400 సభ్యత్వాలు చేయించిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీం బేగ్‌ని కృష్ణాజిల్లా ఇంఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్,మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ హసీం బేగ్ పార్టీ కేటాయించిన ప్రతి కార్యక్రమాన్ని డోర్ టు డోర్ సర్వే,ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి,బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ,ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు క్రమశిక్షణతో నూటికి నూరు శాతం చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

9-4P◻g7exHMNWJQE.qxd:9-4P◻g7exHMNWJQE.qxd 01/01/01 9:41 AM Page 1



# రాజ్యాంగ రక్షణ ప్రాధాన్యత అంశంగా సిడబ్ల్యుసి

## తెలంగాణ కుల గణన, బిసి 42 రిజర్వేషన్‌పైనా చర్చ

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ ప్రాధాన్యత అంశం అహ్మదాబాద్‌లో సిడబ్ల్యుసి సమావేశాలు నిర్వహింస్తున్నామని ఇది దేశంలోని పౌర హక్కులు, లౌకికత్వం సమాఖ్య స్ఫూర్తి భంగం కలుగకుండా అన ుసరించాల్సిన రాజకీయ విధానం నిర్ణయిస్తుందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సమావేశానికి వెళ్లే ముందు విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన కులగణన, శాసనసభలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేయడం వంటి అంశాలను మిగితా రాష్ట్రాలలో అధికారం వచ్చిన వెంటనే చేసేందుకు అనుగుణంగా ఒక రాజకీయ విధానం తీసుకొనేందుకు వీలుగా చర్చ జపేందుకు ఎఐసిసి సమయం కూడా కేటాయిం చిందని తెలిపారు.

సామాజిక న్యాయం, దేశంలో ప్రజల మధ్య ఐక్యత పునాదిగా అభివృద్ధి దిశగా నడవడానికి అనువైన కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. దేశ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా చర్చజరుగుతుందని వివరించారు. ఎఐసిసి మీటింగ్‌లో దేశంలోని పార్టీ పెద్దలు పార్టీ అను సరించాల్సిన మారుతున్న దేశ, ప్రపంచ రాజకీయాలకు అనుగుణంగా విదివిధానాలు సందేశం రూపంలో ఇస్తారని ఇది ఒక విధంగా ప్రజలకు ఇచ్చే సందేశమేని ఆయన అన్నారు. మతోన్మాదులు దేశం విచ్ఛిన్నం కోసం చూస్తున్న తరుణంలో జరుగుతున్న ఈ సమావేశం ఒక ముఖ్య మైన భరోసా దేశంలోని బలహీనవర్గాలక అందిస్తుందని అన్నారు.

అహ్మదాబాద్‌లో పరిస్థితులు మారయి ఇప్పుడు కాంగ్రెస్ గాలి వీస్తున్నదని మహేష్ ఆశాభావం వ్యక్తంచేవారు. 11ఏళ్ళుమోడి ప్రధానమంత్రిగా ఉండి అట్టడుగు వర్గాలకు ఏమీచేయేదని అందరికి సమాన అవకాశాలు కల్పించే పార్టీ అని ఆయన తెలిపారు. సర్ధార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లో మంగళ,బుధవారం సమావేశాలకు ఏఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారని సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక కాంగ్రెస్ ముఖ్య మంత్రులు, మంత్రి మండలి సభ్యులు ఇతర ప్రముఖులు ఎంపిలు, పిసిసి అధ్యక్షులు హాజరవుతారని ఆయన చెప్పారు. 64 ఏళ్ళ సుదీర్ఘ విరామం తరువాత మోడీ సొంతగడ్డపై కీలక సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ నుంచి 40 మందినేతలు పాల్గొంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వంశీచంద్‌రెడ్డి ఎపి చీఫ్ షర్మిల పాల్గొంటున్నారని ఆయన తెలిపారు.

ఈ యేడాది చివరలో జరగబోయే బిహార్, 2026లో జరగబోయే తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసోం, కేరళ అసెంబ్లీ ఎన్నికలలో అనుసరించే వ్యూహాలు చర్చిస్తాం. లోక్‌సభ ఎన్నికలలో ఇండియాకూటమి అనుసరించిన విధానాలు ఛత్తీస్‌గఢ్, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సమీక్షలు ఉంటాయని అన్నారు.



దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్సీ కవిత

### తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో విగ్రహ సాధన దీక్ష

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఫూలే విగ్రహసాధన దీక్షకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ దీక్షనుద్దేశించి కవిత మాట్లాడుతూ ఈ నెల 11న జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఆరోజు ఫూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వంటి మహనీయులు సైతం గురువుగా చెప్పుకునే జ్యోతిబాఫూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటుచేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. 1848లోనే మహిళల కోసం పాఠశాల ఏర్పాటుచేసిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిబాఫూలే అని, ఆయన కృషితోనే నేడు అనేక మంది మహిళలు ఉన్నతవిద్యను అభ్యసించి, అనేక రంగాలలో రాణిస్తు న్నారని గుర్తు చేశారు. కుల వివక్ష కోసం పోరాడి, బడుగుబలహీన వర్గాలను జాగృతంచేసి, వారి అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుని విగ్రహం చూస్తేనే మనకు ఒక ధైర్యం ఇస్తుందని అన్నారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఎలా ఉందో అదేవిధంగా అంబేద్కర్ విగ్రహం పక్కన జ్యోతిబా ఫూలే విగ్రహం కూడా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న ఫూలే జన్మదినం రోజు విగ్రహంపై ప్రకటన ఇచ్చి, బీసీలకు స్ఫూర్తినివ్వాలని డిమాండ్ చేశారు. బిల్లు పాస్ కాగానే అఖిల పక్షాన్ని తీసుకుని ఢిల్లీకి పోతామన్న కంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బీజేపీతో ఎటువంటి లాలూచీ లేకపోతే బీసీ బిల్లుపై కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# భూభారతి చట్టం.. రెవెన్యూకు కొత్త ఊపిరి

### రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభలో ఉద్యోగ జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నూతనంగా అమలులోకి వస్తున్న భూ భారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోసిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగడంతో పాటు రెవెన్యూ సేవలు, పౌర సేవలు చేరువ అవుతాయన్నారు.గ్రామీణ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడం వలన రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని దీమా వ్యక్తం చేశారు. మంగళవారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవో కె.రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్ లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)లుగా వస్తున్న పూర్వపు వీఆర్వోలు, వీఆర్ఏలు సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జీపీవో పోస్ట్ కొత్తగా క్రియేట్ చెసిందని, అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే జీపీవోలకు కూడా పదోన్నతులు వస్తాయన్నారు. ఆప్షన్ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కూడా ఇతర ప్రభుత్వ ఉద్యుగులందరికీ వచ్చిట్లుగానే కామన్ సర్వీస్ తో పాటు పదోన్నతులు వస్తాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలో నియామకం చేస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులో భరోస లభిస్తుందన్నారు.

ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామని, అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు.భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని చైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు.ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఇటీవల జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు చెప్పారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలను చేపట్టేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# లిక్కర్ మరకల చెరిపివేతకు ఎమ్మెల్సీ కవిత పాట్లు

### అధికారం పోగానే ధర్నాలు

### విప్ ఆది శ్రీనివాస్




**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** లిక్కర్ మరకలను తుడిచి వేసుకోవడానికి కల్వకుంట్ల కవిత నానా పాట్లు పడుతున్నారని విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జైలు నుంచి బయటకు వచ్చాక బిఆర్ఎస్‌లో తన స్థానం కోసం కల్వకుంట్ల కవిత అనేక విన్యాసాలు చేస్తున్నారని అన్నారు.రిజర్వేషన్లు, జ్యోతిరావుఫూలే విగ్రహం పేరిట కవిత డ్రామా చేస్తోందని విమర్శించారు. జ్యోతిరావు పూలే పేరు ఎత్తే అర్హత అసలు కవితకు ఉందా?! అని నిలదీశారు. బాలికల కోసం దేశంలో మొదటి పాఠశాల ఏర్పాటు చేసిన మహనీయుడు ఫూలే అని కొనియాడారు. మహిళా విద్యకు మార్గదర్శకుడు స్వయంగా తన భార్య సావిత్రి బాయి కి రాయడం, చదవడం నేర్పి మార్గదర్శిగా నిలిచారని అన్నారు. జ్యోతిరావు ఫూలే సావిత్రి బాయి దంపతులు ఆదర్శప్రాయులు ఇలాంటి వారి గురించి కవిత మాట్లాడటం అంటే అంతకు మించిన దౌర్భాగ్యం ఇంకోటి లేదు. కేసీఆర్ ఆయన బిడ్డ కవితకు ఏం నేర్పాడో అందరికీ తెలుసు దేశంలో లిక్కర్ స్కాం అరెస్ట్ అయిన మొదటి మహిళా నాయకురాలు కవిత అని విమర్శించారు. దాదాపు ఆరు నెలలు లిక్కర్ కేసులో తీహార్ జైలు ఉండి వచ్చిన నాయకురాలు సావిత్రి బాయి పులే గురించి మాట్లాడితే తెలంగాణ ప్రజలు వినాలా అని ఆయన ప్రశ్నించారు. పులే విగ్రహం పెట్టాలని కవిత చెపితే ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ తెలుసు కోవాలా పదేళ్ళ అధికారంలో ఉన్నప్పుడు జ్యోతి రావు పూలే ఎందుకు కవితకు గుర్తుకు రాలేదు పులే విగ్రహం పెట్టాలని ఆయన వాళ్లకు అయ్యకు ఎందుకు చెప్పలేదు అని ఆయన కవితను ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రెండు గంటల్లోనే ప్రగతి భవన్ కంచెలను బద్దలు కొట్టించారు ప్రగతి భవన్ కు మహాత్మ జ్యోతిరావు పులే పేరు పెట్టింది మా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రజా ప్రభుత్వం అని అన్నారు. నీకు బిసిల పైన అంత ప్రేమ ఉంటే తెలంగాణ జాగృతి అధ్యక్ష పదవి నుంచి తప్పుకుని బిసి నేతకు ఇవ్వు అని సూచించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కోసం కులగణన చేసిన ప్రభుత్వం మాది అని ఆయన తెలిపారు. అసెం బ్లీలో బిల్లు పెట్టి అమోదించిన చరిత్ర మాది.కేంద్రం ఒప్పుకున్నా ఒప్పు కోకపోయినా బిసి లకు రాజకీయం గా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నామని ప్రకటించారు.

# ఎస్ఎస్‌సి మూల్యాంకన కేంద్రం ఆకస్మిక తనిఖీ

### వసతులను పరిశీలించిన పాఠశాల విద్య డైరెక్టర్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 10వ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ఈ నెల 4 వరకు జరిగిన విషయం తెలిసిందే. పరీక్షల అనంతరం నిర్వహించే జవాబుపత్రాల మూల్యాం కనం రాష్ట్రంలో 19 కేంద్రాల్లో కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా సంగా రెడ్డిలో కొనసాగుతున్న మూల్యాంకన కేంద్రాన్ని పాఠశాల విద్య డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి పరీక్షలకి సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 7 నుంచి 15 వరకు 19 కేంద్రాల్లో నిర్వహించబడుతోంది. మంగళవారం ఉదయం పాఠశాల విద్యా సంచాలకులు ఇవి నరసింహ రెడ్డి సంగారెడ్డి జిల్లా నందలి 10వ తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. మూల్యాంకన కేంద్రంనందు ఉపాధ్యాయుల హాజరుతోపాటు వసతుల ఏర్పాట్లు పరిశీలించారని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఏ కృష్ణారావు తెలిపారు. మూల్యాంకన కేంద్రంలోని వసతులపట్ల పాఠశాల విద్య డైరెక్టర్ సంతృప్తి వ్యక్త పరచినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు మూల్యాంకనము చేయు విధానమును పరిశీలించి జిల్లా విద్యాశాఖా ధికారి(డిఈవో) వెంకటేశ్వర్లుతోపాటు అధికారులతో క్యాంపు నిర్వహణను సమీక్షించారు.

# పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

### మండిపడుతున్న సిపిఎం, సిపిఐ

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ధరల పెంపును తగ్గించడం కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేసే వంటగ్యాస్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాపిత నిరసనలకు చేపట్టనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలకు తగ్గించి ఆ ఫలితాలు అందించాల్సిందిపోయి... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్‌పై రు.50లు పెంచడం దారుణమన్నారు. నిత్యా వసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్నిరకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేస్తూ, నేడు, రేపు(ఏప్రిల్ 9, 10 తేదీల్లో) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టా లని నిర్ణయించినట్టు జాన్‌వెస్లీ తెలిపారు.

**పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి: కూనంనేని**

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లపై రూ. 50 అదనంగా పెంచడం వలన మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రాలలో ఖాళీ సిలిండర్లతో నేడు(బుధవారం) నిరసన ధర్నాలు చేపట్టాలని సిపిఐ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్టు తెలిపారు.

# సార్వత్రిక సమ్మెకు సమాయత్తం

### అన్ని ట్రేడ్ యూనియన్లతో రాష్ట్ర సదస్సు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను, ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నందుకు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక, రాష్ట్ర కార్మిక సంఘాల, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల సదస్సు కార్మికవర్గానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర సదస్సుకు ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసి డెంట్ విజయ్‌కుమార్ యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్ తదితర నాయకులు అధ్యక్షత వహించగా సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ రాష్ట్ర సదస్సు ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను పెంచి పోషిస్తుందని ఆయన విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు వచ్చే నెల 20న సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని ఆయన తెలిపారు. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ కార్మికవర్గం మే 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని ఆయన కోరారు.

ఈ తీర్మానంపై కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఐఎన్‌టియుసి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, హెచ్‌ఎంఎస్ నాయకులు అంజద్, సిఐటియు నాయకులు సాయిబాబ, టియుసిఐ నాయకులు కె.సూర్యం, టిఎన్‌టియుసి నాయకులు ఎం.కె.బోస్, బిఆర్‌టియు నాయకులు జి.రాంబాబు యాదవ్, ఎఐయుటియుసి నాయకులు కృష్ణ, తదితరులు మాట్లాడారు. మే 20న దేశవ్యాపిత సమ్మెలో రాష్ట్రంలోని అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# చిత్తశుద్ధితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేయాలి

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పకడ్బందీగా నమోదు చేయాలి

### అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

**గోదావరిఖని, ప్రభాతవార్త:** అధికారులు చిత్తశుద్ధితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మంగళవారం అన్నారు. ఎన్టీపీసీ మిలినీయం హాల్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, తదితరులతో కలిసి జిల్లా అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సమీక్షి ంచారు. గతంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు నిర్వహించిన సమావేశంలో జారీ చేసిన సూచనలు, పనుల పురోగతి వివరాలను, తమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, ఈడి ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, పరిశ్రమల శాఖ, లీడ్ బ్యాంకు మేనేజర్ వివరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాంచందర్ మాట్లా డుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పకడ్బందీగా నమోదు చేయాలని, నిందితులకు చట్టం ప్రకారం శిక్ష పడేందుకు వీలుగా అవసరమైన సాక్ష్యాలను పక్కాగా నమోదు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని, అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్తులను అరెస్టు చేయాల్సి ఉంటుందని అన్నారు. నిమ్న వర్గాల యువత పరిశ్రమల స్థాపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు సబ్సిడీపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. రామగుండం, బెల్లంపల్లిలో ఉన్న ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎస్సి ఔత్సాహిక వేత్తలకు భూ కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఔత్సా హికవేత్తలకు గ్యారెంటీ లేకుండా రుణాలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను బ్యాంకులు తూచా తప్పకుండా పాటించేలా చూడాలని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, కులాంతర వివాహాల సబ్సిడీ సకాలంలో అందేవిధంగా చూడాలని అన్నారు. బ్యాంకుల ద్వారా ఎస్సి లబ్దిదారులకు విద్యా రుణాల మంజూరు ఎలా జరుగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా రుణాల పంపిణీపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. భూ వివాదాల సమయంలో సర్వే నిర్వహించాలని అన్నారు. దళితుల భూమిని ఆక్రమించాలని చూసే వారిపై చట్ట ప్రకారం కేసుల నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో పోలీసులు అరెస్ట్ చేయడం లేదనే మాట బయట బలంగా వినపడుతుందని, తప్పుడు కేసు కాని పక్షంలో తప్పనిసరిగా విచారించి నిందితులను అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని శాఖల వారిగా బ్యాక్ లాగ్ పోస్టులు, కారుణ్య నియామకాలు, పదోన్నతుల పెండిరగ్ వివరాలను అందించాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎన్టీపీసీ, సింగరేణి, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కింద జరిగే భూసేకరణలో దళితులకు కూడా న్యాయమైన పరిహారం తప్పనిసరిగా అందజేయాలని, పరిహారం అందించిన తర్వాత మాత్రమే భూ బదలాయింపులు జరగాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రింద నమోదైన కేసుల్లో బాధితులకు చట్ట ప్రకారం పరి హారం అందించామని అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యో గులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికా రులు బి.గంగయ్య, సురేష్, పెద్దపల్లి, గోదా వరిఖని ఎసిపిలు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో ఘోరం..

### బాలికపై ఇద్దరు యువకుల అత్యాచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో 12 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు ఆమె బంధువు ఒకరి పాత్ర కూడా వుండడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. ఆదిలాబాద్ పట్టణంలోని మావల పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కాల నీకి చెందిన 12 ఏళ్ల బాలికను 35 ఏళ్ల మహిళ పథకం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకు వెళ్లింది. ఆమె వెంట మరో వ్యక్తి కూడా వున్నారు. మహిళకు బంధువులైన ఇద్దరు యువకులు అంతకు ముందే అక్కడ వుండగా వారిద్దరు ఆ బాలికపై అత్యాచారం చేశారు. దీనిని బాలిక పతిఘటించగా సదరు అత్యాచారానికి పాల్పడ్డ యువకుల బంధువైన మహిళతో పాటు మరో వ్యక్తి బాలికను చంపుతానని భయ పెట్టారు. కాగా రాత్రి వేళ ఆ బాలికను సదరు మహిళ ఇంటి వద్ద దించి ఇంట్లో వారికి ఏమీ చెప్పవద్దని హెచ్చరించింది. అయితే ఆలస్యంగా ఇంటికి వచ్చిన బాలికను తల్లి, ఇతర కుటుంబ సభ్యులు నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే రంగంలో దిగిన పోలీసులు బాలికను రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించా అత్యాచారం జరిగినట్లు నిర్ధా రణ అయ్యింది. అనంతరం బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు యువ కులతోపాటు వారికి సహకరించిన మహిళపైనా, ఆమె బంధువుపై నా ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్, అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా

# టెండర్లు పిలవాలి

### వాళ్లకూ రెండేళ్లకోసారి లైసెన్స్‌లు ఇవ్వాలి

### తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** తెలంగాణలోని బార్ అండ్ రెస్టారెంట్స్‌కు కూడా ప్రతి రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలోనే లైసెన్స్ ఇవ్వాలని అప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తుందని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అభిప్రాయపడింది. తాము రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలో లైసెన్స్ తీసుకోవడం వల్ల ప్రభుత్వానికి 87 శాతం ఆదాయం వస్తుంటే...బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా కేవలం 13 నుంచి 15 శాతం ఆదాయం మాత్రమే వస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్యం షాపుల యజమానులపై, పర్మిట్ రూం, సమయం కుదింపుపై బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. జిల్లాల్లో 10 గంటలకు మద్యం షాపులు మూసివేసినట్లే.. నగరాల్లో కూడా 10గంటలకే మద్యం దుకాణాలను మూసివేయాలనడం అవివేకమన్నారు. రాష్ట్రంలో బార్లు అర్ధరాత్రి 12 గంటల వరకు నడుస్తున్నా తామేమి అభ్యంతరం చెప్పడం లేదని ఎందుకు తమ దుకాణాల సమయాన్ని తగ్గించాలని రోడ్డెక్కుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల సమయాన్ని 11 గంటలకు పైగా పెంచడం వల్ల ఆ ప్రభావం తమపై పడుతుందని, దాని వల్ల 20శాతం నష్టాలు చవిచూస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామచంద్రారెడ్డి, ట్రెజరర్ సుభాష్, వైస్ ప్రెసిడెంట్ ప్రభు, ఇతర కార్యవర్గం పాల్గొన్నారు.

# వచ్చే యేడాది నుంచి ఎస్సీ గురుకులాల్లోనకోడింగ్ కోర్సులు

### ఆర్‌పిఎఫ్-యుకె ఫౌండేషన్‌తో ఎంఒయు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సులను ప్రారంభించ నున్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌పిఎఫ్-యుకె ఫౌండే షన్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నట్టు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి ఐదేళ్లపాటు ఎంవోయూ చేసుకొని.. 6వ తరగతి నుండి ఇంటర్ వరకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యం అనేది కీలకంగా మారింది. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు, వీలైనంత త్వరగా జీవితంలో ఒక మంచి హోదా, ఉజ్వల భవిష్యత్తుతో పాటు మంచి వేతనం వున్న ఉద్యోగాలవైపు దృష్టి సారిస్తోంది. విద్యార్థుల అభిరుచులు, వారి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎస్సీ గురుకుల విద్యాసంస్థలో విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్టు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 238 గురుకుల పాఠశాలల్లో ఈ కోడింగ్ కోర్సుకి శిక్షణ ఇవ్వనున్నట్టు కార్యదర్శి వెల్లడించారు. గత ఏడాది కేవలం ఒక్క మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే ఈ కోడింగ్ శిక్షణ ఉండేదని.. దానిని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వున్నా అన్ని పాఠశాలలో విస్తరింపజేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. శిక్షణకు లండన్‌కు చెందిన ఆర్‌పిఎఫ్‌తో ఐదేళ్లకు గాను గురుకుల సంస్థతో ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్టు చెప్పారు. అందులో భాగంగా ఫౌండేషన్ వారు విద్యార్థులకు కావాల్సిన నైపుణ్య శిక్షణ, కరిక్యులమ్(పాఠ్య ప్రణాళిక), అక్షన్ ప్లాన్(కార్యాచరణ ప్రణాళిక), మోనిటరింగ్ (పర్యవేక్షణ), పెడగోజి(బోధన) వంటి అంశాలలో ఫౌండేషన్ వారి సారథ్యంలో ఈ పర్యవేక్షణ కొనసాగనుంది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలో విద్యనభ్యసిస్తున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ వరకు చదివే విద్యార్థులందరికీ సాంకేతికత అంశాల్లో రాటుదేలేలా ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

కృత్రిమ మేధ(ఏఐ), కోడింగ్, మెషీన్ లెర్నింగ్(ఎంఎల్), రోబోటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాల్ని వారికి బోధించేందుకు రంగం సిద్ధం చేసినట్టు అలగు వర్షిణి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రతి పాఠశాలలో ఐదుమంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేసి.. దానిలో ఫలితాలు మెరుగ్గా రావడంతో ఫౌండేషన్ ప్రతినిధులను ఒప్పించడం ద్వారా రానున్న విద్యా సంవత్సరం(2025-26) నుంచి ఈ పాఠ్యాంశాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అన్ని పాఠశాలల్లో కంప్యూటింగ్ పాఠ్యాంశాలను రెగ్యులర్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. విద్యార్థులకు రెండు గంటలపాటు తరగతులు మరో రెండు గంటల ప్రాజెక్ట్ వర్క్‌తో విద్యార్థులకు నేర్పిస్తారు. పాఠశాలలోని దాదాపు 1,52,000 మంది విద్యార్థులందరికీ కంప్యూటింగ్ పాఠ్యాంశాలను ఒక సబ్జెక్టుగా నేర్పడంతో పాటు మూల్యాంకనం చేస్తారని.. కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తారని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు పలు అంకురా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు.

9-4pg10.qxd:9-4pg10.qxd 01/01/01 7:17 AM Page 1



# లక్నో సూపర్ జెయింట్స్ హ్యాట్రిక్ విక్టరీ

## 4 రన్స్ తేడాతో పోరాడి ఓడిన కోల్‌కత్తా నైట్ రైడర్స్



**న్యూఢిల్లీ:న** ఐపిఎల్ 2025లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ 4 పరుగుల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. కోల్‌కతా తన సొంత మైదానంలో వరుసగా రెండో విజయం ఇది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 4 పరుగుల తేడాతో లక్నో గెలుపొందింది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో 239 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 234 పరుగులు మాత్రమే చేయగలిగింది. రింకు సింగ్ 15 బంతుల్లో 38 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ అజింక్య రహానే 61, వెంకటేష్ అయ్యర్ 45 పరుగులు చేశారు. వారిద్దరూ 40 బంతుల్లో 71 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం తెగిపోవడంతో, కోల్‌కతా జట్టు విడిపోయింది. ఆకాశ్ దీప్, శార్దూల్ ఠాకూర్‌లకు చెరో రెండు వికెట్లు దక్కాయి. అంతకు ముందు బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో ప్లేయర్ నికోలస్ పూరన్ (86 నాటౌట్) పట్టపగలే కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. క్రీజులోకి రావడమే ఆలస్యం బౌండరీలతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు అర్ధ శతకంతో గర్జించాడు. ఓపెనర్ షాన్ మార్ష్ (81) సైతం తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. పూరన్ మెరుపులతో ఆఖరి ఐదు ఓవర్లలో 86 పరుగులు రాబట్టింది. వీళ్లిద్దరి విధ్వంసక బ్యాటింగ్ ఫలితంగా కోల్‌కతా కంచుకోటలో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్లు షాన్ మార్ష్ (81 48 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు), ఎడెన్ మర్క్‌రమ్ (47)లు శుభారంభం ఇచ్చారు. కోల్‌కతా బౌలింగ్ దళాన్ని చీల్చిచెండాడిన వీళ్లు పవర్ ప్లేలోనే 59 రన్స్ పిండుకున్నారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడదీసేందుకు అజింక్య రహానే ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోయింది.

అయితే 11వ ఓవర్లో హర్షిత్ రానా సూపర్ డెలివరీతో మర్క్‌రమ్‌ను బోల్డ్‌చేసి కోల్‌కతాకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత సెంచరీ దిశగా దూసుకెళ్తున్న మార్ష్‌ను రస్సెల్ బోల్తాకొట్టించాడు. దాంతో, 170 వద్ద లక్నో రెండో వికెట్ కోల్పోయింది. షాన్ మార్ష్ ఔటయ్యాక నికోలస్ పూరన్ (86: 35 బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు) విధ్వంసం తారాస్థాయికి చేరింది. ఈ పవర్ హిట్టర్ హర్షిత్, రస్సెల్‌కు చుక్కలు చూపించాడు. 21బంతుల్లోనే హాఫ్ సెంచరీబాదిన పూరన్.. ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. రస్సెల్ వేసిన 18వ ఓవర్లో 4, 4, 6, 4,6 బాది 24 పరుగులు పిండుకున్నాడు. దాంతో, లక్నో స్కోర్ 200 దాటింది. వైభవ్ వేసిన 20వ ఓవర్ తొలి బంతినే బౌండరీకి పంపాడు పూరన్. ఆ తర్వాతి ఐదు బంతుల్లో 6 రన్స్ మాత్రమే వచ్చాయి. దాంతో, లక్నో జట్టు నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది.



## శ్రీలంక, దక్షిణాఫ్రికాతో త్రైపాక్షిక వన్డే సిరీస్..
# భారత్ మహిళల జట్టు ఖరారు
### టిజి నుండి అరుంధతి, ఎపి నుండి చరవాణిలకు చోటు

**న్యూఢిల్లీ:** శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో మహిళల త్రైపాక్షిక వన్డే సిరీస్ నిమిత్తం భారత్ జట్టు ఖరారైంది. ఈ మేరకు శ్రీలంకలో పర్యటించనున్న మహిళా క్రికెట్ జట్టుకు భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రకటించింది. ఈ నెల 27 నుండి శ్రీలంక-భారత్-దక్షిణాఫ్రికా మధ్య ట్రై సిరీస్ మొదలు కానుంది. శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో జరగనున్న త్రైపాక్షిక వన్డే సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఉమెన్స్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో రెగ్యులర్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ భారత జట్టును ముందుకు నడిపించనుండగా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొనసాగనుంది. ఇక ఈ జట్టులో హైదరాబాదీ అమ్మాయి అరుంధతి, ఆంధ్ర క్రికెటర్, అన్ క్యాప్ట్ ప్లేయర్ నల్లపురెడ్డి శ్రీచరణి కూడా చోటు దక్కించుకున్నారు.

అంతేకాకుండా శ్రీచరణితో పాటు, మరో ఇద్దరు అన్ క్యాప్ట్ ప్లేయర్లు కశ్వీ గౌతమ్, శుచి ఉపాధ్యాయ్‌కు కూడా సెలక్టర్లు చోటివ్వడం విశేషం. మరోవైపు గాయాల కారణంగా రేణుకా సింగ్ ఠాకూర్, టైటస్ సాధు ఈ వన్డే సిరీస్‌కు దూరమైనట్లు బిసిసిఐ వెల్లడించింది. కాగా జనవరిలో ఐర్లాండ్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌కు హర్మన్ ప్రీత్ కౌర్ దూరంగా ఉంది. హర్మన్ ప్రీత్‌కు విశ్రాంతినిచ్చిన సెలక్టర్లు ఆమె స్థానంలో స్మృతికి సారధ్య బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో జనవరి 10 నుండి 15 వరకూ జరిగిన ఈ సిరీస్‌లో స్మృతి సేన ఐర్లాండ్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లో స్మృతికి దీప్తి శర్మ డిప్యూటీగా వ్యవహరించింది. కాగా ఈ నెల 27 నుండి ప్రారంభమవుతున్న ఈ ట్రై సిరీస్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌లకూ శ్రీలంకలోని కొలంబో మైదానం ఆతిథ్యం ఇవ్వనుండగా, రౌండ్ రాబిన్ పద్దతిన జరగడంతో ప్రతీ జట్టు 4 మ్యాచ్‌లు ఆడుతుంది.

ఇందులో టాప్-2లో నిలిచి జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నెల 27న ఇండియా-శ్రీలంక, 29న ఇండియా-దక్షిణాఫ్రికా, మే 4న ఇండియా శ్రీలంక, 7న ఇండియా-దక్షిణాఫ్రికాల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక ఈ సిరీస్‌కు భారత్ జట్టులో హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రీచా హోష్ (వికెట్ కీపర్, యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్ జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, స్నేహ రాణా, అరుంధతి, తేజల్ హసాబ్నిన్, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్ ఉన్నారు.

## టెన్నిస్ టోర్నీలో..బోపన్న జోడీ డబుల్స్ విజయం

**న్యూఢిల్లీ:** మాంటె-కార్లో మాస్టర్స్‌లో భారత్ టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న, అమెరికాకు చెందిన బెన్ షెల్టన్ ద్వయం డబుల్స్ విజయం సాధించాడు. పారిస్‌లోని కంట్రీ క్లబ్ వేదికగా జరుగుతున్న మాంటె-కార్లో మాస్టర్స్‌లో భాగంగా జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బెన్ షెల్టన్ జోడీ 6-3, 7-5తో అర్జెంటీనాకు చెందిన ఫ్రాన్సిస్కో-చీలికి చెందిన అలెజండ్రో జంటపై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. తద్వారా బోపన్న ఎటిపి మాస్టర్స్ 1000 ఈవెంట్ చరిత్రలో సింగిల్స్ లేదా, డబుల్స్ మ్యాచ్ గెలిచిన 45 ఏళ్ల పెద్ద వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. కాగా మాంటె-కార్లో మాస్టర్స్ డబుల్స్‌లో మరో భారత్ అటగాడు యూకీ బాంబ్రీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

## ఓపెన్ టేబుల్ టెన్నిస్‌లో..
# ఛాంపియన్‌గా పెగూలా
### మరో మ్యాచ్‌లో మెయిన్ డ్రాకు నగాల్ అర్హత



**న్యూఢిల్లీ:** అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగులా తన కెరీర్‌లో ఎనిమిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. చార్ల్స్‌టన్ ఓపెన్ డబ్ల్యూటిఎ-500 టోర్నమెంట్‌లో పెగులా ఛాంపియన్‌గా అవతరించింది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్‌తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో పెగూలా 6-3, 7-5తో గెలుపొందింది. ఈ సీజన్‌లోకి పెగూలాకు ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఈ విజయంతో జెస్సికా తన కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌నుఅందుకుంది. విజేతగా నిలిచిన పెగూలాకు 1,64,000 డాలర్ల ప్రైజ్ మనీతో పాటు, 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. కాగా భారత పురుషుల టెన్నిస్ సింగిల్స్ నంబర్ వన్ సుమిత్ నగాల్ మోంజా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్-100 టోర్నమెంట్‌లో మెయిన్ డ్రా కు అర్హత సాధించాడు. ఇటలీకి చెందిన ఫెడరికో ఇనాకోన్‌తో జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ నగాల్ 6-4, 6-2తో గెలుపొంది మెయిన్ డ్రాలో చోటు దక్కించుకున్నాడు. 93 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్ చేశాడు.

# లీగ్‌తోనే బ్రేకప్!



**న్యూఢిల్లీ:** ఐపిఎల్-2025, 18వ సీజను ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఈ టోర్నీ ప్రారంభమై ఇప్పటివరకు రెండు వారాలు గడిచాయి. ఈ రెండు వారాల్లో చాలా మ్యాచ్‌లు హోరా హోరీగా పోరాడాయి. కొన్ని జట్లు బాగా ఆడగా, కొన్ని జట్లు మాత్రం తీవ్ర నిరాశపరిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ వంటి జట్లు ఇప్పటివరకు అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని ఏకైక జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. ఈ కారణంగా ఆ జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, కొన్ని జట్ల మార్గం ఇప్పుడు కష్టంగా అనిపిస్తోంది. ఇందులో లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టు కూడాఉంది. ఈ ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్‌కు దూరమయ్యే ప్రమాదంలో మూడు జట్లు ఉన్నాయి. వాటిలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఉన్నాయి. అయితే ఇంకా వీటికి ప్లే ఆఫ్స్‌కు వెళ్లేందుకు పూర్తిగా దారులు మాత్రం మూసుకుపోలేదు. ఏదైనా అద్భుతాలు జరిగితేనే తప్ప లేకుంటే ఈ జట్లు లీగ్ దశతోను ముగించాల్సి ఉంటుంది. ప్రధానంగా గత సీజన్‌లో ఫైనలిస్ట్ జట్టు అయిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. సన్ రైజర్స్ తొలి మ్యాచ్‌లోనే 286 పరుగులు చేసి సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. అయితే, అప్పటి నుంచి జట్టు బ్యాటింగ్ నిరంతరం విఫలమవుతూనే ఉంది. హైదరాబాద్ జట్టు వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగునఉంది. అలాగేఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ జట్టుకు ప్లేఆఫ్స్‌కు వెళ్లే మార్గం చాలా కష్టంగా మారింది. ముంబై ఇండియన్స్ లాగే ఇప్పటివరకు ఒకే ఒక మ్యాచ్‌లో గెలిచింది. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం కేవలం 2పాయింట్లతో పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు లేదా బ్యాట్స్‌మెన్స్ అంతగా రాణించడం లేదు. ఇక టోర్నమెంట్‌లో ముంబై ఇండియన్స్ ప్రదర్శన ఇప్పటివరకు చెప్పుకోదగిన విధంగాలేదు. 5 మ్యాచ్‌లుఆడగా, వీటిలో ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. ముంబై ఇండియన్స్ 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

# వాణిజ్యం

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 8:** ట్రంప్ టారిఫ్ దెబ్బతో గత సెషన్‌లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు మంగళవారం పుంజుకున్నాయి. సుంకాల విషయంలో ప్రపంచ దేశాలతో అమెరికా చర్చలకు సిద్ధమన్న సంకేతాలతో ఆసియాతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. ఈ సారి ఆర్‌బిఐ నుంచి మరో 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకుపైగా రాణించగా, నిఫ్టీ కూడా 22,600 పాయింట్ల ఎగువకు చేరింది. చివరికి అమ్మకాల కారణంగా లాభాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఉదయం సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. చివరికి సెన్సెక్స్ 1089.18 పాయింట్లు పెరిగి 74,227.08 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 374.25 పాయింట్లు పెరిగి 22,535.85 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.27గా ఉంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ మినహా అన్ని షేర్లూ లాభాల్లో ముగిసాయి. టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంకు షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 100, బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్సులు కూడా 2శాతం మేర లాభాల్లో ముగిసాయి. ఇక ఆసియా-పసిఫిక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ 5.68శాతానికిపైగా లాభపడగా, హాంగ్‌కాంగ్, షాంఘై మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సింగపూర్, తైవాన్, జకర్తా మార్కెట్లు నష్టాల్లో ముగిసాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. డోజోన్స్ ఫ్యూచర్స్ రెండు శాతం మేర లాభాల్లో ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 64డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3020 డాలర్ల వద్ద కొనసాగింది. సుంకాలపై చర్చకు కొన్ని దేశాలు ముందుకొచ్చాయని ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లో ఉత్సాహాన్ని నింపింది. ట్రంప్ కూడా కాస్త వెనక్కి తగ్గుతారనే అంచనాలున్నాయి. దీనివల్ల వాణిజ్య యుద్ధ ఆందోళనలు తగ్గుతాయనే సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను బలపర్చాయి. చైనా, వియత్నాం తదితర దేశాలతో పోలిస్తే ట్రంప్ సుంకాల వల్ల కలిగే నష్టం మనదేశానికి తక్కువనే అంచనాలు ఇన్వెస్టర్ల ఆందోళనలకు కాస్త ఊరటనిచ్చాయి. అటు ముడిచమురు ధర తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్ల ర్యాలీకి ఓ కారణంగా మారింది. కనిష్టాల వద్ద కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.



## ఇది ఆర్థిక అణు యుద్ధం: ట్రంప్‌నకు నిపుణుల హెచ్చరిక



**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు, ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని జెపి మోర్గాన్ సిఇఒ జెమి డిమోన్ అభిప్రాయపడ్డారు. ఆయన వాటాదారులకు విడుదలచేసిన వార్షిక లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. భారత్ వంటి దేశాలను తన దారిలోకి తెచ్చుకొనే కంటే, వాటితో సన్నిహిత సంబంధాలను పెంచుకోవడమే మంచిదని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో విధించిన టారిఫ్‌లు ద్రవ్యోల్బణాన్ని పెంచొచ్చు. అందువల్ల ఆర్థిక మాంద్యానికి దారితీసే అవకాశాలున్నాయి. ఆర్థిక వ్యవస్థ చెప్పుకోదగ్గ స్థాయిలో కుదుపునకు లోనవుతుంది. ఇందులో పన్ను సంస్కరణలు, డీ రెగ్యులేషన్లకు దారితీయడం వంటివి సానుకూల అంశాలైతే, పన్ను, వాణిజ్య యుద్ధం, ఏ మాత్రం తగ్గుముఖం పట్టని ద్రవ్యోల్బణం, ఆర్థిక లోటు, ఆస్తుల విలువలు గణనీయంగా పెరగడం, అస్థిరత వంటివి ప్రతికూలాంశాలు. పన్నుల పెంపు వల్ల దిగుమతి చేసుకొనే వస్తువులే కాదు, దేశీయంగా తయారైన వాటి ధరలు కూడా పెరుగుతాయి. ఇవి స్వల్పకాలంలో కనబడతాయి. ముఖ్యంగా దేశీయ ఉత్పత్తుల ఇన్‌పుట్ ధరలు, డిమాండ్ రెండూ పెరుగుతాయి అని వెల్లడించారు. ఇక భారత్ వంటి నాన్ అలైన్ దేశాల విషయంలో అమెరికానే స్నేహహస్తం చాచి సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. కీలక వాణిజ్య భాగస్వాములతో లోతైన సంబంధాలు కలిగిఉండడం ఆర్థిక, భౌగోళిక రాజకీయపరంగా మంచింది. అమెరికా కూటమిలో భాగస్వాములు కాకుండా ఉన్న నాన్ అలైన్ దేశాలైన భారత్, బ్రెజిల్ వంటి వాటితో సన్ని హితంగా ఉండాలి. వారికి వాణిజ్యం, పెట్టు బడుల్లో అమెరికా స్నేహహస్తం అందించాలి అని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అతిపెద్ద మద్దతుదారుగా నిలిచిన సంపన్నుడు బిల్ అక్మెన్ కూడా టారిఫ్‌లను తప్పుపట్టారు.

## 'మైక్రోసాఫ్ట్‌లో డిజిటల్ ఆయుధాల తయారీ'

**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** వాషింగ్టన్‌లో ఇటీవల జరిగిన మైక్రోసాఫ్ట్ 50వ వార్షికోత్సవ వేడుకలకు పాలస్తీనా అనుకూల ఉద్యోగులు అంతరాయం కలిగించారు. ఇజ్రాయెల్ సైనిక చర్యల్లో మైక్రోసాఫ్ట్ ప్రమేయం ఉందని ఆరో పిస్తూ ఇందులో కొందరు రాజీనామా చేశారు. వీరిలో మైక్రోసాఫ్ట్ ఎఐ విభాగానికి చెందిన ఇండో అమెరికన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వానియా అగర్వాల్ కూడా ఉన్నారు. గాజాలో హింసాకాండకు ఈ సంస్థ సహకరిస్తోందని ఆరోపిస్తూ మైక్రోసాఫ్ట్‌ను డిజిటల్ ఆయుధాల తయారీదారుగా అభివర్ణించారు. బహిరంగంగానే రాజీనామా సమర్పిస్తున్నట్లు ప్రకటిస్తూ నినాదాలతో సమావేశం నుంచి బయటకు వచ్చారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖతో మైక్రోసాఫ్ట్ కుదుర్చుకున్న 133 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని అగర్వాల్ ఖండించారు. కంపెనీ ఎఐ, అజూర్ క్లౌడ్ సేవలు పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సైనిక చర్యలకు మద్దతుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ క్లౌడ్, కృత్రిమ మేధ గాజాలో ఇజ్రాయెల్ సైన్యాన్ని మరింత ప్రాణాంతకంగా, విధ్వంసకరంగా మార్చేందుకు వీలు కల్పిస్తున్నాయి అని అగర్వాల్ కంపెనీకి సమర్పించిన ఇ-మెయిల్‌లో రాశారు. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీని ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థలు, యుద్ధ మౌలిక సదుపాయాలతో ముడిపెట్టిన నివేదికలను ఆమె ఉదహరించారు. అమెజాన్‌లో మూడేళ్లకుపైగా పని చేసిన తర్వాత 2023 సెప్టెంబరులో మైక్రోసాఫ్ట్‌లో చేరిన అగర్వాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు. పాలస్తీనాకు అనుకూలంగా ఉన్న ఉద్యోగుల్లో అసమ్మతి పెల్లుబుకుతున్న నేపథ్యంలో ఆమె నిరసన తెలపడం తాజాగా చర్చనీయాంశం అయింది. ఫిబ్రవరిలో సిఇఒ సత్య నాదెళ్లతో జరిగిన ఒక సమావేశంలో ఇలాంటి ఆందోళన కారణంగా అంతరాయం కలగడంతో ఐదుగురు సిబ్బందిని తొలగించారు. ఈ ఆరోపణలపై గానీ, అగర్వాల్ రాజీనామాపై గానీ మైక్రోసాఫ్ట్ ఇంకా బహిరంగంగా స్పందించలేదు.




## ప్రైమ్ మెంబర్‌షిప్ రద్దుపై అమెజాన్ పూర్తి రీఫండ్

**ముంబై, ఏప్రిల్ 8:** ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తన విడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ప్రైమ్ మెంబర్‌షిప్ క్యాన్సిలేషన్ పాలసీలో కీలక మార్పును ప్రకటించింది. సబ్‌స్క్రైబర్లు ఎప్పుడైనా సరే మెంబర్‌షిప్ క్యాన్సిల్ చేసుకుంటే పూర్తిగా రీఫండ్ ఇవ్వనున్నట్లు వెల్లడిం చింది. ఈ విధానాన్ని ఏప్రిల్ 9 నుంచి ప్రారంభించ నుంది. సాధారణంగా అమెజాన్ ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్న కస్టమర్లకు అదే రోజు లేదా మరుసటి డెలివరీ అందించడం, ప్రత్యేక డీల్స్, ప్రైమ్ విడియో, ప్రైమ్ మ్యూజిక్‌తో సహా అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లలో డిజిటల్ కంటెంట్‌కు యాక్సెస్ లభిస్తాయి. అయితే మెంబర్‌షిప్ రద్దు ప్రక్రియను కంపెనీ మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో తాజా మార్పును తీసుకొచ్చింది. అయితే ఇందులోనూ ఓ మెలిక ఉంది. కొత్త పాలసీ ప్రకారం, సబ్‌స్క్రైబర్లు తమ ప్రైమ్ మెంబర్‌షిప్ రద్దు కోసం ఎలాంటి కొనుగోళ్లు చేయనంత వరకు కొత్త ప్రయోజనాలను ఉపయోగించనంత వరకు ఎప్పుడైనా సరే పూర్తి రీఫండ్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఏవైనా ప్రయోజనాలు పొందితే, వాపసు ఉండదు. ఇప్పటివరకు ఉన్న దాని ప్రకారం, అమెజాన్ మెంబర్‌షిప్ తీసుకున్న మూడు రోజుల్లోపై మాత్రమే దాన్ని రద్దు చేసుకునే వీలుంది. ఇతర సందర్భాల్లో ఉపయోగించిన ప్రయోజనాల ఆధారంగా ఛార్జీలను వసూలు చేసి రీఫండ్ చేయడం జరుగుతుంది.



## అదానీ కొలంబో టెర్మినల్ షురూ

**ముంబై, ఏప్రిల్ 8:** డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ తాజాగా శ్రీలంకలోని కొలంబో పశ్చిమ అంతర్జాతీయ టెర్మినల్ (సిడబ్ల్యూఐటి)ను ప్రారంభించినట్లు వెల్లడించింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన సిడబ్ల్యూఐటిని కన్సార్షియం నిర్వహించనున్నట్లు తెలియచేసింది. కంపెనీ అధ్యక్షతన శ్రీలంక దిగ్గజం జాన్ కీల్స్ హోల్డింగ్స్ పిఎల్‌సి, శ్రీలంక పోర్ట్స్ అథారిటీ కన్సార్షియంలో భాగమైనట్లు పేర్కొంది. 35యేళ్ల కాలానికి నిర్మించు,నిర్వహించు, బదిలీ చేయి పద్ధతిలో ఒప్పందం అమలుకానున్నట్లు వివరించింది. 80 కోట్ల డాలర్ల పెట్టుబడులతో 1,400 మీటర్ల పొడవు, 20 మీటర్ల లోతుతో అభివృద్ధి చేసిన కొలంబో టెర్మినల్ వార్షికంగా 3.2 మిలియన్ టిఇయును హ్యాండిల్ చేయగలదని తెలియచేసింది. కొలంబోలో ఇది తొలి డీప్ వాటర్ టెర్మినల్‌కాగా, పూర్తి ఆటోమేటెడ్‌గా ఏర్పాటైనట్లు పేర్కొంది. తద్వారా కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాలు మెరుగుపడడం, వెస్సల్ టర్న్‌అరౌండ్ సమయం తగ్గడంవంటి సౌకర్యాలకు వీలు కలగనున్నట్లు తెలియచేసింది.



# ముద్రా యోజనకు పదేళ్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ప్రధాన మంత్రి ముద్రా యోజన (పిఎంఎంవై) పథకం ఏప్రిల్ 8కి పదేళ్లను పూర్తి చేసుకుంది. 2025 ఏప్రిల్ 8న ఈ స్కీమ్ ప్రారంభమైనప్పటి నుంచి భారతదేశం అంతటా 52 కోట్లకుపైగా లబ్ధిదారులకు రూ.33 లక్షల కోట్లకు పైగా పూచీకత్తు లేని రుణాలను పంపిణీ చేసింది. పిఎంఎంవై స్కీన్ పదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ముద్రా యోజన పథకం ఎంతో మందికి, వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను కల్పించింది. ఈ పథకం ద్వారా మేలు పొందిన కొంతమందితో మాట్లాడాను. వారి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. వ్యాపారాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రారంభమైన ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం, ఎంతో మంది ఎదగడానికి ఆర్థికంగా ఉపయోపడింది. గతంలో ఈ స్కీమ్ ద్వారా రూ.10 లక్షలు లోన్ ఇచ్చేవారు. అయితే 2024-25 కేంద్ర బడ్జెట్‌లో పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. ఈ పథకం నాలుగు రకాలుగా ఉంటుంది. అవి శిశు, కిషోర్, తరుణ్, తరుణ్ ప్లస్.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14